ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-5-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 102 పేజీలు: 10+4 వెల: 6.50

సిబిఐ డైరెక్టర్ పదవికి ఆరుగురి పేర్ల పరిశీలన **2**

ఖమ్మం హైవేపై 2 లారీలు ఢీ: ఇద్దరు సజీవ దహనం **3**

రెండుగా చీలిన అన్నాడిఎంకె! విజయ్‌కు మద్దతు పలికిన షణ్ముగం వర్గం **5**



టివికెకు 147 మంది మద్దతు లభించే అవకాశం

నేడు అసెంబ్లీలో విజయ్ బలపరీక్ష **2**



వరుసగా రెండోసారి అధికారంలోకి

మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం

అసోం పీఠంపై హిమంత **5**



# కొనుగోళ్లు పెంచండి



మంగళవారం కలెక్టర్ల విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌కుమార్, కోమటిరెడ్డి

## మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ పూర్తి

## అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం

## కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

## రైతులకు ఇబ్బంది రానివ్వొద్దు

## విడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే12:** మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్క జొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్ట ర్లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళ వారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విష యంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర క్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతీఅధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు.నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా >>2



నీట్ ప్రశ్నపత్రం లీకేజికి వ్యతిరేకంగా మంగళవారం న్యూఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

# నీట్ రద్దు

## త్వరలోనే తదుపరి పరీక్ష తేదీ వెల్లడి

## సిబిఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశం

### 3న జరిగిన పరీక్షకు దేశవ్యాప్తంగా హాజరైన 22.79 లక్షల మంది విద్యార్థులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 12:** ఈ నెల 3న జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) యుజీ-2026 ప్రశ్నాపత్రం లీకైనట్టు ఆధారాలు వెలువడిన నేపథ్యంలో నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ప్రకటించింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, పరీక్ష నిర్వహణలో అవకతవకల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించనున్నట్టు ఎన్‌టీఏ స్పష్టం చేసింది. త్వరలోనే నీట్ యూజీ పరీక్ష తేదీలు ప్రకటిస్తామని ఎన్‌టిఏ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రశ్నపత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. నీట్ పరీక్ష నిర్వహణలో పారదర్శకతను కాపాడటానికి, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టిఏ తెలిపింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు విభాగాల నుంచి అందిన నివేదికల ఆధారంగా పరీక్షా ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించినట్లు వెల్లడించింది. పరీక్ష పవిత్రత దెబ్బతినట్టు నిర్ధారణ కావడం వల్లనే మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు ఇప్పటికే చెల్లించిన పరీక్ష ఫీజును తిరిగి రీఫండ్ చేయనున్నట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. మళ్లీ నిర్వహించే పరీక్ష కోసం విద్యార్థులు ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఎన్‌టీఏ తన సొంత వనరులతోనే ఈ పరీక్షను నిర్వహించనుందని తెలిపింది. రీఎగ్జామ్ తేదీలు, కొత్త అడ్మిట్ కార్డుల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ >>2

పరీక్ష రద్దు దురదృష్టకరం: మంత్రి దామోదర రాజనర్సింహా **7**

# ఇక డిజిటల్ బిఆర్ఎస్

కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటాం **2**
కేంద్ర మంత్రి బండి సంజయ్



మంగళవారం ఎర్రవల్లిలో పార్టీ ప్రధానకార్యదర్శుల భేటీలో మాట్లాడుతున్న కెసిఆర్

## 71వేల మంది కార్యకర్తలకు శిక్షణ.. జిల్లాల వారీగా ఇన్‌చార్జీల నియామకం

## పార్టీ ప్రధాన కార్యదర్శులతో కెసిఆర్ కీలక సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే12:** భవిష్యత్ ఎన్నికల దృష్ట్యా బిఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం కెసిఆర్ డిజిటల్ మెంబర్షిప్‌పై ఫోకస్ పెట్టారు. ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో మంగళవారం సాయంత్రం పార్టీ ప్రధాన కార్యదర్శులు,కీలక నేతలతో సమావేశం నిర్వహించారు. ఆరు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన సర్(ఎస్ఐఆర్) ప్రక్రియతో పాటు, వోటర్ లిస్టు సవరణ తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్ ప్రక్రియలో జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సభ్యత్వం కూడా భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని డిజిటలైజేషన్ పద్ధతిలో జరపాలని కెసిఆర్ దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గానికి, రాష్ట్ర కమిటీ నుండి సభ్యత్వ సమన్వయ కర్తను నియమించాలని ఆదేశించారు. ప్రతీ మండలాని, మున్సిపల్ బాడీల వారిగా, సభ్యత్వ నమోదు కార్యక్రమం సజావుగా నిర్వహించడానికి, సభ్యత్వ సమన్వయ కమిటీలను నిర్ణయించాలని సూచించారు. డిజిటలైజేషన్ పద్ధతిలో సభ్యత్వ నమోదు చేయాలని భావించినందున, రాష్ట్రంలో వున్న 35,655 పోలింగ్‌లలో బూత్‌కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు శిక్షణాతరగతులు నిర్వహించాలని, ఈ సందర్భంగా డిజిటల్ మెంబర్ షిప్ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలపై శిక్షణ ఇవ్వాలని కెసిఆర్ స్పష్టం చేశారు. పార్టీ సభ్యత్వ నమోదు, డిజిటల్ >>2

# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

## నేడు పేట్ బషీరాబాద్ పోలీసుల ఎదుట విచారణ

## కేసు కొట్టివేయాలని హైకోర్టుకు అప్పీలు: రేపు విచారణ




మంగళవారం హైదరాబాద్‌లో బండి భగీరథ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసులో సిట్ విచారణ వేగవంతం అయ్యింది. ఈ కేసుకు సంబంధించి సాయి భగీరథ్‌కు సిట్ అధికారులు మంగళవారం సాయంత్రం నోటీసులు జారీ చేశారు. సాయి భగీరథ్‌కు నోటీసులు ఇచ్చేందుకు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లగా అక్కడ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కరీంనగర్‌లోని సాయి భగీరథ్ మేనమామ డాక్టర్ వంశీకృష్ణ ఇంటికి వెళ్లిన సిట్ >>2

# మావోయిస్టు నేత సంతోష్ దంపతుల లొంగుబాటు!

## గణపతి ముఖ్య అనుచరుల్లో ఒకరు

## సంతోష్ స్వస్థలం హనుమకొండ

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ తనభార్యతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది. ఝూర్ఖండ్‌లో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు >>2



# తెలంగాణకు 21 ఎపికి 10 టిఎంసిల కృష్ణా జలాలు

## తాగునీటి అవసరాల కోసం విడుదల

## కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ సమావేశం నిర్ణయం

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** కృష్ణా జలాల వినియోగం, తాగునీటి అవసరాలు, సాగునీటి పంపిణీ అంశాలపై హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) కీలక సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య విస్తృతంగా చర్చ జరిగింది. జలసౌధలో నిర్వహించిన ఈ సమావేశానికి రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఇప్పటికే వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో అధికారులు సూచించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, విడుదలలపై సమీక్ష నిర్వహించారు. అలాగే సాగునీటి అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి, దిగువ ప్రాంతాలకు నీటి సరఫరా వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. కృష్ణా జలాల వాటాపై ఇరు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. >>2





నీటి ఎద్దడి, విద్యుత్ కోతలపై సిఎం సోరెన్‌కు వ్యతిరేకంగా కుండలతో మంగళవారం రాంచీలో 'ఆక్రోష్ ర్యాలీ' నిర్వహించిన జార్ఖండ్ బిజెపి అధ్యక్షుడు ఆదిత్య సాహు, మాజీ ముఖ్యమంత్రి అర్జున్ ముండా తదితరులు

# తెలంగాణకు 21

>> నీటి వినియోగ వివరాలను బోర్డుకు సమర్పించాలని, అవసరానికి అనుగుణంగా విడుదల చేపట్టాలని కెఆర్ఎంబి అధికారులు సూచించినట్లు సమాచారం. సమావేశంలో తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, నీటి నిల్వలు, విడుదలపై అధికారులు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నాగార్జున సాగర్ నుండి తెలంగాణకు 16 టిఎంసిల నీళ్లు అందించాలని నిర్ణయించారు. ఏపీకి 10 టిఎంసిలు కేటాయించారు. ఇక శ్రీశైలం నుండి తెలంగాణకు 5 టిఎంసిల నీటిని కేటాయించారు. ఈ ఏడాది ఆగస్టు 15 వరకు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది. ఇక ఈ నెల 14న మరోసారి ఈ అంశంపై చర్చించేందుకు కెఆర్ఎంబి సమావేశం కానుంది. కాగా.. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుండి ఎపి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో నీటిని తరలిస్తోందని తెలంగాణ అధికారులు ఫిర్యాదు చేయడంతో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల మధ్య వేసవి తాగునీటి కేటాయింపు వివాదాలకు ముగింపు పలికేలా బోర్డు చర్చలు జరిపి కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే ఈనెల 14న మరోసారి బోర్డు ఎల్లుండి సమావేశం కానుండటంతో ఆ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది అన్నది ఆసక్తికరంగా మారింది. సమావేశ అనంతరం.. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదలశాఖ ఈఎన్‌సి జలసౌదలో విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నాటి కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ సమావేశం సానుకూలంగా సాగిందన్నారు. ఏపీకి సాగర్ నుంచి 10 టీఎంసీలు ఇవ్వడానికి ఒప్పందం కుదిరిందన్నారు. సమావేశంలో కేవలం నీటి కేటాయింపులపైనే చర్చ జరిగిందన్నారు. ఈ నెల 14నాటి సమావేశంలో మిగతా కృష్ణా నదీ జలాల విషయంలో సమస్యలపై చర్చించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కాగా.. తెలంగాణ విజ్ఞప్తిని కెఆర్ఎంబి పెడచెవిన పెట్టిందని నీటిపారుదలశాఖవర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత నీటి సంవత్సరంలో ఏపి కోటాకు మించి కృష్ణా జలాలను వినియోగించుకుందని, ఇకపై నీటిని విడుదల చేయొద్దని తెలంగాణ నీటిపారుదలశాఖ కెఆర్ఎంబిని కోరింది. ఈవిషయమై కెఆర్ఎంబికి ఈ నెల 2న ఈఎన్‌సి రమేష్‌బాబు లేఖ రాశారు. వాస్తవానికి ఎపి 10 టిఎంసిల నీటిని సాగర్ కుడి కాలువ ద్వార కోరగా మంగళవారంనాటి సమావేశంలో ఏకంగా 16 టిఎంసిలను కేటాయించడంపై తెలంగాణ నీటిపారుదలశాఖవర్గాలు మండిపడుతున్నాయి.

# ఇక డిజిటల్ బిఆర్ఎస్

>> పద్ధతిలో చేపట్టేందుకు తగిన శిక్షణా శిబిరాలను పార్టీ ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో కొనసాగించాలని పేర్కొన్నారు. కాగా, సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ఇంచార్జీలను నియామకం చేశారు. నియమించిన ఇన్‌చార్జీలు వీరే:-ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు-తక్కళ్లపల్లి రవీందర్ రావు(ఎంఎల్సీ),జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలు - జీవన్ రెడ్డి(మాజీ మంత్రి' ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలు -సత్యవతి రాథోడ్(మాజీ మంత్రి), జనగాం, హనుమకొండ, వరంగల్ జిల్లాలు-పల్లా రాజేశ్వర్ రెడ్డి(ఎమ్మెల్యే), మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాలు- గ్యాదరి బాలమల్లు,నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు-గంగాధర్ గౌడ్ (మాజీ ఎమ్మెల్సీ), మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలు -నారదాసు లక్ష్మణ్ రావు, (మాజీ ఎమ్మెల్సీ), ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు- రావుల శ్రావణ్ కుమార్‌రెడ్డి,వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు -సబితా ఇంద్రారెడ్డి(మాజీ మంత్రి,ఎమ్మెల్యే).మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలు-మహమూద్ అలీ(మాజీ మంత్రి)గద్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు-మెట్టు శ్రీనివాస్,మేడ్చల్ ,మల్కాజిగిరి,యాదాద్రి జిల్లాలు- పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి(ఎంఎల్సీ), హైదరాబాద్ జిల్లా-తలసాని శ్రీనివాస్ యాదవ్, (మాజీ మంత్రి, ఎమ్మెల్యే)నల్గొండ, సూర్యాపేట జిల్లాలు-ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదును పర్యవేక్షణ చేయనున్నారు.

## సిబిఐ డైరెక్టర్ పదవికి ఆరుగురి పేర్ల పరిశీలన

### ప్రధాని నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థ సిబిఐకి కొత్త డైరక్టర్‌ను ఎంపిక చేసేందుకు మంగళవారం సాయంత్రం ప్ర ధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ అయ్యింది. ప్రధాని కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో మోదీతో పాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా పాల్గొన్నారు. ఈ భేటీలో ఈ నెల 25వ తేదీన పదవీ విరమణ చే స్తున్న సిబిఐ ప్రస్తుత డైరక్టర్ ప్రవీణ్ సూద్ స్థానంలో కొత్త బాస్‌ను ఎంపిక చేసేందుకు ఎనిమిది మంది సీనియర్ ఐపిఎస్ అధికారుల పేర్లను పరిశీలించారని సమాచారం. ఇందులో ఉమ్మడి ఎపి కేడర్‌కు చెం న జాతీయ పోలీసు అకాడమి డైరక్టర్ అమిత్ గార్గ్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రా లకు చెందిన సీనియర్ ఐపిఎస్ అధికారులు శతృజిత్ సింగ్ కపూర్, జిపి సింగ్, అజయ్ కుమార్ శర్మ. పీయూష్ ఆనంద్, సతీష్ గోల్చా, రా డైరక్టర్ పరాగ్ జైన్, మహారాష్ట్ర డిజిపి సదానంద్ దాతేల పేర్లను ఈ భేటీలో పరిశీలించినట్లు తెలిసింది. ఇందులో నుంచి ఒకరిని సిబిఐ డైర క్టర్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం.

# $45^{0}$ దాటిన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** తెలంగాణ నిప్పుల కొలిమిలా మారింది. భానుడి ప్రతాపానికి జనాలు బెంబేలెత్తిపోతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో మే 14 నుండి 21 వరకు తీవ్రమైన వడగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, వనపర్తి, గద్వాల జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఈ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45-47 డిగ్రీల మధ్య నమోదయ్యే ప్రమాదముందని అధికారులు హెచ్చరించారు. మిగతా జిల్లాల్లో 42-45 డిగ్రీల వరకు నమోదుకావొచ్చని అంచనా వేస్తున్నారు.

# నీట్ రద్దు

>> ద్వారా ప్రకటిస్తామని వెల్లడించింది. నీట పరీక్ష రద్దు వలన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు కలిగే ఇబ్బందిని గుర్తించామన్న ఎన్‌టీఏ, వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టేందుకు ఈ నిర్ణయం తప్పలేదని పేర్కొంది. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అధి కారిక సమాచారాన్ని మాత్రమే అనుసరిం చాలని సూచించింది. నీట్ పరీక్షలో తలెత్తిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్ప గించింది. సీబీఐ దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. అందుకు అవసరమైన అన్ని రికార్డులు, పత్రాలు, సమాచారాన్ని అందిస్తామని స్పష్టం చేసింది. రాజస్థాన్‌లోని కోటాలో నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకైనట్లు గుర్తించారు. కోటాలో కోచింగ్ సెంటర్లు ఇచ్చిన మెటీరియల్‌తో పోలి ఉన్నట్లు తేల్చారు. ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలు పరీక్షకు ముందు రాజస్థా న్‌లోని కోచింగ్‌సంస్థలు పంపిణీ చేసిన మెటీరియల్‌తో పోలి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈనెల 3న జరిగిన పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించి నట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ మీడియాకు వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పరీక్షకు 42 గంటల ముందు వాట్సప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు నిర్ధారించారు. దానిని విద్యార్థులకు రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయిం చారన్న ఆయన.. కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలు చేశారని గుర్తించామన్నారు.

ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితు లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహా రంపై స్పందించిన ఎన్‌టీఏ.. నీట్ యూజీ -2026కి సంబంధించి అవకతవకలు జరిగి నట్లు వస్తున్న ఆరోపణలు తమ దృష్టికి వచ్చి నట్లు తెలిపింది. తర్వాత కేంద్ర విద్యాశాఖను సంప్రదించి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటిం చింది. మే 3న దేశవ్యా ప్తంగా నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష భారత్‌లోని 551 నగ రాలు, విదేశాల్లోని 14 నగరాల్లో కలిపి 5,400కు పైగా కేంద్రాల్లో నిర్వహించగా.. పరీక్షకు సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు.

## వారం - వర్జ్యం

13-05-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
ఏకాదశి మ.1.24
ఉత్తరాభాద్ర రా.12.13
వర్జ్యం : ఉ.10.25-ఉ.11.57
దు. ఉ.11.38-మ.12.30
శుభసమయం: ఉ.8.30-9.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** మీరు తలపెట్టిన కార్యక్రమాలు, వ్యవహారములు విజయవంతమవుతాయి. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి.

**వృషభం:** విలువైన పత్రములు డాక్యుమెంట్స్ మొదలైన వాటిలో జాగ్రత్త అవసరం. పురోభివృద్ధి మాత్రం నామమాత్రమే.

**మిథునం:** విలువైన వస్తువుల కొనుగోలు విషయాలలో తగిన శ్రద్ధ చూపడం చెప్పదగినది. విందు, వినోదాలు పాల్గొంటారు.

**కర్కాటకం:** మిమ్ములను మోసం చేసే ప్రయత్నాలు ఫలించవు. నేర్పుతో ముఖ్యుల వద్ద గుర్తింపు పొందుతారు. వస్త్రలాభం.

**సింహం:** సంతాన విద్యా విషయాలు పురోభివృద్ధిలో ఉంటాయి. కొంతమేర జాగ్రత్తలు అవసరం. ఆధ్యాత్మిరంగంలో పాల్గొంటారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలలో జాగ్రత్తలు అవసరం. పెట్టుబడుల విషయంలో తొందరపాటువద్దు. వాహనసౌలభ్యం.

**తుల :** కోర్టు కేసుల నుండి బయట పడతారు. ఎంతోకాలంగా ఊరిస్తున్న అవకాశాలు లాభిస్తాయి. స్థలాలు కొనుగోలు.

**వృశ్చికం:** కుటుంబంలో మరొకరి సంపాదన ప్రారంభమయ్యే సూచన ఉన్నాయి. ఆత్మీయవర్గానికి ధన సహాయం చేస్తారు.

**ధనుస్సు:** విధి నిర్వహణలో పై అధికారుల ప్రశంసలు అందుకుంటారు. వాహనాల విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండండి.

**మకరం:** తక్కువ వ్యవధిలో సాగే తాత్కాలిక వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగాల పరంగా ఆటంకాలు తొలగిపోతాయి.

**కుంభం:** పని వత్తిడి అధికంగా ఉంటుంది. మనస్సు విశ్రాంతిని కోరుకున్న పరిస్థితులు అందుకు అంగీకరించవు.


**మీనం:** ముఖ్యంగా ఎంతసేపూ ఆర్థిక వనరులను పెంపొందించుకునే విషయం పైనే దృష్టిని సారిస్తారు. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేడు అసెంబ్లీలో విజయ్ బలపరీక్ష

### అన్నాడిఎంకె చీలిక వర్గం మద్దతు

## టివికెకు 147 మంది మద్దతు లభించే అవకాశం



మంగళవారం చెన్నైలో అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిఎం విజయ్, డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ తదితరులు

**చెన్నై, మే 12:** అసెంబ్లీలో బలపరీక్షకు సిద్ధం అవుతున్న తరుణంలో విజయ్‌కు అనుకోని పరిణామాలు అనూహ్యంగా ఎదురయ్యాయి. ఒకే ఒక్క ఓటుతో గెలిచిన ఎమ్మెల్యే సేతుపతి బలపరీక్షలో పాల్గొనవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశాలిచ్చింది. దీనితో విజయ్ బలం 119కి తగ్గింది. అయినా కూడా మెజార్టీపరంగా విజయ్‌కు మంగళవారం అనుకోని విజయాలు వచ్చిచేరాయి. అన్నాడిఎంకెలోని చీలికవర్గం ఎమ్మెల్యేలు 27 మంది సీనియర్ నాయకుడు షణ్ముగం నేతృత్వంలో విజయ్‌కు మద్దతు పలికేందుకు సిద్ధం అయ్యారు. దశాబ్దాలుగా వస్తున్న రాజకీయ వైరుధ్యాన్ని కాదని డిఎంకెతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేద్దామన్న అన్నాడిఎంకె నేత మాజీ సీఎం పళనిస్వామి వాదనను తీవ్రంగా విభేదించిన సీనియర్ నాయకులు షణ్ముగం, వేలుమణి, సి విజయభాస్కర్‌లు పళనిస్వామి నిర్వహించిన సమావేశంనుంచి బయటకు వచ్చేసారు. అంతేకాకుండా విజయ్‌కు మద్దతివ్వనున్నట్లు ప్రకటించారు. దీనితో అసెంబ్లీలో విజయ్ బలం ఇపుడు 147 దాటుతోంది. దీనితో ఆయన బలపరీక్షను సులువుగా అధిగమిస్తారన్న ధీమా టివికె ఎమ్మెల్యేల్లో ఏర్పడింది. భవిష్యత్తులో కూడా కాంగ్రెస్; సిపిఐ, సిపిఎం, విసికె, ఐయుఎంఎల్ వంటి పార్టీలు కప్పదాటువేసినా తన మెజార్టీకి ఏమాత్రం ఢోకాలేని విధంగా విజయ్ ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధంచేసారు. అందులోభాగంగానే వేలుమణి,షణ్ముగంల ప్రకటన ఆహ్వానంమేరకు వారి నివాసాలకు వెళ్లి అన్నాడిఎంకె రెబెల్ ఎమ్మెల్యేందరినీ కలుసుకున్నారు. తనతో కలిసి వచ్చిన ఎమ్మెల్యేలక ఎప్పటికీనష్టం జరగనీయనన్న భరోసా కల్పించడంతో వారంతా విజయ్‌కు అసెంబ్లీ బలపరీక్షలో మద్దతిచ్చేందుకే నిర్ణయించారు. ఇందుకోసం వారు ఒక ప్రత్యేక కూటమిగా ఏర్పడి మద్దతిస్తారని సమాచారం. ఇప్పటికే రెబెల్ ఎమ్మెల్యేలు ప్రొటెం స్పీకర్‌కు తమ పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా వేలుమణిని గుర్తించాలని కోరుతూ లేఖరాసారని చెపుతున్నారు. అయితే వీరి నిర్ణయాన్ని పళనిస్వామి తీవ్రంగా వ్యతిరేకిస్తూ తానే లెజిస్లేచర్‌పార్టీనాయకుడినని చెపుతున్నారు. అయితే వీరిద్దరిలో ఎవరిని శాసనసభా పక్షనేతగా గుర్తిస్తారనేది అసెంబ్లీలో తేలిపోతుంది. స్పీకర్ నిర్ణయం ఆధారంగా కూడా పార్టీలో చీలిక ఏర్పడుతుంది. అన్నాడిఎంకెకు 47 సీట్లు అసెంబ్లీలో ఉండగా వారిలో ఇప్పటికిప్పుడు 30 మంది వరకూ టివికె విజయ్‌కు సంపూర్ణమద్దతు ప్రకటిస్తున్నట్లు స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. దీనితో బుధవారం నాడు సీఎం విజయ్ బలపరీక్ష అత్యంత సులువుగా గట్టెక్కుతారని పార్టీ వర్గాల్లోను, విజయ్ కూటమిలోనూ అత్యంత ధీమా వ్యక్తం అవుతోంది. మద్దతు కూడగట్టడంలో విజయ్ కూడా దూకుడుగానే ఉన్నారు. షణ్ముగం నివాసానికివెళ్లి రెబెల్ ఎమ్మెల్యేందరితోనూ భేటీ అయ్యారు. వారంతా బహిరంగంగానే తమ మద్దతును ప్రకటించారు. దీనితో విజయ్ బలపరీక్షలో సులువుగా గట్టెక్కేందుకు అనువైన వాతావరణం ఏర్పడింది.

# కొనుగోళ్లు పెంచండి

>> ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవధ్థకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షి స్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**పంట కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.



మంగళవారం గువాహతిలో అసోం సిఎం హిమంత ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరులు

# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

>> బృందం అక్కడ సాయి భగీరథ్ కోసం వాకబు చేయగా లభించలేదు. ఆఖరుకు సెల్‌ఫోన్ కూడా స్విచాఫ్ రావడంతో ఆయన ఇంటికి సాయి భగీరథ్‌కు సంబంధించిన నోటీసులు అతికించారు. బుధవారం మధ్యాహ్నం పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో వెల్లడించారు. మరోవైపు తనపై నమోదైన ఫోక్సో కేసును కొట్టి వే యాలని సాయి భగీరథ్ మంగళవారం నాడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. హైకోర్టుకు వేసవి సెలవుల కారణంగా కొన్ని కేసుల విచార ణకు ఏర్పాటైన స్పెషల్ బెంచ్‌లో సాయి భగీరథ్ పిటిషన్ గురువారం విచారణ జరగనుందని సమాచారం. సాయి భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఈ నెల ఎనిమిదవ తేదీ రాత్రి నమోదైన బిఎన్ఎస్ 74,75 సెక్షన్లతో పాటు ఫోక్సో సెక్షన్ తాలూకా కేసు విచారణ వేగం పుంజుకుంది. సిట్ ప్రాథమిక విచారణ అనంతరం కేసును మరింత బలోపేతం చేసేందుకు సెక్షన్లు మార్చినట్లు సమాచారం. కొంప ల్లి ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలికతో సాయి భగీరథ్ గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన శివార్లలోని చేవెళ్లలో గల ఆ లూరులో ఓ ఫాం హౌ స్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో అసభ్యంగా ప్రవర్తించిన అభియోగాలపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మే రకు ఈ కేసు నమోదవడం తెలిసిందే. బాలిక నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు సమాచారం. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనకు ఒక్క రోజు ముందు జరిగిన ఈ ఘటన రాజకీయంగా దుమా రం రేపడం విదితమే. దీని వెనుక రాజకీయ కుట్ర వుందని బండి సంజయ్ పేర్కొన్నారు. దీనిపై సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సైబరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన మహిళా డిసిపి రితిరాజ్ నేతృత్వంలో సోమవారం నాడు సిట్ ఏర్పాటు కాగా సిట్ బృందం వె ంటనే విచారణ మొదలు పెట్టి ంది. సిట్ బృందం మొదట పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి కేసు పూర్వపరాలు సేకరించడంతో పాటు దర్యాప్తు అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం కూడా సిట్ విచారణ కొనసాగింది. బాధిత బాలికతో పాటు సాయి భగీరథ్ సహా వారి మిత్రులు పాల్గొన్న నూతన సంవత్సర వేడుకలు జరిగిన ఫాం హౌస్ వివరాలను సిట్ బృందం సే కరించి దీనిపై సాయి భగీరథ్ వివరణ కోరేందుకు అతని ఫోన్ చేయగా స్విచాఫ్‌గా వుంది. సాయి భగీరథ్ ఫోన్ రెండు రోజులుగా స్విచాఫ్ వు ండడంతో నగరంలో పలుచోట్ల గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పాటు నూతన సంవత్సర వేడుకలు జరిగిన రోజున అక్కడ బందోబస్తులో వున్న పోలీసులను విచారించాలని సిట్ నిర్ణయించింది. దీంతో పాటు సాయి భగీరథ్ ఫిర్యాదు మేరకు కరీంనగర్‌లో బాధిత బా లిక, ఆమె తల్లిదండ్రుల పై నమోదైన కేసు, వీరిపై నిర్మల్‌లో నమోదైన మరో కేసు వివరాలను సిట్ బృందం తెప్పించుకుని, ఫోక్సో కేసుకు వాటికి ఏమైనా సంబంధాలు వున్నాయా...? అని పరిశీలించింది. కాగా బాధిత బాలిక వాంగ్మూలాన్ని మరోసారి నమోదు చేయాలని సిట్ నిర్ణ యించింది. ఈ వాంగ్మూలాన్ని సిట్ డిసిపి రితిరాజ్ స్వయంగా తీసుకునే వీలుంది.

**సాయి భగీరథ్ హాజరుపై ఉత్కంఠ...న్యాయవాదితో కలిసి లొంగిపోనున్నట్లు పోలీసులకు సమాచారం...?**

ఇదిలావుండగా ఫోక్సో కేసులో నోటీసులు అందుకున్న సాయి భగీరథ్ బుధవారం నాడు పోలీసుల విచారణకు హాజరవడంపై ఉత్కంఠ నెల కొంది. సాయి భగీరథ్‌ను విచారించేందుకు రెండు రోజులుగా సిట్ బృందం చేస్తున్న ప్రయత్నాలు ఫలించక పోవడంతోనే మంగళవారం నాడు కరీంనగర్‌లో ఆయన మేనమామ ఇంటికి నోటీసులు అంటించారు. మరోవైపు సాయి భగీరథ్ న్యాయవాదితో కలిసి బుధవారం నాడు పోలీసుల ఎదుట లొంగిపోన్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందిందని తెలిసింది.

# కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

## కుట్ర రాజకీయాలను తుదముట్టిస్తాం: కేంద్ర మంత్రి బండి సంజయ్

### కరీంనగర్‌లో ఘనంగా హిందూ ఏక్తా యాత్ర

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** హిందువుల ఐక్యత, ధర్మ పరిరక్షణ లక్ష్యంగా గత 16 ఏళ్లుగా నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర మంగళవారం కరీంనగర్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హిందూ ధర్మం కోసం చివరి శ్వాస వరకు పోరాడుతానని ప్రకటించారు.యాత్ర సందర్భంగా కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద కాషాయ జెండా ఎగురవేసిన ఆయన,"జై శ్రీరామ్" నినాదమే హిందూ ధర్మానికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

హిందూ సమాజానికి ఎలాంటి ఆపద వచ్చినా ప్రాణాలకు తెగించి పోరాడేందుకు సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు.తన రాజకీయ ప్రస్థానాన్ని ఒక చిన్న కార్యకర్తగా ప్రారంభించానని గుర్తు చేసుకున్న సంజయ్, గల్లీ గల్లీలో ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల మద్దతు సంపాదించా నన్నారు. గుండెలో స్టంట్ ఉన్నా లెక్కచేయకుండా 1600 కిలోమీటర్ల పాదయాత్ర చేశానని తెలిపారు. గత పాలకులు కేసులు పెట్టి జైలుకు పంపినా, రాళ్లతో దాడులు చేసినా భయపడలేదని వ్యాఖ్యానించారు. ఇటీవల తన కుమారు డిపై జరుగుతున్న ప్రచారంపై ఆయన భావోద్వేగానికి గురయ్యారు. సమాజం కోసం ఎక్కువ సమయం కేటాయించి, నా కొడుకుకు సమయం ఇవ్వలేకపోయాను. అది నా తప్పే.. నన్ను క్షమించండి" అంటూ కార్యకర్తల ముందే ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని, న్యాయవ్యవస్థను గౌరవిస్తామని, కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పారు.అవినీతి వ్యవస్థను, కుట్ర రాజకీయాలను తుదముట్టిస్తానని హెచ్చరించిన సంజయ్, తనను మరియు కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని విడిచిపెట్టబోమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఆయన ప్రసంగానికి కార్యకర్తలు జై శ్రీరామ్", బండి సంజయ్ జిందాబాద్" నినాదాలతో మద్దతు తెలిపారు.హిందూ ఏక్తా యాత్ర నేపథ్యంలో కరీంనగర్ నగరంలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేయగా, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మావోయిస్టు నేత సంతోష్ దంపతుల లొంగుబాటు

>> నిర్వహిస్తున్న సంతోష్ దంపతుల కోసం కేంద్ర బలగాలు కొంత కాలంగా గాలిస్తుండడం తెలిసిందే. మావోయిస్టు పార్టీ అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతికి ముఖ్య అనుచరుల్లో సంతోష్ కూడా ఒకరు. గణపతి సహా ఆరుగురు కీలక నేతల కోసం కేంద్ర బలగాలు గాలిస్తున్న తరుణంలో మావోయిస్టు పార్టీకి చెందిన అనేక మంది తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలతో లొంగిపోయారు. ఈ క్రమంలో సంతోష్ దంపతులతో పాటు అజ్ఞాతంలో వు న్న నేతలను లొంగిపోయేలా చేసేందుకు ఎస్ఐబి పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

పోలీసులతో పాటు లొంగిపోయిన ఇంకొందరు మావోయిస్టులు కూడా సంతోష్ దంపతుల లొంగుబాటుకు కృషి చేశారు. ఈ నేపథ్యంలోనే సంతోష్ దంపతులు పోలీసుల ఎదుట లొంగి పోయినట్లు సమాచారం. సంతోష్ స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామం. ఆయన సతీమణి ఎపికి చెందిన వారు. సంతోష్ మావోయిస్టు పార్టీ తరపున పలు కీలక ఆపరేషన్లలో పాల్గొని పోలీసులకు వాంటెడ్‌గా వున్నాడు. ఛత్తీస్‌ఘడ్, ఝార్కండ్‌లలో పోలీసులపై జ రిగిన అనేక దాడుల్లో సంతోష్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసు రికార్డుల్లో వుంది. సంతోష్ దంపతులపై రివార్డు కూడా వుంది. కాగా వీరి లొంగుబాటుపై బుధవారం నాడు పోలీసు శాఖ మీడియాకు వివరాలు వెల్లడించే వీలుందని తెలిసింది. సంతోష్ దంపతుల లొంగుబాటు తరువాత ఝార్కండ్‌లోని సరండా అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి చెందిన మరో అగ్రనేత మిసిర్ బెస్ర కోసం కేంద్ర బలగాలు కూంబింగ్ కొనసాగిస్తున్నాయి.

# నేడు, రేపు టిజిఐసెట్ పరీక్షలు

## 16 రీజనల్ సెంటర్లలో 69 పరీక్షా కేంద్రాలు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐ సెట్-2026 పరీక్షలను నేడు(బుధవారం), రేపు(గురువారం) నిర్వహించనున్నారు. టీజీ ఐసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు ప్రకటించారు. ఐసెట్-2026ను రెండవ పర్యాయం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నిర్వహించనున్నట్లు కన్వీ నర్ ఆచార్య అలువాల రవి తెలిపారు. నేడు, రేపు కలిపి మూడు విడతల్లో ఐ సెట్ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఐసెట్‌కు 56,223 మంది దరఖాస్తు చేశారు. వారిలో 30,308 మంది మహిళలు, 25,915 మంది పురుషులు దరఖాస్తు చేసుకున్నారు. నేడు (బుధవారం) మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండవ సెషన్‌ను మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు, రేపు (గురువారం) మొదటి సెషన్ నిర్వహించనున్నారు. దివ్యాంగులు, ఉర్దూ విద్యార్థులకు నేటి మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షను నిర్వహించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 16 రీజినల్ సెంటర్లలో, 69 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. 100 మంది పరిశీలకులతో పారదర్శకంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షకు 15 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రం గేట్లను మూసివేయనున్నట్టు అధికారులు ప్రకటించారు.

రుణాల వసూలు అప్పీలేట్ ట్రిబ్యునల్లో, కోల్‌కతాలో
9, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ స్ట్రీట్, 7వ అంతస్తు, కోల్‌కతా-700001.
డైరీ నెం. 1148/2025
బి. విజయ భాస్కర్ రెడ్డి ...అప్పీలుదారు
ఎదురుగా
బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు మరొకరు ...ప్రతివాదులు
To,
ఎస్. శ్రీనివాస్ చక్రవర్తి, తండ్రి పేరు ఎస్. పుష్ప రాజు,
నివాసం: ఫ్లాట్ నెం. G2, ద్వారకా ఎన్ క్లేవ్,
సంతకం
రుణాల వసూలు అప్పీలేట్ ట్రిబ్యునల్

# రైల్‌రోకో కేసులో కవితసహా టిఆర్ఎస్ నేతలు 12 మందికి సమన్లు

## నేడు విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) కామారెడ్డిలో ఇటీవల నిర్వహించిన రైల్ రోకోకు సంబంధించి సికిందరాబాద్ రైల్వే కోర్టు ఆ పార్టీ అధినేత కవితతో పాటు 12 మందికి మంగళవారం నోటీసులు జారీ చేసింది. దీనిపై బుధవారం నాడు విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. కామారెడ్డిలో కవిత చేబట్టిన రైల్‌రోకో వల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగడం తెలిసిందే. రైల్వే చట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి నేరాలపై రైల్వే కోర్టు రైల్వే యాక్ట్ 147, 74 (ఎ) సెక్షన్ల కింద వీరిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి సికింద్రాబాద్ రైల్వే కోర్టు కవిత సహా 12 మందిని బుధవారం విచారణ కు కోర్టుకు రావాలని ఆదేశించింది.

దక్షిణ మధ్య రైల్వే
No.DEE-GS-BZA-40-2026-27 తేది: 11.05.2026 (ireps.gov.in ద్వారా)
ఇ-టెండరు నోటీసు నెం. B-SG-P-E-01-NDD-2026-27 తేది: 08.05.2026
ఇ-టెండరు నోటీసు నెం. N-SG-36-2026-27-COP-09 తేది: 08.05.2026
ఇ-టెండరు నోటీసు నెం. N-SG-36-2026-27-TWS-74-10 తేది: 08.05.2026
ఇ-టెండరు నోటీసు నెం. N-SG-36-2026-27-Hazard-12 తేది: 08.05.2026
www.ireps.gov.in
తదుపరి టెండరు నిబంధనలు /నియమాలు మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.

# తమిళనాట ఆలయాలు, విద్యాసంస్థల వద్ద మద్యం షాపులపై వేటు

## 717 దుకాణాలు మూసేయాలని సిఎం విజయ్ ఆదేశాలు

**చెన్నై, మే 12:** తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే విజయ్ సంచలన నిర్ణయంతో తన పాలనను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న 717 మద్యం దుకాణాలను తక్షణమే మూసివేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి చాలాకాలంగా వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సీఎం విజయ్ తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ విజయ్‌కు అభినందనలు తెలిపారు. తమిళ కుటుంబాల ఆకాంక్షలను గౌరవిస్తూ, పదవి చేపట్టిన వెంటనే సీఎం విజయ్ తీసుకున్న ఈ చర్య ప్రశంసనీయమని కమల్ పేర్కొన్నారు. మద్యం విక్రయించడం ప్రభుత్వ ప్రధాన విధి కాకూడదని, దాని ప్రవాహాన్ని నియంత్రించడంపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ప్రస్తుతం 717 దుకాణాలను మూసివేయడం ఒక మంచి ప్రారంభమని, భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింత పెంచి, పూర్తి నియంత్రణ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని కమల్ హాసన్ ఆకాంక్షించారు. ఈ నిర్ణయంతో విజయ్ తన పాలనపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చారని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

# సనత్‌నగర్ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

## ప్రధాన నిందితుడికి ఉరిశిక్ష, సహకరించిన వ్యక్తికి పలు శిక్షలు

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), మే 12, ప్రభాతవార్త :** సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడేళ్ల క్రితం జరిగిన బాలుడు అబ్దుల్‌వాహిద్ ఖాన్ కిరాతకహత్య కేసులో న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో బాలుడిని అపహరించి ప్రాణాలు తీసిన ప్రధాన నిందితుడు ఇమ్రాన్ అలీఖాన్ అలియాస్ ఫిజాకు కోర్టు ఉరిశిక్ష విధించింది. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని మూడో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కమ్ ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం తుది తీర్పును వెలువరించారు.

కేసు వివరాల్లోకి వెళ్తే.. 2023 ఏప్రిల్ 20న సనత్‌నగర్ పరిధిలో అబ్దుల్ వాహిద్ ఖాన్ అనే బాలుడు అపహరణకు గురై హత్యకు గురయ్యాడు. దీనిపై అదేరోజు సనత్‌నగర్ పిఎస్ లో క్రైమ్ నంబర్ 279/ 2023 కింద కేసు నమోదైంది. ప్రధాన నిందితుడు ఏ-1 ఇమ్రాన్ అలీఖాన్ బాలుడిని కిడ్నాప్ చేసి అత్యంత దారుణంగా హత్య చేసి నట్లు పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించారు. హత్య అనంతరం మృత దేహాన్ని మాయం చేయడంలో ఏ-2 మోహమ్మద్ రఫీక్ సహకరించినట్లు విచారణలో తేలింది. సుదీర్ఘ వాదనల అనంతరం నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి కఠినశిక్షలు ఖరారు చేశారు.

ప్రధాన నిందితుడు ఏ-1 ఇమ్రాన్‌అలీ ఖాన్‌కు ఐపిసి సెక్షన్ 302 కింద మరణశిక్షతోపాటు సెక్షన్ 364 కింద జీవిత ఖైదు, మరికొన్ని ఇతర సెక్షన్ల కింద కఠిన కారాగారశిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు. మృతదేహం తరలింపులో సహకరించిన ఏ-2 మొహమ్మద్ రఫీక్‌కు ఐపిసి సెక్షన్ 201, 202 కింద శిక్షలు ఖరారు చేశారు. 2023లో జరిగిన ఈ ఘోర కలికి మూడేళ్లలోపే న్యాయం జరగడం పట్ల మృతుడి కుటుంబసభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ప్రధాన నిందితుడు ఇమ్రాన్‌అలీఖాన్, సహకరించిన నిందితుడు మహమ్మద్ రఫీక్

# ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు

## కులం పేరుతో దూషించినందుకు పదకొండేళ్లు జైలుశిక్ష

**నల్గొండ టౌన్, మే 12, ప్రభాతవార్త:** తప్పు చేస్తే కాలం వెంటాడుతుందనడానికి నల్గొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు వెలువరించిన తీర్పు నిదర్శనంగా నిలుస్తుందని నిరూపిస్తూ 13 ఏళ్ల క్రితం నాటి ఓ అమానుష ఘటనపై నల్గొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక సెషన్స్ మంగళవారం సంచలన తీర్పునిచ్చింది. ప్రేమ పేరుతో వంచించి కులం పేరుతో దూషించిన నిందితులకు కోర్టు కఠినకారాగర శిక్షలను ఖరారు చేసింది. కోర్టు తీర్పు అనుగుణంగా నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించిన పూర్వపురాలు ఇలా ఉన్నాయి. 2013లో చందంపేట మండలం గన్నేరులపల్లికి చెందిన నక్క పర్వతాలు దిండి మండలం చెందిన యువతీని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. తీరా బాధితురాలు పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి పర్వతాలు మరియు అతని అత్త నీలం సత్తమ్మ కలిసి ఆమె కులాన్ని కించపరుస్తూ తీవ్రంగా దూషించి పెళ్లికి నిరాకరించారు. సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు నిందితులకు భారీ శిక్షలను విధించింది. నిందితుడు నక్క పర్వతాలకు వేరువేరు సెక్షన్ల కింద కలిపి మొత్తం 11 ఏళ్ల జైలు శిక్షతోపాటు ఐదు వేల జరిమానా విధించబడింది.

అదే సమయంలో నిందితురాలు నీలం సత్తమ్మకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు 3000 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో రెండు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం ఈ శిక్షలని ఏకకాలంలో అమలు కాలున్నాయి.

ఇదిలా ఉండగా బాధితురాలుకి న్యాయం చేకూర్చడంలో కీలకపాత్ర పోషించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరసింహతో పాటు దర్యాప్తులో అప్పటి ఎస్సై రామాంజనేయులు, మాజీ దేవరకొండ ఎస్ డి పి ఓ మనోహర్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణన్, కానిస్టేబుల్ లింగయ్య బాధితులకు భరోసా ఇచ్చేలా నేరస్థుల్లో వణుకు పుట్టించేలా ఈ తీర్పు ఉంది. సాక్ష్యాధారాలను పకడ్బందీగా సమర్పించిన ప్రతి అధికారికి ఎస్పీ శరత్చంద్ర పవర్ తెలిపారు. ప్రస్తుతం డిండి పోలీస్ స్టేషన్లో బాధ్యతలను ఎస్సై బాలకృష్ణ, సిఐ బీసన్న దేవరకొండ ఎస్ డి పి ఓ శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్న వారికి కూడా అభినందనలు తెలిపారు.

కాగా కాలం గడిచిన న్యాయం గెలుస్తుందని బలహీన వర్గాలపై వేధింపులకు పాల్పడితే శిక్షలు తప్పవని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

# ఖమ్మం హైవేపై రెండు లారీలు ఢీ

## ఇద్దరు డ్రైవర్లు సజీవదహనం, క్లీనర్‌కు గాయాలు

## ఇద్దరి ప్రాణాలు తీసిన నిద్రమత్తు!



**తిరుమలాయపాలెం, మే 12, ప్రభాతవార్త:** నిద్రమత్తు కారణంగా ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మేకల తండా స్టేజి వద్ద మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొగ్గు లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఎదురుగా వస్తున్న ఆలుగడ్డ లారీని ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గుంటూరు జిల్లాకు చెందిన 57 ఏళ్ల జేమ్స్ వైజాగ్ నుంచి బొగ్గు లోడ్‌తో మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళ్తుండగా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన 35 ఏళ్ల ప్రకాశం ఆగ్రా నుంచి ఆలుగడ్డ లోడ్‌తో ఖమ్మం వైపు వస్తున్నాడు. నిద్రమత్తులో ఉన్న జేమ్స్ లారీని అదుపు తప్పి ఎదురుగా వచ్చి ప్రకాశం లారీని ఢీకొట్టాడు. ప్రమాద తీవ్రతకు రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఢీకొన్న వెంటనే బొగ్గు లారీలో భారీగా మంటలు చెలరేగాయి. క్యాబిన్‌లో చిక్కుకుపోయిన ఇద్దరు డ్రైవర్లు బయటకు రాలేక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అయితే ఆలుగడ్డ లారీలో ఉన్న క్లీనర్ శ్రీకాంత్ సింగ్‌కు చిన్నచిన్న గాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. క్షణిక నిద్ర... జీవితాలకు చిచ్చు: కుటుంబ పోషణ కోసం రాత్రంతా లారీ నడుపుతూ వందల కిలోమీటర్లు ప్రయాణించిన ఇద్దరు డ్రైవర్లు క్షణిక నిద్రమత్తుకు బలయ్యారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ అనంతలోకాలకు చేరుకోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దట్టమైన పొగలు, మంటలను చూసి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదం కారణంగా ఖమ్మంవరంగల్ జాతీయ రహదారిపై రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. జెసిబి సహాయంతో లారీల శిథిలాలను పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. తిరుమలాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, నిద్రమత్తుగా వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు.

# నేడు పాలిసెట్ పరీక్ష.. 1,06,439 మంది దరఖాస్తులు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** పాలిటెక్నిక్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే పాలిసెట్-2026 పరీక్షను నేడుబుధవారం) నిర్వహించ ున్నా రు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో 3 సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటుగా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశాల కోసం నేడు(బుధవారం) ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పాలిసెట్ పరీక్షను నిర్వహించనున్నారు. పాలీసెట్-2026కు రాష్ట్ర వ్యాప్తంగా 1,06,439 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 56,494 మంది బాలురు ఉండగా 49,945 మంది బాలికలు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి ఒక గంట ముందుగానే అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరు. విద్యార్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష హాలులోకి చేరుకొని ఓఎంఆర్ షీట్‌లోని రెండు వైపుల వివరాలను పూర్తి చేసి సంతకం చేయాలని అధికారులు సూచించారు. విద్యార్థులు తమ వెంట హెచ్‌బి బ్లాక్ పెన్సిల్, ఏరేసర్, బ్లూ, బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావాలని సూచించారు. పరీక్ష ప్రారంభం అయిన తరువాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా అభ్యర్థిని పరీక్ష కేంద్రం లోనికి అనుమతించ బడరని స్పష్టం చేశారు. హాల్ టికెట్ మీద ఫోటో ప్రింట్ కానివారు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఐడీప్రూఫ్ (ఆధార్‌కార్డు) తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు అనుమతించబడవని స్పష్టం చేశారు.

# ప్రశాంతంగా జరిగిన ఎడ్‌సెట్ పరీక్ష

## 82.42 శాతం మంది హాజరు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2026 పరీక్ష మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 82.42 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్టు ఎడ్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్‌సెట్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 35,600 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షను రెండు సెషన్‌లలో నిర్వహించారు. ఎడ్‌సెట్-2026 పరీక్షకి 35,600 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 29,441 మంది మహిళలు .. 6,155 మంది పురుష అభ్యర్థులు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. పరీక్షకు 29,342 మంది హాజరయ్యారు. ఎడ్‌సెట్ పరీక్షల సరళిని ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.



# ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ్‌కృష్ణదాస్‌కు తక్షణమే న్యాయం చేయాలి

## ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

**హైదరాబాద్, మే 12:** బంగ్లాదేశ్‌లో 500 రోజులకుపైగా జైలులో ఉన్న ఇస్కాన్ సన్యాసి చిన్మయ్‌కృష్ణదాస్ ప్రభుకు తక్షణమే న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. ఆయనకు వైద్యసహాయం అందించడంతోపాటు, వెంటనే బెయిల్ మంజూరు చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొందరు మానవ హక్కుల కార్యకర్తలు ప్రదర్శిస్తున్న మౌనాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఈ అంశంపై పవన్‌కల్యాణ్ స్పందిస్తూ.. '500 రోజులకుపైగా జైలు, పదేపదే బెయిల్ నిరాకరణ. ఆయన తరఫు న్యాయవాదులను కూడా కోర్టు హాలులో బెదరిస్తుంటే ఇక న్యాయం ఎలా జరుగుతుంది, మైనారిటీ హిందూ సమాజం హక్కుల కోసం పోరాడటం నేరమా అని ప్రశ్నించారు. కాషాయ వస్త్రాలు వేసు కున్నంత మాత్రాన అయన్ను జైలుకే పరిమితం చేయడం ఏమిటి అని ఆయన బంగ్లా పాలకులను ప్రశ్నించారు. కొన్ని అంశాలపై హ్యాష్‌ట్యాగ్‌లతో రాత్రికిరాత్రే స్పందించే నకిలీ సెక్యులరిస్టులు, సెలెక్టివ్ మానవ హక్కుల కార్యకర్తలు ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు, వీరి మానవత్వానికి కూడా ఫిల్టర్ ఉందా అని పవన్ విమర్శించారు. చిన్మయ్ కృష్ణదాస్‌ప్రభుకు వెంటనే న్యాయపరమైన సహాయం, వైద్యం అందించి, బెయిల్‌పై విడుదల చేయాలని ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కోరారు.




# చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

## 1.64 కోట్ల నగదు.. భారీగా ఆయుధాలు స్వాధీనం

**చర్ల, మే 12, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో భద్రత బలగాలు భారీ విజయాన్ని సాధించాయి. ఢీ లిమిటేన్వలో భాగంగా డిఆర్‌జి ఎస్‌టిఎఫ్ (స్పెషల్ టాస్క్ ఫోర్స్ )ఐటిబిపి( ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్), బిఎస్‌ఎఫ్(బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్లో మావోయిస్టుల గుట్టు బయటపడింది. నారాయణపూర్ జిల్లాలో నిర్వహిస్తున్న మాద్ బచావో అభియాన్ కింద భద్రతా బలగాలు చెప్పటిన సంయుక్త ఆపరేషన్‌లో భద్రతా దళాలు నక్సలైట్ల రహస్య స్థావరాన్ని గుర్తించి భారీ మొత్తంలో నగదు ఆయుధాలు మందుగుండు సామగ్రి పేలుడు పదార్థాలు నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని ఎస్పీ రాబిన్సన్ గుడియా ధ్రువీకరించారు. గత నెల నుండి నారాయణ్‌పూర్ పోలీసులు డీఆర్‌జీ ఎస్‌టీఎఫ్ ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ సంయుక్త బృందాలు మారుమూల సున్నితమైన ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు ఏరియా డామినేషన్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని పటిష్టమైన నిఘా వ్యవస్థ సహాయంతో నక్సలైట్లు పలుచోట్ల దాచిపెట్టిన ఆయుధాలు నగదు నిల్వలను భద్రతా దళాలు కనుగొన్నాయి. ఈ ఆపరేషన్‌లో మొత్తం రూ. 1.64 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఇంకా మూడు ఏకే47 రైఫిళ్లు, మూడు ఎస్ఎల్‌ఆర్ రైఫిళ్లు, రెండు 303 రైఫిళ్లు, ఒక 315 రైఫిల్, రెండు 12బోర్ గన్‌లు, రెండు నాటు తుపాకులతో సహా భారీ పరిమాణంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. వందలాది లైవ్ తూటాలు, మ్యాగజైన్‌లు, బీజీఎల్ సెల్స్, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్, వాకీటాకీ సెట్లు, మోటరోలా కమ్యూనికేషన్ పరికరాలు, రేడియో సెల్స్, ఇతర ఎలక్ట్రానిక్ సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. నక్సలైట్ల యూనిఫాంలు, పేలుడు పదార్థాలు, విద్యుత్ తీగలు, సోరా, తెల్లటి పొడి మరియు ఇతర నిత్యావసర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నాయి. ఇందులో సామాగ్రితో లాజిస్టిక్స్ సరఫరా, ఆయుధాల సరఫరా, ఐఈడీ తయారీ కోసం ఉపయోగిస్తున్నారు. 202526లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 270 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రాబిన్సన్ గుడియా తెలిపారు. జిల్లాను నక్సల్ రహితంగా మార్చేందుకు భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రచారాలు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

FINOVA CAPITAL
ఫినోవా క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్
సెక్యూరిటైజేషన్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు
తేది: 12/05/2026 ప్రదేశం: హైదరాబాద్
అధీకృత అధికారి ఫినోవా క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్

pnb Housing
B.O.: ప్లాట్ నెం. 2149, బుద్ధ కాలనీ ప్లాట్, కొండాపూర్, హైదరాబాద్, తెలంగాణ - 500092.
HOU/UPL/0722/1012330
ప్రదేశం: అప్పల్, తేది: 13.05.2026
సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు, ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

- ఆండర్సన్

# సాగుకు జవసత్వాలు!

ఒక దశాబ్ద కాలంగా దేశవ్యాప్తంగా సాగు గాడి తప్పిందన్న విస్తృత విశ్లేషణలు విశేషంగా వినపడుతున్నాయి. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తృణధాన్యాలు, ఉద్యాన పంటలు రైతు ఆదాయాన్ని పెంచుతాయనే అంచనాలున్నాయి.కానీ ఇప్పుడు వాటి విస్తీర్ణం తగ్గుతోంది. దేశవ్యాప్తంగా 'వరి' సాగు పెద్ద ఆదాయ 'సిరి' కాదనే వాదనల మధ్య ఎంతో మంది రైతులు ఇతర పంటల వైపు మొగ్గుచూపారు. పంట సాగులోఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్ వంటి అన్ని అంశాల్లో మానవేతర సాగు ద్వారానే పంట దిగుబడులు పెరిగి సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చుననే హితవు వినబడుతుంది. అటు రైతులు ఇటు వ్యవసాయ శాస్త్రజ్ఞులు కూడా ఆధునిక సాగు యంత్రాలు పరికరాలు వాడకానికి ప్రోత్సహిస్తున్నారు. ఎవరెన్ని ప్రత్యామ్నాయాలు చూపినా వాటిని స్వీకరించడానికి రైతు సిద్ధంగానే ఉన్నాడు. కాగా కొత్త ప్రత్యామ్నాయ సాగులో రైతుకు విశేషమయిన ఆర్థికలబ్ధి పొంద గలరనన్న నమ్మకం చిక్కితేతప్ప కొత్త ఆలోచనల వైపు మొగ్గ చూపలేదు. కొద్ది కాలం క్రితం 'చేనుకు చేవ - రైతుకు రొఖ్ఖం' అనే నినాదం కింద అధిక ఎరువులతో అధిక సాగుబడి అనే ధోరణితో రైతులు అహర్నిశలూ శ్రమపడి వ్యవసాయ క్షేత్రాలను పటిష్టం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో సాగు వ్యయకర్తనం, పంటల మార్పిడి,అధిక ఎరువుల నుండి పంటల నియంత్రణ అనే అంశాలమీద ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఈ అంశాల ప్రాతిపదికగా విస్తృతస్థాయిలో ప్రచారం చేపట్టింది.పశ్చిమాసియా యుద్ధ ప్రభావం రసాయనిక ఎరువుల ధరల పెంపు, లభ్యతలో సంక్లిష్ట సమస్యలు తలెత్తి ఏకంగా ఎరువుల మోతాదులను నియంత్రించాలనే ఆలోచన పుట్టింది. ఎక్కడో సౌదీ అరేబియా నుంచి రావాల్సిన యూరియా వంటి ఎరువులు భారత్‌కు చేరుకోకపోవడం పెద్ద సమస్యగా ఏర్పడింది. అయినా ఆయా ఎరువుల్ని రైతుకందించడంలో ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. అంతే తప్ప ధరలు పెంచలేదు. అదేవిషయాన్ని నరేంద్రమోడీ ప్రజల ముందు ఏకరువు పెట్టి ఎరువుల వాడకం క్రమేపీ తగ్గించేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకతను చెప్తూ వచ్చారు. సాంప్రదాయ సాగులో అత్యధిక దిగుబడుల కోసంచేసిన ప్రయత్నమే రైతులోకంలో అలజడి సృష్టించింది. సమస్య రైతు దురదృష్టానిదా?పంట నాణ్యతదా, సాగు నిర్వహణ యాజమాన్యాంలో లోపాలా? అన్నది విశ్లేషించుకుంటే 'కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు' అన్నట్లు అన్నీ రైతునెత్తిన పిడుగు పడేట్లు చేశాయి.రైతు వ్యవసాయం పట్ల ఆసక్తి కోల్పోయే పరిస్థితులు తలెత్తాయి.ఐదారేళ్ల క్రితం 'కోవిడ్' తర్వాత ఇంతవరకు జరిగిన సాగు అధ్యాయాలను తెరచి చూసుకుంటే రైతు ఆత్మహత్యలు కూడా వ్యవసాయాన్ని కృంగ దీసే పరిస్థితులు తెచ్చిపెట్టాయి. ప్రధానిగా నరేంద్రమోడీ ఎరువులపై సాగు ఖర్చు నియంత్రణ కోరుకుంటే రైతులు ప్రధానంగా పంట మార్పిడిచేసి భూసారాన్ని పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ పట్టుపడ్తోంది. కారణమేదైనా తెలంగాణలో రైతు ఆత్మహత్యలు బాగా పెరిగిపోయాయన్న వాస్తవాల్ని కాదనలేం. సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంటే పంటల మార్పిడి ద్వారానే దిగుబడులు పెరుగుతాయని అందుకే పదిశాతం విస్తీర్ణంలోనైనా 'వరి'కి బదులు ప్రత్యామ్నాయ పంటల ఆవశ్యకత ఉంది. వరిని ఆరుతడి పంటలనూ ప్రత్యామ్నాయంగా సాగు చేయడం అవసరమని తెలంగాణ రాష్ట్రవ్యవసాయ కమిషన్ ఇటీవల తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. నీరు సమృద్ధిగా అవసరమైన 'వరి' సాగును ఒకసారికే పరిమితం చేయడం అవసరమని ప్రభుత్వానికిచ్చిన నివేదికలో పేర్కొంది.ఈనివేదిక రాష్ట్రంలో అమలు చేయగల వ్యవసాయ విధానాన్ని రూపొందించేందుకు మార్గదర్శకం కావచ్చు. రాష్ట్రంలోయేటా 'వరి'సాగు విస్తీర్ణం పెరుగుతోంది.ఉద్యాన పంటలు సాగు బాగా తగ్గిపోతోంది.కూరగాయల పెంపకానికి కూడా ఓ మోస్తరు రైతులు ఇష్టపడడం లేదు.ఈరీత్యా వాతావరణ జోన్ల ఆధారంగా పంటల ప్రణాళికను రూపొందించి పంట మార్పిడికి నిర్దిష్ట లక్ష్యాలను, ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని కమిషన్ సూచిస్తోంది. సుస్థిర వ్యవసాయం, సాగు వ్యయ ఆదాయ, సహజవనరుల సంరక్షణవంటి అంశాలను ఆహార భద్రతకు తోడ్పడాలని నివేదికలో పేర్కొంది.ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాక్‌హౌస్‌లు, కోల్డ్‌స్టోరేజీల నిర్మాణం తక్షణమే ఏర్పాటు చేయాలి. అపరాలు, చిరుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తులకు మద్దతు ధర నిర్ణయించే వ్యవస్థను రూపొందించాలి. కేరళ, మహారాష్ట్ర ప్రాంతాలలోఉన్నట్లు కూరగాయల క్లష్టర్, ఎన్‌పిసి ఏర్పాటు అవసరం. మార్కెట్లలో దళారీ వ్యవస్థ అత్యంత ప్రమాదకరంగా రైతు ప్రయోజనాలను దెబ్బకొడ్తోందన్న నిశ్చితాభిప్రాయానికి కమిషన్ వచ్చింది. ఇది నిజమేకాకుండా రైతుకోణంలో చూస్తే వ్యయ ప్రయా సలకోర్చి పంట పండించినా తీరా ఉత్పత్తుల విక్రయం సమయంలో దళారుల జోక్యంధరల నిర్ణయంలో గిట్టు బాటు ధర లేకుండా చూసి బోల్తాకొట్టిస్తారు. అందుకే పంట ఉత్పత్తుల విషయంలో దళారీ వ్యవస్థ ఉండరాదు.పంటల విక్రయంలోనూ వారిపాత్రను కుదించాలని కమిషన్ అభిప్రాయపడింది. రైతు ప్రయోజనాలు కాపాడే విషయంలో కమిషన్ నివేదికలోని అన్ని అంశాలపైనా రైతుపరంగా చర్చించడానికి అసెంబ్లీ సిద్ధంగా ఉంది. ఒకే రకమైన పంటల సాగుతో నేలసారం దెబ్బతింటుంది కనుక తప్పనిసరిగా పంటల మార్పిడికి తెలంగాణ సిద్ధపడాల్సిన అగత్యం ఏర్పడుతోంది. కాస్త ఆలస్యమైనా రైతుకమిషన్ సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో నివేదికను సిద్ధం చేసినందున అసెంబ్లీలో చర్చించి తెలంగాణ సాగును బలోపేతం చేయడం అవసరమే.



కీర్తి కాంక్ష లేకుండా చేసేదేదో చక్కగా చేయడమే విజయానికి మూలం.

హరివంశ రాయ్ బచన్



చేజారిన ఓ నిమిషాన్ని భూమిపై ఉండే సిరిసంపదలేవీ తిరిగి చేకూర్చలేవు.

ఆదిశంకరాచార్యులు

## ప్రజావాక్కు



### పసిడి మాట ప్రధాని నోట

బామ్మ మాట బంగారు బాట అంటారే, ఆ తరహాలో ప్రధాని చెప్పిన బంగారు మాట ప్రస్తుతం దేశం ఆచరించాల్సిన బాట. దశాబ్దాలక్రితం నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఒక పూట తిండి మానేస్తే దేహానికీ, దేశానికీ మంచిది అని పిలుపునిచ్చారు. దేశంలో ఆహార ఉత్పత్తి చాలక, దిగుమతులు భారమైన స్థితిలో అప్పటి ఆహార భద్రతకి ఊతమిచ్చే సందేశం అది. ఇప్పుడు మళ్లీ నేటి ప్రధాని మోడీజీ పది శాతం వంటనూనె వినియోగం తగ్గిస్తే కుటుంబ ఆరోగ్యానికీ, దేశఆర్థికానికీ మేలు చేస్తుంది అని, బంగారం కొనడం ఒక ఏడాది పాటు మానెయ్యమని.ఈ రెండు సూచనలు దేశ ప్రజలు కళ్ళుమూసుకుని పాటించవచ్చు. తమ అలవాట్లను, ఆకర్షణల్ని కట్టడి చెయ్యడం ద్వారా. మిగిలిన సూచనలు కష్ట తరమైనవి. పెట్రోల్ వాడకం తగ్గించడానికి కార్ పూలింగ్ లాంటివి పాటించమని, ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెంచమని,ప్రయాణాలు తగ్గిస్తూ వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటి అవకాశాల్ని వెతకమని. ఈ సూచనలు కూడా మంచివే కానీ అమలుచెయ్యగల స్కోప్ తక్కువ.ఇవి అమలు కావాలంటే ఆ తరహా వ్యవస్థని అంచెలవారీగా నిర్మించాలి

- డా. డి.వి.జి.శంకర రావు,విజయనగరం

### అడుగంటిపోతున్న భూగర్భ జలాలు

దేశంలో రోజురోజుకు మారిపోతున్న వాతావరణ పరిస్థితులు సమతుల్యత లేని కాలాలు దృష్ట్యా అడుగంటిపోతున్న భూగర్భ జలాలతో ప్రతి ఏటా జలాలు తగ్గుతూ అటు సాగునీటికి ఇటు త్రాగునీటికి ప్రజలు ఇబ్బందులు అంత ఇంత కావు. వేసవి కాలంలో అయితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుంది.పరిష్కార మార్గాల చర్యలు తీసుకుంటేనే భవిష్యత్ తరాలకు నీళ్లను ఇవ్వగలం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పర్యవేక్షణ తప్పనిసరి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లుకనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటలకోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువసేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం,నిద్రసరిగా లేకపోవడం,శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది.అలాగే సమయం వృథా అవ్వడంతో చదువుపై దృష్టితగ్గిపోతోంది. స్నేహితులతో ఆడుకోవడం,మాట్లాడడంతగ్గిపిల్లలుఒంటరిగామారుతున్నారు.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### అసాధారణ ఉష్ణోగ్రతలు

భారతదేశ వాతావరణ పరిస్థితులను బట్టి మనది ఉష్ణమండల దేశంగా పరిగణిస్తారు. మనదేశంలో వివిధ ప్రాంతాలలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండటంకద్దు. వేసవిలో అయితే అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈమధ్యకాలంలో పిల్లలు,యువతీ యువకులు, స్త్రీలు, పురుషులు ఉష్ణతాపం తట్టుకోలేకనో లేక పాశ్చాత్య ధోరణిలోనో ఉండి లాగూలు,పొట్టిగౌనులు, స్కర్టుల వంటి దుస్తులు ధరించి మండు వేసవిలో యధేచ్ఛగా సంచరిస్తున్నారు. సాధారణంగా సూర్యకిరణాలవేడిమి 30నుంచి35 డిగ్రీల సెల్సియస్ అంతకు మించితే సూర్యకిరణాలలో అల్ట్రా వయొలెట్ కిరణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కిరణాలు చర్మానికి నేరుగా సోకితే చర్మ క్యాన్సర్లువచ్చే ప్రమాదం ఉంది. పాశ్చాత్యదేశాలలో సూర్యకిరణాల వేడిమి, తీక్షణత 30-32 డిగ్రీల సెల్సియస్‌కు మించదు కాబట్టి అక్కడి ప్రజలు లాగూలు, పొట్టిగౌనుల వంటివి ధరించినా వారికి పెద్ద ప్రమాదం ఉండదు. ఎటొచ్చీమన భారత్‌లో జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### ముందు ప్రభుత్వం ఆచరించాలి

ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడానికి ప్రపంచీకరణలో భాగంగా ఐటిఉద్యోగాలు సృష్టించాలి.కృత్రిమ మేధస్సు పై యువత అవగాహన పెంచుకొని ఆ దిశగా అడుగులు వేయాలి. కాలం చెల్లిపోయిన యోగ, ధ్యాన,హస్త సాముద్రికము జ్యోతిష్యము, దైవభక్తి పేరుతో ఈకాలం యువతీ యువత విపరీతంగా ప్రవర్తిస్తూ ఉన్నారు. వర్క్ ఫ్రంహోం వలన పెట్రోల్ వినియోగం తగ్గుతుందని తద్వారావాళ్లకు ధనం ఆదావుతుందని, ఐటీ కంపెనీలకు లాభాలు బాగా వస్తాయని ప్రధాని సూచించడంకూడా ఆయన విజ్ఞతకే వదిలేయాలి. భారతీయ జనతా పార్టీ ఒక అద్భుతమైన శక్తిగా ఇప్పుడు మారిపోయింది. వచ్చే ఎన్నికల సమయానికి నియంతృత్వ పోకడలు అవలంబించినా ఆశ్చర్యం లేదు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### తనిఖీ అధికారులను నియమించాలి

ఇంటర్‌విద్యనుపాఠశాల విద్యలోకలపాలి అని నిర్ణయం తీసుకొన్న ప్రభుత్వం డాక్టరేట్ లెక్చరర్‌లను స్కూల్ ఎడ్యుకేషన్ తనిఖీ అధికారులుగా నియమించడం అవసరం. పరిపాలన పరంగా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించాలి. గురుకులాల్లో పని చేస్తున్న లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కలిపించాలి.

-రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# పాఠశాల నుంచి ఇంటర్ వరకు ఒకే గొడుగు!

**ఒకే విద్యా వాతావరణంలో కొనసాగితే విద్యా ర్థుల్లో భయం తగ్గి, సృజనాత్మకత పెరుగుతుందని విద్యా మానసిక శాస్త్ర నిపుణులు సూచిస్తున్నారు. అయితే ఈ వ్యవస్థ విజయవంతం కావాలంటే కేవలం పరిపాలనా ఉత్తర్వులు సరిపోవు.మౌలిక సదుపాయాల విస్తరణ, నాణ్యమైన అధ్యాపక నియామకాలు, పాఠ్యాంశాల సమన్వయం, డిజిటల్ వనరుల కల్పన,గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం వంటి అంశాల్లో ప్రభుత్వం దీర్ఘకాలిక దృష్టితో ముందుకు సాగాల్సి ఉంటుంది. లేదంటే ఇది కూడా గతంలో వచ్చిన అనేక విద్యా సంస్కరణల మాదిరిగానే కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. విద్య అనేది కేవలం పరీక్షల వ్యవస్థ కాదు, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి. అలాంటి విద్యా వ్యవస్థలో మార్పులు చేపట్టేటప్పుడు రాజకీయ ప్రయోజనాలకన్నా విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక సమానత్వం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.**



రామ కిష్టయ్య సంగన భట్ల

రాష్ట్ర విద్యా వ్యవస్థలో మరో కీలక సంస్కరణకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ స్థాయి వరకు విద్యా సంస్థలను ఒకే పరిపాలనా వ్యవస్థ కిందకు తీసుకు రావాలనే యోచనకు రూపురేఖలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం వేర్వేరు శాఖల ఆధీనంలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు,జూనియర్ కళాశాలలను సమన్వయంతో నడిపించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రానున్న విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేయాలని ఉన్నతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. విద్యార్థుల నిరంతర విద్యాభ్యాసం, ఉపాధ్యాయుల వినియోగం మౌలిక సదుపాయాల సమీకరణ, పరిపాలనా వ్యయాల తగ్గింపు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో విద్యాశాఖ నిర్మాణం విభజిత పద్ధతిలో కొనసాగుతోంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒక శాఖ పరిధిలో ఉండగా, ఇంటర్మీడియట్ విద్య మరో ప్రత్యేక బోర్డు ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఫలితంగా పాఠ్యాంశాలు, బోధనా విధానాలు, ఉపాధ్యాయ నియామకాలు, పరీక్షా విధానాల్లో అనేక అసమానతలు కనిపిస్తున్నాయి. పదో తరగతి వరకు ఒక విధానంలో చదివిన విద్యార్థి, ఇంటర్‌కు చేరిన వెంటనే పూర్తిగా భిన్నమైన విద్యా వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాడు. ఈ మార్పుకు చాలా మంది విద్యార్థులు అలవాటు పడలేక మధ్యలోనే చదువు మానేస్తున్నారని విద్యా నిపుణులు చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దేశవ్యాప్తంగా కొత్త జాతీయ విద్యా విధానం-2020 అమలులోకి వచ్చిన తర్వాత విద్యా నిర్మాణంలో సమూల మార్పులు చోటుచేసుకుంటున్నాయి. 5+3+3+4 విధానంలో పాఠశాల విద్యను పునర్వ్యవస్థీకరించాలని కేంద్రం సూచించింది. ఈ నేపథ్యంలోనే పదో తరగతి తరువాతి రెండు సంవత్సరాలను కూడా పాఠశాల విద్యలో భాగంగానే పరిగణిస్తూ, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యతో అనుసంధానం చేయాలనే ఆలోచన బలపడింది. ఇప్పటికే పలు రాష్ట్రాలు ఈ దిశగా చర్యలు ప్రారంభించాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే మార్గంలో అడుగులు వేస్తూ, 'స్కూల్ కాంప్లెక్స్' విధానాన్ని మరింత విస్తరించి జూనియర్ కళాశాలలను అందులో భాగం చేయాలని చూస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వందలాది జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అనేక కళాశాలల్లో పూర్తిస్థాయి అధ్యాపకులు లేక గెస్ట్ లెక్చరర్లతోనే బోధన సాగుతోంది. కొన్ని కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పదులలోకి పడిపోగా, మరికొన్ని చోట్ల తరగతులే లేకుండా మారిపోయిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పాఠశాలలతో జూనియర్ కళాశాలలను అనుసంధానంచేస్తే విద్యార్థుల ప్రవాహం పెరిగేఅవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు అదే విద్యా సముదాయంలో ఇంటర్ విద్యను కొనసాగించగలుగుతారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా బాలికలకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ప్రస్తుతం ఇంటర్ చదువుకోవాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో చాలా మంది బాలికలు విద్యను మధ్యలోనే ఆపేస్తున్నారు. ఒకే క్యాంపస్‌లో ఇంటర్ సదుపా యం ఉంటే తల్లిదండ్రుల్లో భద్రతాభావం పెరిగి విద్యార్థుల ప్రవేశాలు అధికమయ్యే అవకాశముంది. విద్యాహక్కు చట్టం కొనసాగిస్తూ 'స్కూల్



టు కాలేజ్' మార్పును సులభతరం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటోందని విద్యావర్గాలు చెబుతున్నాయి.మరోవైపు ఉపాధ్యాయ వనరుల వినియోగం కూడా ఈ మార్పుతో మెరుగుపడే అవకాశం కనిపిస్తోంది. ఒకే పరిపాలనా వ్యవస్థలోకి తీసుకువస్తే సబ్జెక్టు నిపుణులను అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, ఇంగ్లిష్ వంటి విషయాల్లో నాణ్యమైన బోధన అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అయితే ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇంటర్మీడియట్ విద్యస్వతంత్ర లక్ష్యాలతో ఏర్పడిన ప్రత్యేకదశ అని, దానిని పూర్తిగా పాఠశాల విద్యలో కలిపేస్తే అకాడమిక్ నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని కొందరు విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షల దృష్ట్యా ఇంటర్ స్థాయిలో ప్రత్యేక బోధన అవసరమని వారుచెబుతున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, సైన్స్‌రంగాలకు పునాది వేసే దశ ఇంటర్మీడియట్ కావడంతో దాని ప్రత్యేకతను కాపాడాలని సూచిస్తున్నారు. అదేవిధంగా జూనియర్ లెక్చరర్ల సేవా నిబంధనలు, పదోన్నతులు, పరిపాలనా హోదాలపై కూడా స్పష్టత అవసరమని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఈ సంస్కరణను కేవలం విలీనంగా కాకుండా సమగ్ర విద్యా పునర్నిర్మాణంగా ప్రచారంచేస్తోంది. విద్యార్థి ఒకే విద్యా వాతావరణంలో నిరంతరంగా అభ్యసిం చేసే లక్ష్యంగా పనిచేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. డిజిటల్ తరగతులు, కామన్ లైబ్రరీలు, సమగ్ర ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు వంటి సదుపాయాలను ఒకే విద్యా సముదాయంలో కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించి 'ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ క్యాంపస్'లుగా అభివృద్ధి చేసే అవకాశాలను కూడాపరిశీలిస్తున్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం వేలసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు,వందలాది జూనియర్ కళాశాలలు పనిచేస్తున్నాయి. కానీ విద్యార్థుల నమోదు గణాంకాలను పరిశీలిస్తే ప్రభుత్వ విద్యాసంస్థలపై ఆధారపడే వారి సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వైపు విద్యార్థులు మొగ్గ చూపుతున్నారు. ప్రభుత్వపాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 'మన ఊరు-మన బడి' వంటి పథకాలు అమలు చేసినప్పటికీ, ఇంటర్ స్థాయిలో అదేస్థాయి సంస్కరణలు జరగలేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలతో ఇంటర్ విద్యను అనుసంధానం చేయడంద్వారా ప్రభుత్వ విద్యపై మళ్లీ ప్రజల్లోవిశ్వాసం పెంపొందించాలని ప్రభుత్వం యత్నిస్తోంది.ఇక విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించే కోణంలో కూడా ఈ నిర్ణయాన్ని పరిశీలిస్తున్నారు. పదోతరగతి వరకు ఒక వాతావరణంలో చదివిన విద్యార్థి అకస్మాత్తుగాకార్పొరేట్ ఇంటర్ కళాశాలల ఒత్తిడికి గురవుతూ మానసిక ఆందోళనలకు లోనవుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఒకే విద్యా వాతావరణంలో కొనసాగితే విద్యార్థుల్లో భయం తగ్గి, సృజనాత్మకత పెరుగుతుందని విద్యా మానసిక శాస్త్ర నిపుణులు సూచిస్తున్నారు.అయితే ఈవ్యవస్థ విజయవంతం కావాలంటే కేవలం పరిపాలనా ఉత్తర్వులు సరిపోవు. మౌలిక సదుపాయాల విస్తరణ, నాణ్యమైన అధ్యాపక నియామకాలు, పాఠ్యాంశాల సమన్వయం, డిజిటల్ వనరుల కల్పన, గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం వంటి అంశాల్లో ప్రభుత్వం దీర్ఘకాలిక దృష్టితో ముం దుకు సాగాల్సి ఉంటుంది. లేదంటే ఇదికూడా గతంలోవచ్చిన అనేక విద్యా సంస్కరణల మాదిరిగానే కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. విద్య అనేది కేవలం పరీక్షల వ్యవస్థకాదు, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి. అలాంటి విద్యా వ్యవస్థలో మార్పులు చేపట్టేటప్పుడు రాజ కీయ ప్రయోజనాలకన్నా విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక సమానత్వం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. 'ఇంటర్ దాకా ఒకే గొడుగు కిందకు" అనే ప్రభుత్వ ఆలోచన అమలులో సఫలమైతే రాష్ట్ర విద్యా రంగంలో ఇది చారిత్రక మలుపుగా నిలిచే అవకాశం ఉంది. అదే సమయంలో అమలులో నిర్లక్ష్యం జరిగితే ప్రభుత్వ విద్య మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం కూడా లేకపోలేదు. ●

# 'లే ఆఫ్'లతో సరికొత్త సామాజిక సంక్షోభం!

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతోంది. ఈ మార్పుకు ప్రధాన కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ. ఒకప్పుడు మనిషి శ్రమతో జరిగే పనులు ఇప్పుడు యంత్రాలు, ఆల్గోరిథమ్స్ చేతిలోకి వెళ్లిపోయాయి. ఫలితంగా, ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగులను తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నాయి.'లే ఆఫ్' అనే పదం ఇప్పుడు కేవలం కార్పొరేట్ టర్మ్ కాదు - ఇది లక్షలాది కుటుంబాల ఆందోళనగా మారింది. ఇటీవలి కాలంలో ఐటీ, స్టార్టప్, ఫైనాన్స్, ఈకామర్స్ రంగాల్లో భారీ స్థాయిలో లే ఆఫ్స్ జరుగుతున్నాయి. మంచి అనుభవం, మంచి పనితీరు ఉన్న ఉద్యోగులే ఒక్కసారిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎఐ ఆధారిత టూల్స్, ఆటోమేషన్ పెరుగుదల కంపెనీలకు లాభదాయకంగా కనిపించినా, ఉద్యోగుల జీవితాలను సంక్షోభంలోకి నెడుతోంది. ఈ పరిస్థితిలో ప్రధానంగా ఎదురయ్యే ప్రశ్న - ఉద్యోగులు తప్పేంటి? టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా కంపెనీలు తమ వ్యూహాలను మార్చుకోవడం సహజమే. కానీ, ఉద్యోగులను ఒక్కసారిగా బయటకు పంపడం ఎంతవరకు సమంజసం? ఉద్యోగం కోల్పోయిన వ్యక్తి కేవలం ఆదాయం కోల్పోవడం కాదు - అతని కుటుంబ భద్రత, పిల్లల భవిష్యత్తు, మానసిక స్థితి అన్నీ ప్రభావితం అవుతాయి. ఇక్కడ ప్రభుత్వాల పాత్ర కీలకం అవుతుంది. ఇప్పటివరకు లే ఆఫ్స్‌ను కేవలం ప్రైవేట్ కంపెనీల అంతర్గత వ్యవహారంగా చూసిన ప్రభుత్వాలు, ఇకపై ఈ సమస్యను సామాజిక సమస్యగా గుర్తించాలి. ఉద్యోగ భద్రత, స్కిల్ డెవలప్మెంట్, రీఎంప్లాయ్‌మెంట్ వంటి అంశాల్లో ప్రభుత్వాలు చురుకైన పాత్ర పోషించాలి. మొదటిగా లే ఆఫ్ అయిన ఉద్యోగులకు తాత్కాలిక ఆర్థిక భద్రత కల్పించే విధంగా ప్రత్యేక పథకాలు తీసుకురావాలి. నిరుద్యోగ భృతి వంటి వ్యవస్థలను బలోపేతం చేయాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ విధానాలు అమల్లో ఉన్నప్పటికీ, మన దేశంలో ఇవి ఇంకా పరిమితంగానే ఉన్నాయి. ఒక ఉద్యోగి అకస్మాత్తుగా ఆదాయం కోల్పోతే, అతనికి కనీస జీవన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. రెండవది, స్కిల్ డెవలప్మెంట్‌పై దృష్టి పెట్టాలి. ఎఐ వల్ల మారుతున్న ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలు నేర్పించే ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులోకి తీసుకురావాలి. డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో ఉచిత లేదా సబ్సిడీ ట్రైనింగ్ ఇవ్వాలి.'రీస్కిలింగ్' 'అప్‌స్కిలింగ్' అనేవి ఇప్పుడు అవసరం మాత్రమే కాదు - అవి జీవనాధారం. మూడవది, కంపెనీలపై కొన్ని నియంత్రణలు విధించాలి. లే ఆఫ్ చేయడానికి ముందు కంపెనీలు ఉద్యోగులకు ముందస్తు నోటీసు ఇవ్వడం, సరైన పరిహారం చెల్లించడం తప్పనిసరి చేయాలి. అదేవిధంగా, ఉద్యోగులను తొలగించే ముందు వారికి ట్రైనింగ్ ఇచ్చే అవకాశాలు కల్పించాలని చట్టబద్ధంగా నిర్దేశించాలి. కేవలం లాభాల కోసం ఉద్యోగులను త్యాగం చేసే సంస్కృతిని నియంత్రించాలి. నాలుగవది, స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలను ప్రోత్సహించాలి.ఉద్యోగాలుకోల్పోయిన వారికిస్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు లోన్లు,సబ్సిడీలు ఇవ్వాలి. స్టార్టప్ ఎకోసిస్టమ్ బలపడితే,కొత్త ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. ఉద్యోగుల పరంగా చూస్తే, ఈ పరిస్థితి ఒకహెచ్చరిక.ఒకే స్కిల్ లేదా ఒకే ఉద్యోగంపై ఆధారపడే కాలం ముగిసింది.నిరంతరం నేర్చుకోవడం, మార్పుకు అనుగుణంగా మారడం అవసరం.ఎఐను శత్రువుగా కాకుండా,సాధనంగా ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి. టెక్నాలజీని అర్థంచేసుకున్నవారికి అవకాశాలు ఎప్పుడూఉంటాయి. సమాజపరంగా చూస్తే, లేఆఫ్స్ కేవలం ఆర్థికసమస్యకాదు. ఇది ఒక సామాజిక సంక్షోభం. నిరుద్యోగం పెరిగితే, అసమానతలు పెరుగుతాయి.అది చివరికి సామాజిక అస్థిరతకు దారితీస్తుంది. అందుకే, ఈసమస్యను సమగ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. మొత్తంగా, ఎఐ యుగం ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తోంది. కానీ ఆ ప్రపంచం అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. కంపెనీలు, ప్రభుత్వాలు, ఉద్యోగులు - ఈ ముగ్గురు కలిసి పనిచేస్తేనే ఈ సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోవచ్చు. ●

# అంచనాలను మించిన అప్పుల్లో తెలుగు రాష్ట్రాలు

ఇస్కా రాజేష్ బాబు

తెలుగు రాష్ట్రాలు అప్పుల వలయంలో విలవిలలాడుతున్నాయి. ఏళ్ల క్రితం చేసిన పాత అప్పుల అసలు, వడ్డీ చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అప్పులు చేయాల్సి వస్తోంది. కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం చేతికి అందుతున్నది చాలా తక్కువగా ఉంటోంది. గత మూడేళ్ల సగటును తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బహిరంగ మార్కెట్ రుణాల్లో 58శాతం సొమ్ము పాత అప్పుల కిస్తీలు, వడ్డీల చెల్లింపుకే వెళ్లిపోయింది. రాష్ట్రానికి 42 శాతమే సొమ్ము అందింది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు, 2025-26 సంవత్సరపు బడ్జెట్‌లపై ఓ అధ్యయనం పేరిట రిజర్వు బ్యాంకు విడుదల చేసిన నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం తెలంగాణ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెచ్చిన అప్పుల్లో 70 శాతం,2024-25లో తెచ్చిన అప్పుల్లో 56శాతం, 2025-26లో తెచ్చిన అప్పుల్లో 49శాతం సొమ్మును పాత అప్పులు, వడ్డీలు తిరిగి చెల్లించడానికే వినియోగించింది. దక్షిణాదిలో అత్యధికంగా అప్పులు చేసిన రాష్ట్రంగా తమిళనాడు రూ.95,300 కోట్లతో నిలిచింది. ఆ తర్వాత ఎక్కువగా అప్పులు చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. కర్ణాటక రూ.12,000 కోట్లు, కేరళ రూ.36,338 కోట్లు రుణ సమీకరణ చేశాయి. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దేశించుకున్న రుణ అంచనాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ ప్రతిపాదనలు రూ.54,009 కోట్లు ఉండగా ఇప్పటి వరకు సేకరించిన రుణాలు అక్షరాలా రూ.83,300 కోట్లకు (154.23 శాతం)చేరాయి. ఆర్థిక సంవత్సరం ముగియక ముందే బడ్జెట్ అంచనాల కంటే దాదాపు రూ.29,000 కోట్లకుపైగా అదనపు అప్పులు చేయడం ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ వైఫల్యానికి అద్దం పడుతున్నది. రాష్ట్ర సొంత ఆదాయ మార్గాలు సృష్టించుకోవడంలో విఫలమైన తెలంగాణ సర్కార్ ప్రతి నెలా అప్పు చేస్తేగానీ బండి నడవని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే అప్పుల కుప్పగా మారిన తెలంగాణపై ఈ అదనపు భారం భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదం ఉన్నది. సంక్షేమ పథకాలు, జీతభత్యాల కోసం కూడా అప్పుల వైపు చూడటం ఆర్థిక క్రమశిక్షణారాహిత్యమేనని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల పేరిట గ్యారంటీ అప్పులు చేసింది. 2025 మార్చి నాటికి సవరించిన అంచనాల ప్రకారం ఈ అప్పులు రూ.2,41,528 కోట్లకు చేరినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో రాష్ట్ర అప్పుల శాతం పెరిగిపోతోంది. ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం ప్రకారం రాష్ట్ర జీఎస్డీపీలో అప్పులు 25శాతానికి మించకూడదు. కానీ ఆ పరిమితి దాటుతున్నాయి.2021లో



28.8శాతం, 2022లో 28శాతానికి చేరాయి. 2025-26లో రాష్ట్ర బడ్జెట్ అంచనాల ప్రకారం జీఎస్‌డీపీలో అప్పులు 27.5శాతం వరకు ఉంటాయని ఆర్బీఐ పేర్కొంది.రాష్ట్ర ప్రభుత్వం గతంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న నేపథ్యంలో భవిష్యత్తులో తిరిగి చెల్లించాల్సిన అప్పుల మొత్తం గణనీయంగా పెరగనుంది. 2025-64 మధ్యలో అప్పుల అసలు సొమ్మే రూ.3,63,883 కోట్లు కట్టాల్సి ఉందని, వడ్డీలు దీనికి అదనమని ఆర్బీఐ నివేదికలో వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో రూ.69,300 కోట్లు, ఏపీ సర్కార్ రూ.56,072 కోట్ల అప్పు సేకరించించినట్టు గణాంకాలు వెల్లడించారు. 2025-26లో తెలంగాణ ప్రభుత్వం మొదటి మూడు నెలల్లో రూ.17,400 కోట్లు, రెండో త్రైమాసికంలో రూ.32,500కోట్లు, మూడో త్రైమాసికంలో రూ.19,400కోట్లు ఇలా తొమ్మిది నెలల్లో రూ.69,300 కోట్ల అప్పులు చేసినట్టు వెల్లడించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదటి మూడు నెలల్లో రూ.26,572 కోట్లు, రెండో క్వార్టర్‌లో రూ.17,600 కోట్లు, మూడో త్రైమాసికంలో రూ.11,900 కోట్లు. ఇలా తొమ్మిది నెలల్లో రూ.56,072 కోట్ల రుణ సమీకణ చేసినట్టు వివరించారు. కేంద్రం విడుదల చేసిన డాటా ప్రకారం బిజెపిపాలిత మహారాష్ట్ర రూ.99,000 కోట్ల రుణ సమీకరణతో దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పట్టాలు తప్పిందా? అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిమితులను గాలికొదిలేసిందా?అంటే తాజా గణాంకాలు అవుననే సమాధానం చెప్తున్నాయి. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే తెలంగాణ సర్కార్‌చేసిన అప్పులు బడ్జెట్ అంచనాలను మించిపోయి రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఇది చాలదన్నట్టు ప్రభుత్వం ఆర్బీఐ నిర్వహించినసెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా మరో రూ.2,540కోట్ల రుణాన్ని సమీకరించింది.ఇందులో 19ఏండ్ల కాలపరిమితితో 7.75 వార్షిక వడ్డీకి రూ.540 కోట్లు, 28 ఏండ్ల కాలపరిమితితో 7.70 వడ్డీకి రూ.1,000 కోట్లు, 30ఏండ్ల కాలపరిమితితో 7.69 వడ్డీకి మరో రూ.1,000 కోట్లు తీసుకున్నది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆర్బీఐ నుంచి తెచ్చిన మొత్తం అప్పు రూ.85,840 కోట్లకు చేరింది. ఇది రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొన్న రూ.54,009 కోట్ల వార్షిక రుణ సమీకరణ లక్ష్యంకంటే 58.93అధికం.గత ఐదేండ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ అప్పులు భారీగా పెరిగాయి. 2022-23లో వార్షిక బడ్జెట్ అంచనాలో కేవలం 61 శాతానికే పరిమితమైన రుణాలు ఇప్పుడు ఏకంగా మూడు రెట్లు పెరగడం గమనార్హం. రాష్ట్ర సొంత ఆదాయ వనరులు ఆశించిన స్థాయిలో పెరుగకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ఇతర ఖర్చుల కోసం పూర్తిగా మార్కెట్ రుణాలపైనే ఆధారపడుతున్నది. అంచనాలకు మించి అడ్డగోలుగా తెస్తున్న అప్పులు, వాటిపై చెల్లించాల్సిన వడ్డీలు భవిష్యత్తులో రాష్ట్ర ఖజానాకు పెనుభారంగా మారడం, తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయమని ఆర్థిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ●



# అసోం పీఠంపై హిమంత

## వరుసగా రెండోసారి అధికారంలోకి

## మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం

**గువాహతి, మే 12:** అస్సాంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంలో రెండోసారి సీఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణ స్వీకారంచేశారు. మంగళవారం గువాహతిలోని ఖానాపారాలో అత్యంత ఘనంగాజరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలతోపాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు,మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య హిమంత బిశ్వ శర్మ చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అస్సాం సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న శర్మ, ప్రమాణం చేస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హిమంతతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో కేంద్ర మాజీ మంత్రి రామేశ్వర్ తేలి, అసోం గణ పరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) నేత చరణ్ బోరో, సీనియర్ బీజేపీ నేత అజంత నియోగ్ ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌తో పాటు 22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు హాజరయ్యారు. వీరితో పాటు అస్సాంలో వైష్ణవ మఠాలకు చెందిన 15 మంది సత్రాధికారులు వంటి ప్రముఖ మత పెద్దలు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో హిమంత బిశ్వ శర్మ రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఆయన తొలిసారిగా 2021లో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాయకత్వంలో బీజేపీ ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో తన రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ప్రమాణ స్వీకారానికి ముందు బీజేపీ, ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా హిమంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు

# సహనం, దయాభావం జడ్జిలకు చాలా ముఖ్యం



## యువన్యాయవాదులు, జడ్జిలను ప్రోత్సహించాలి: సిజెఐ సూర్యకాంత్

**న్యూఢిల్లీ, మే 12:** న్యాయమూర్తులు ముఖ్యంగా యువ న్యాయవాదుల పట్ల సహనం, దయాభావంతో వ్యవహరించాలని, వారిని ప్రోత్సహించాలని సుప్రీంకోర్టు హితవు పలికింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఇటీవల ఒక యువ న్యాయవాదిని ఉద్దేశించి జడ్జి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, బార్ అసోసియేషన్ జోక్యంతో వివాదం సామరస్యంగా పరిష్కారమైనందున ఈ కేసును తాము ముగిస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈనెల 4న ఏపీ హైకోర్టులో జస్టిస్ రాజశేఖర్‌రావు, ఓ యువ న్యాయవాది కోపంతో ఫైళ్లను పోడియంపై కొట్టారని భావించి, ఆతడిని పోలీసు కస్టడీకి పంపిస్తానని హెచ్చరించారు. ఆ న్యాయవాది చేతిలోంచి ఫైలు జారిపోయిందని తెలిపారు. ఈ ఘటనపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానాలు చేయడంతో సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు న్యాయమూర్తి కేవలం మౌఖికంగా వ్యాఖ్యానించారని, ఎటువంటి లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వలేదని ధర్మాసనం గుర్తుచేసింది. ఈ సందర్భంగా, బెంచ్‌బార్ న్యాయమూర్తులు న్యాయవాదులు మధ్య వివాదాల పరిష్కారానికి అన్ని హైకోర్టులు, జిల్లా, తాలూకా స్థాయిల్లో గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. కోర్టు విచారణలకు సంబంధించిన ఎడిట్ చేసిన వీడియో క్లిప్పులను సందర్భం లేకుండా ప్రసారం చేయడంపై మీడియా బాధ్యతతో వ్యవహరించాలని, సమాజంలో మీడియా క్రియాశీలక పాత్ర పోషించాలని ఆశిస్తున్నట్లు వ్యాఖ్యానించింది.

# రెండుగా చీలిన అన్నాడిఎంకె!





## విజయ్ టివికెకు మద్దతు పలికిన షణ్ముగం వర్గం

## పళనిసామిపై తిరుగుబాటు చేసిన మెజారిటీ ఎమ్మెల్యేలు

**చెన్నై, మే 12:** తమిళనాడు ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం కూటమికి అనూహ్య మద్దతు లభించింది. అన్నాడీఎంకేలోని సీవీ షణ్ముగం నేతృత్వంలోని ఒక వర్గం మంగళవారం తమ మద్దతును ప్రకటించింది. ఈ పరిణామంతో విజయ్ ప్రభుత్వం మరింత బలోపేతమైంది. త్వరలోనే ముఖ్యమంత్రి విజయ్‌తో భేటీ కానున్నట్లు షణ్ముగం మీడియాకు తెలిపారు. గత దశాబ్ద కాలంగా అన్నాడీఎంకే ఎదుర్కొంటున్న వరుస ఓటములే తమ నిర్ణయానికి కారణమని షణ్ముగం వివరించారు. దశాబ్దాలుగా బద్ధ శత్రువుగా ఉన్న డీఎంకే చేతిలో మూడుసార్లు, గత నెలలో జరిగిన ఎన్నికల్లో టీవీకే చేతిలో ఓటమి పాలైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పార్టీని పునరుజ్జీవింపజేయాల్సిన అవసరం ఉంది. దాని భవిష్యత్తు గురించి చర్చించాలని అన్నారు. టీవీకేను అధికారంలోకి రాకుండా ఆపేందుకు, డీఎంకే మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిస్వామి (ఈపీఎస్) చేసిన ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకించామని షణ్ముగం స్పష్టం చేశారు. మనం డీఎంకేకు వ్యతిరేకంగా ఈ పార్టీని స్థాపించాం. 53 ఏళ్లుగా మన రాజకీయాలు డీఎంకేకు విరుద్ధంగానే సాగాయి. అలాంటిది డీఎంకే మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న ఆలోచనను మా సభ్యుల్లో మెజారిటీ వర్గం తిరస్కరించింది. ఒకవేళ అలాంటి పొత్తు పెట్టుకుంటే అన్నాడీఎంకే మనుగడే ఉండేది కాదని ఆయన స్పష్టం చేశారు. అన్నాడీఎంకేను చీల్చే ఉద్దేశం తనకు లేదని షణ్ముగం స్పష్టం చేశారు. ప్రస్తుతం మేం ఎలాంటి పొత్తు లేకుండా ఉన్నాం. పార్టీని బలోపేతం చేయడమే మా లక్ష్యం. అందుకే ఎన్నికల్లో గెలిచిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 234 స్థానాలకు గాను విజయ్ పార్టీ 108 సీట్లు గెలుచుకుంది. మెజారిటీకి 10 సీట్ల దూరంలో నిలిచిపోయింది. కాంగ్రెస్ 5 సీట్లతో మద్దతివ్వగా, రెండు వామపక్ష పార్టీలు (4), వీసీకే (2) మద్దతుతో టీవీకే ప్రభుత్వం ఏర్పడింది. ఈ పార్టీలన్నీ డీఎంకేకు దీర్ఘకాల మిత్రపక్షాలు కావడంతో ప్రభుత్వ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. తాజాగా షణ్ముగం వర్గం మద్దతుతో విజయ్ సర్కారు రాజకీయంగా మరింత స్థిరత్వం లభించినట్లయింది.

# పర్యాటకులు గుర్తుంచుకునే భారత్ ఇదే..



## డచ్ ట్రావెలర్ ఇన్‌స్టా అనుభూతి

**న్యూఢిల్లీ, మే 12:** సోలో మోటార్ సైకిల్ యాత్రలో భాగంగా భారతదేశాన్ని చుట్టేస్తున్న డచ్ ట్రావెలర్ మైకే హిజ్మాన్ కు ఒక హైవేపై చేదు అనుభవం ఎదురైంది. ఆమె ప్రయాణిస్తున్న బైక్ టైర్ మధ్యలోనే పంక్చర్ కావడంతో, ఎటు వెళ్లాలో తెలియక రోడ్డు పక్కన ఒంటరిగా నిలబడిపోయింది. ఆ ప్రాంతం తనకు కొత్త కావడం, బైక్ రిపేర్ చేయడం తెలియకపోవడంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. అయితే, ఆమె పరిస్థితిని గమనించిన ముగ్గురు స్థానిక వ్యక్తులు వెంటనే తమ వాహనాన్ని ఆపి ఆమెకు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఆ ముగ్గురు వ్యక్తులు టైరును పరిశీలించి, తాత్కాలికంగా దాన్ని సరిచేయడమే కాకుండా, సమీపంలోని మెకానిక్ షాపుకు ఆమెను సురక్షితంగా తీసుకెళ్లారు. ఈ మొత్తం ఉదంతాన్ని మైకే తన ఇన్స్టాగ్రామ్ వీడియోలో పంచుకుంటూ, ఆ అపరిచితులు తనను ఆదుకున్న తీరును చూసి ఎంతగానో ఊరట చెందానని పేర్కొంది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, పర్యాటకులు గుర్తుంచుకునే అసలైన భారతదేశం ఇదే అంటూ నెటిజన్లు కామెంట్లతో ముంచెత్తారు.

# టిఎంసినేత, మాజీ మంత్రి సుజిత్‌బోస్‌ను అరెస్టుచేసిన ఇడి



**కోల్‌కత్తా, మే 12:** పశ్చిమ బెంగాల్‌లో అధికార మార్పిడి తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌కు (టీఎంసీ) గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ మంత్రి సుజిత్ బోస్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. పురపాలక నియామకాల కుంభకోణం కేసుకు సంబంధించి కోల్‌కతాలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద ఈ అరెస్ట్ చేసినట్టు అధికారులు వెల్లడించారు. సౌత్ దమ్‌దమ్ మున్సిపాలిటీలో డబ్బు తీసుకుని దాదాపు 150 మందికి అక్రమంగా ఉద్యోగాలు ఇప్పించారని సుజిత్ బోస్‌పై ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగాలు ఇప్పించినందుకు ప్రతిఫలంగా ఆయన ఫ్లాట్లు, భారీ నగదు డిపాజిట్లు పొందినట్టు ఆధారాలు గుర్తించామని ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది.

సోమవారం ఉదయం తన కుమారుడితో కలిసి విచారణకు హాజరైన సుజిత్ బోస్‌ను ఈడీ అధికారులు గంటల తరబడి ప్రశ్నించారు. విచారణకు సహకరించకపోవడం, పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో ఆయనను అరెస్ట్ చేసినట్టు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధికారం కోల్పోయిన తర్వాత, ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి అరెస్ట్ కావడం ఇదే తొలిసారి.

# ఫ్లెక్సీలు, బ్యానర్లు కడితే చర్యలు తప్పవు!

## సిఎం విజయ్ పార్టీ టివికె హెచ్చరికలు



**చెన్నై,మే 12:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) శ్రేణులకు ఆ పార్టీ అధిష్టానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీని స్థాపించామని తెలిపిన టీవీకే, ప్రజలు ఇబ్బంది పడే పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి ఎన్. ఆనంద్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. నాయకుల పుట్టినరోజులు లేదా కుటుంబ వేడుకల సందర్భాల్లో వీధులు, బహిరంగ ప్రదేశాలు, జనసముహం ఉన్న చోట లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఎలాంటి బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని పార్టీ కార్యకర్తలను ఆదేశించింది. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎలాంటి వేడుకలు జరపకూడదని, ఒకవేళ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయించినట్లు పార్టీ ప్రకటించింది. ప్రజలు మనపై ఎంతో నమ్మకం ఉంచారని, ఆ నమ్మకాన్ని కాపాడుకుంటూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కార్యకర్తలకు సూచించింది. తమిళనాడు అభివృద్ధి కోసం పయనిస్తున్న తరుణంలో, ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని ఈ ప్రకటన ద్వారా టీవీకే గట్టి హెచ్చరిక జారీ చేసింది.

# ఒక్క ఓటుతో నెగ్గిన సేతుపతికి బ్రేక్!

## బలపరీక్షలో పాల్గొనవద్దని మద్రాసు హైకోర్టు ఆదేశం

## సుప్రీంలో సవాల్‌చేస్తున్న సేతుపతి

**చెన్నై, మే 12:** తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ శాసనసభలో తన బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్న వేళ ఒక టీవీకే ఎమ్మెల్యే కు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో నెగ్గిన ఆ ఎమ్మెల్యే సేతుపతి సభలో సీఎం విజయ్ బలపరీక్షలో పాల్గొనవద్దని ఆదేశించింది. ఈ మేరకు న్యాయస్థానం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దాంతో విజయ్ బలపరీక్షలో టీవీకే కూటమి బలం 119 సీట్లకు పడిపోయినట్లయ్యింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో శివగంగై జిల్లా తిరుప్పత్తూర్ నియోజకవర్గం నుంచి టీవీకే నేత శ్రీనివాస సేతుపతి విజయం సాధించారు. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెరియకరుప్పన్‌పై కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో సేతుపతి గెలుపొందారు. డీఎంకే నేత పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పోలవగా శ్రీనివాస సేతుపతి 83,375 ఓట్లతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ ఫలితాలపై డీఎంకే నేత పెరియ కరుప్పన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో పొరపాటు జరిగిందని తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియలోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కాబట్టి తిరుప్పత్తూర్‌లో రీకౌంటింగ్ జరపాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అప్పటివరకు శ్రీనివాస సేతుపతి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెరియకరుప్పన్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం విజయ్ విశ్వాసపరీక్ష ఓటింగ్‌లో శ్రీనివాస సేతుపతి పాల్గొనవద్దని ఆర్డర్ వేసింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలతో బలపరీక్షలో విజయ్‌కు ఒక ఓటు తగ్గినట్లయ్యింది. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్‌కి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ కలుపుకుని ప్రస్తుతం 120 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అందులో ఇప్పుడు ఒక ఎమ్మెల్యే బలపరీక్షలో పాల్గొనే అవకాశం లేకపోవడంతో విజయ్ బలం 119కి తగ్గిపోయింది. విజయ్ బలపరీక్షలో నెగ్గేందుకు మాత్రం ఎలాంటి అవాంతరం లేదు. విజయ్ బలపరీక్షలో నెగ్గడానికి 118 మంది ఎమ్మెల్యేల మద్దతు సరిపోతుంది. శ్రీనివాస సేతుపతికి బలపరీక్షలో ఓటువేసే అవకాశం లేకపోయియినా 119 ఓట్లతో విజయ్ బలపరీక్షలో నెగ్గనున్నారు.

# కపూర్ కుటుంబ వివాదం మహాభారతం మించిపోయింది!

## సుప్రీం న్యాయమూర్తి వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మే 12:** ప్రముఖ వ్యాపారవేత్త సంజయ్ కపూర్ మరణంతో మొదలైన రూ. 30వేల కోట్ల వారసత్వ వివాదంలో కుటుంబ సభ్యుల మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు సుప్రీంకోర్టుకు చేరింది. ఇందులో నటి కరిష్మా కపూర్ పేరు కూడా ముడిపడి ఉంది. ఈ వివాదంపై విచారణ సందర్భంగా జస్టిస్ జేబీ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "మేము ఒక ఘట్టంలోకి ప్రవేశించాం. దీని ముందు మహాభారతం కూడా చాలా చిన్నదిగా కనిపిస్తుంది" అని వ్యాఖ్యానించడం ఈ వివాద తీవ్రతను తెలియజేస్తోంది. గతేడాది జూన్ లో ఇంగ్లండ్‌లో పోలో ఆడుతూ వ్యాపారవేత్త సంజయ్ కపూర్ మరణించారు. కాగా, ఆయన తల్లి రాణి కపూర్ (80) నేడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కుటుంబ ఆస్తులలో కీలకమైన రఘు వంశీ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్‌ఐపీఎల్) బోర్డు ఈ నెల 18న సమావేశం కాకుండా నిరోధించాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. కోర్టు ఆదేశించిన మధ్యవర్తిత్వ ప్రక్రియను పక్కనపెట్టేందుకు ఇది ఒక మోసపూరిత ప్రయత్నమని ఆమె ఆరోపించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 14న విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు గత వారం సుప్రీంకోర్టు భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌ను మధ్యవర్తిగా నియమించిన విషయం తెలిసిందే. ఆర్‌కే ట్రస్ట్, సోనా కామ్‌స్టార్ తో పాటు కపూర్ కుటుంబానికి చెందిన కంపెనీలకు సంబంధించిన వివాదాలను ఆయన పరిష్కరించనున్నారు. అసలు ఈ ఆర్‌కే ట్రస్ట్ చట్టవిరుద్ధమని, ఫోర్జరీ, మోసంతో దానిని సృష్టించారని రాణి కపూర్ గతంలోనే హైకోర్టులో సివిల్ దావా వేశారు. ఈ మధ్యవర్తిత్వ ప్రక్రియలో సంజయ్ కపూర్ రాసిన వీలునామాకు సంబంధించిన వివాదం లేదు. ఆ వీలునామాపై సంజయ్ కపూర్ మూడో భార్య ప్రియా కపూర్‌కు, ఆయన రెండో భార్య, నటి కరిష్మా కపూర్‌కు పుట్టిన పిల్లలు కియాన్, సమీరా కపూర్‌లకు మధ్య వేరే న్యాయపోరాటం జరుగుతోంది. సంజయ్ కపూర్ వీలునామాను ప్రియా కపూర్ ఫోర్జరీ చేశారని పిల్లలు ఆరోపిస్తున్నారు. ఇది కాకుండా ప్రియా కపూర్‌కు, సంజయ్ కపూర్ సోదరి మందిరా కపూర్ స్మిత్‌కు మధ్య పరువునష్టం కేసు కూడా నడుస్తోంది. ఈ కు టుంబ వివాదాలు బహుముఖ కోణాల్లో కొన సాగుతుండటంతో న్యాయస్థానాలు సైతం విసిగిపోతున్నాయి. ఫిబ్రవరిలో ఢిల్లీ హైకోర్టు ఇరు పక్షాలను గౌరవంగా ప్రవర్తించాలని మందలించింది.



# ఉపగ్రహ ప్రయోగాల్లో స్పేస్‌ఎక్స్ రికార్డు



## ప్రపంచమంతా ఒకవైపు.. ఎలాన్ మస్క్ మరోవైపు!

**వాషింగ్టన్, మే 12:** ఈ భూమిపై మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్ సేవలు అందించాలన్న లక్ష్యంతో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ పని చేస్తోంది. అంతరిక్షయాన చరిత్రలో ఈ సంస్థ త్వరలో ఓ అద్భుతమైన మైలురాయిని చేరుకునేందుకు సిద్ధమైంది. 1957లో అంతరిక్ష యుగం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం ప్రపంచ దేశాలు, సంస్థలు అన్నీ కలిపి 15,062 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రయోగించగా.. ఒక్క స్పేస్‌ఎక్స్ మాత్రమే 14,844 శాటిలైట్లను ప్రయోగించడం విశేషం. మరో 200 శాటిలైట్లను మస్క్ సంస్థ అంతరిక్షంలోకి ప్రయోగిస్తే.. ప్రపంచంలో అత్యధిక ఉపగ్రహాలు ప్రయోగించిన సంస్థగా చరిత్ర సృష్టిస్తుంది. తన ప్రయోగ సామర్థ్యాన్ని మరింత గణనీయంగా పెంచే లక్ష్యంతో స్పేస్‌ఎక్స్ ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్ వ్యవస్థ అయిన 'స్టార్‌షిప్'ను కూడా అభివృద్ధి చేస్తోంది. అయితే, ఈ శాటిలైట్లు ఓవైపు గ్లోబల్ ఇంటర్నెట్ కనెక్టివిటీలో విప్లవాత్మక పురోగతికి శ్రీకారం చుడుతూనే.. మరోవైపు విశ్వ పరిశోధనలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఖగోళ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కక్ష్యలో స్టార్‌లింక్ ఉపగ్రహాల సంఖ్య పెరుగుతుండటంతో ఇవి బ్లాక్‌హోల్‌లు, సుదూర గెలాక్సీలపై చేపట్టే పరిశోధనలపై ప్రభావం చూపిస్తున్నాయని.. కక్ష్య రద్దీ, అంతరిక్షక శిథిలాలు వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ కూడా గణనీయమైన ఉనికిని కలిగి ఉంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. ప్రస్తుతం కక్ష్యలో 86 భారతీయ ఉపగ్రహాలు ఉన్నాయి. వాటిలో 27 మాత్రమే పనిచేస్తున్నాయి.

కమ్యూనికేషన్, నావిగేషన్, భూ పరిశీల, శాస్త్రీయ మిషన్ల వంటి రంగాల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తన ఉపగ్రహ సామర్థ్యాలను మరింత విస్తరిస్తోంది. అక్టోబర్‌లో కూడా ఈడీ అధికారులు సుజిత్ బోస్ నివాసంలో సోదాలు నిర్వహించారు.

# ఎన్నికల్లో సిఇఒగాచేసిన అధికారికి సిఎస్ పదవి!

## సోషల్‌మీడియాలో రాహుల్ ఫైర్

**న్యూఢిల్లీ, మే 12:** పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చిచ్చు రేపింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా పనిచేసిన మనోజ్ అగర్వాల్‌ను, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) వంటి అత్యున్నత పదవిలో నియమించడం తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ నియామకాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. దీనిని బీజేపీ ఈసీ చోర్ బజార్ గా అభివర్ణిస్తూ ఎక్స్ వేదికగా సంచలన పోస్ట్ చేశారు. ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపించిన ఆయన దొంగతనం ఎంత పెద్దదైతే, దానికి లభించే ప్రతిఫలం కూడా అంత పెద్దదిగా ఉంటుందిఅంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన వ్యక్తికి ఇలాంటి కీలక పదవి ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ నేతలు కూడా ఈ చర్యపై నిప్పులు చెరుగుతున్నారు. బెంగాల్ ఎన్నికలను బీజేపీ, ఈసీ కలిసి దొంగిలించాయని, అందుకు ఈ నియామకమే నిదర్శనమని మండిపడుతున్నారు. ఎన్నికల పారదర్శకతపై నీడలు కమ్ముకున్నాయని టీఎంసీ విమర్శిస్తోంది.

# ఔషధాల రవాణా కోసం భారతీయ రైల్వేలో ఔషధి ఎక్స్‌ప్రెస్



**ముంబయి, మే 12:** భారతీయ రైల్వే మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. హైదరాబాద్ నుంచి ఔషధాలను సురక్షితంగా ఎగుమతి చేసేందుకు ఔషధి ఎక్స్‌ప్రెస్ పేరుతో దేశంలోనే మొట్టమొదటి ఫార్మసీ రైలును అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్రత్యేక రైలు ఈ నెల 2వ తేదీన హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టుకు తన తొలి యాత్రను విజయవంతంగా పూర్తి చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఔషధాలను వాటి నాణ్యత ఏమాత్రం దెబ్బతినకుండా నిర్ణీత ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయడం అత్యంత కీలకం. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ రైలులో అత్యాధునిక కోల్డ్ స్టోరేజీ కంటైనర్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల హైదరాబాద్‌లోని వందలాది ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను సురక్షితంగా, వేగంగా ముంబై పోర్టుకు చేరవేసి, అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేయడం సులభతరం అవుతుంది. గతంలో రోడ్డు మార్గంలో రవాణాకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల వల్ల మందులు పాడయ్యే ప్రమాదం ఉండేది. ఔషధి ఎక్స్‌ప్రెస్ ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనుంది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ పీఎం గతిశక్తి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ఆవిష్కరణకు సహకరించిన ప్రధానికి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

# శృంగేరి రీకౌంటింగ్‌పై సుప్రీం స్టే

**న్యూఢిల్లీ, మే 12:** కర్ణాటకలోని శృంగేరి అసెంబ్లీ నియోజకవర్గంలో వివాదాస్పదంగా మారిన రీకౌంటింగ్ ఫలితంపై సుప్రీంకోర్టు మంగళవారం స్టే విధించింది. రీకౌంటింగ్ ద్వారా బీజేపీ అభ్యర్థి డీఎన్ జీవరాజ్ ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, ఆ ప్రక్రియను నిలిపివేస్తూ అత్యున్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రీకౌంటింగ్‌కు ముందు ఉన్న యథాతథ స్థితిని (స్టేటస్ కో యాంటీ) పునరుద్ధరించాలని ఆదేశించింది. దీంతో, తొలుత విజేతగా ప్రకటించబడిన కాంగ్రెస్ అభ్యర్థి టీడీ రాజేగౌడకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ వ్యవహారంపై రాజేగౌడ దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కే వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారించింది. తిరస్కరణకు గురైన 279 పోస్టల్ బ్యాలెట్లను మాత్రమే పునఃపరిశీలించాలని కర్ణాటక హైకోర్టు ఆదేశించగా, రిటర్నింగ్ అధికారి మాత్రం రాజేగౌడకు అనుకూలంగా ఉన్న 562 చెల్లుబాటైన పోస్టల్ బ్యాలెట్లను కూడా తిరిగి లెక్కించారని రాజేగౌడ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు.

# తమిళ స్పీకర్‌గా ప్రభాకర్, డిప్యూటీగా రవిశంకర్

## అసెంబ్లీ రెండవరోజున రెండు పదవులకు ఎన్నిక

**చెన్నై, మే 12:** తమిళనాడులో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వం అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవంగా పూర్తి చేసింది. 17వ తమిళనాడు శాసనసభ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్, డిప్యూటీ స్పీకర్‌గా రవిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ సమావేశాల రెండో రోజు ఈ ఎన్నిక జరిగింది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు వేరే అభ్యర్థులు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రొటెం స్పీకర్ కరుప్పియా ప్రకటించారు. అనంతరం, సభా సంప్రదాయం ప్రకారం ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ నూతన స్పీకర్ ప్రభాకర్‌ను గౌరవంగా స్పీకర్ కుర్చీ వద్దకు తోడ్కొని వెళ్లారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన విషయం తెలిసిందే. పలు పార్టీల మద్దతుతో టీవీకే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నిన్న ప్రారంభమైన తొలి సెషన్‌లో ఎమ్మెల్యేలందరూ ప్రమాణ స్వీకారం చేయగా, రెండో రోజు స్పీకర్ ఎన్నికను పూర్తి చేశారు. నూతనంగా ఎన్నికైన స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌కు ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌తో పాటు పలువురు సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ మాట్లాడుతూ, టీవీకే ప్రభుత్వానికి తమ మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రి విజయ్ రాబోయే ఐదేళ్లు సుపరిపాలన అందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత శాసనసభ కార్యకలాపాలు సజావుగా సాగడానికి ఈ ఏకగ్రీవ ఎన్నిక దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మేం సీనియర్లం.. మా సలహాలు తీసుకోవాలి!

## అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ప్రసంగం



**చెన్నై, మే 12:** తమిళనాడు అసెంబ్లీ వేదికగా డీఎంకే నేత, మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, ప్రస్తుత ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను, సీఎం విజయ్ ఇద్దరం చెన్నైలోని లయోలా కాలేజీలోనే చదువుకున్నామని గుర్తు చేస్తూనే, పాలన విషయానికి వస్తే డీఎంకే పార్టీనే ఎంతో సీనియర్ అని అన్నారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన రాజకీయాల్లో విజయ్ ప్రభుత్వానికి తమ సలహాలు, సూచనలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సీఎం విజయ్ నా కాలేజీ సీనియర్. పరిపాలనలో డీఎంకే పార్టీ చాలా సీనియర్. 1967లోనే మా పార్టీ అధికారంలోకి వచ్చింది. మాకున్న అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. రాష్ట్ర సంక్షేమం కోసం మా సలహాలను సీఎం విజయ్ స్వీకరించాలని ఉదయనిధి సూచించారు. తమిళనాడు శ్రేయస్సే తమకు ముఖ్యమని, రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలనే ఉద్దేశంతోనే ఈ మాటలు చెబుతున్నానని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకున్న ఒక అంశాన్ని ప్రస్తావిస్తూ ఉదయనిధి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మొదటగా ఆలపించాల్సిన తమిళ్ తాయ్ వాల్తు (తమిళ తల్లి ప్రార్థన గీతం)ను చివర్లో పాడటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందు వందేమాతరం, ఆ తర్వాత జాతీయగీతం ఆలపించి, చివర్లో తమిళ్ తాయ్ వాల్తును పాడారు. ఇది సరైన పద్ధతి కాదు. తమిళ సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలి. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ప్రభుత్వం చూసుకోవాలని ఆయన తెలిపారు. మళ్లీ సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు ఇదే సమయంలో ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై తన వివాదాస్పద వైఖరిని పునరుద్ఘాటించారు.

# మహిళలకు గొర్రెలు, మేకలు, కోళ్లు

## సాధికారితకు సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, మే12, ప్రభాతవార్త:** మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వినూత్న పథకాలను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇందులో భాగంగా తాజాగా గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లోని మహిళలకు గొర్రెలు, మేకలు, నాటుకోళ్లను సబ్సిడీ కింద అందించనుంది. జూన్ 2 నుంచి ఈ కొత్త పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ ప్రాజెక్టు గ్రామీణ మహిళలు సొంతంగా ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహిస్తుందని అధికారవర్గాలు వెల్లడించాయి. అధికారిక వివరాల ప్రకారం ఈ పథకాన్ని కేవలం సంప్రదాయ గొర్రెల పెంపకానికే పరిమితం చేయకుండా ఆధునిక పద్ధతుల్లో మహిళలకు లాభాలను ఆర్జించే విభిన్న యూనిట్లను కూడా అందించనున్నారు. వాటిలో పొట్టేళ్ల పెంపకం, గొర్రెలు, మేకల యూనిట్లు , నాటుకోళ్ల పెంపకం, ప్రత్యేకంగా ఈము పక్షుల యూనిట్లను ఇవ్వనున్నారు. అలాగే వాటి పెంపంకం కోసం సబ్సిడీ కింద ఆర్థిక సాహాయం కూడా అందించనున్నారు. ఈ యూనిట్ల నిర్వహణలో లబ్ధిదారులకు మెరుగైన అవగాహన కల్పించేందుకు పశువైద్య విశ్వవిద్యాలయ నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నారు. ఈ శిక్షణలో పశువుల ఆరోగ్యం, సరైన మేత నిర్వహణ, వ్యాధి నిరోధక చర్యల గురించి నిపుణులు అవగాహన కల్పిస్తారు. అయితే ఈ పథకం కింద ఎంపికైన మహిళలకు బ్యాంకులతో అనుసంధానం చేసి తక్కువ వడ్డీకే రుణాలు, రివాల్వింగ్ ఫండ్స్, ప్రభుత్వం నుంచి భారీగా సబ్సిడీల అందజేస్తారు. శిక్షణ పొందిన మహిళలు నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకురావడం ద్వారా మంచి లాభాలు పొందుతారని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా బండి కొడుకు నిర్దోషిత్వం నిరూపించుకోవాలి

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** రాముడి, భాగ్యలక్ష్మి ౖ అమ్మవారి సాక్షి గా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రమాణంచేసి తన కొడుకు నిర్దోషి అని నిరూపించు కోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రతీ చిన్న విషయాలపైన రాద్ధాం తం చేసి ప్రభుత్వంపైన విమర్శలు చేసే మంత్రి బండి సంజయ్ తన కొడుకు కేసుపైన ఎందుకు మాట్లాడటం లేదు? బాలికదే తప్పు అన్నట్లుగా చిత్రీకరించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. బండి సంజయ్ తన కొడుకును ఎందుకు దాచి పెట్టాడు, ఎందుకు పోలీసులు సహకరించడం లేదు? అని ఆయన ప్రశ్నించారు. బండి సంజయ్ కుమారుడి కేసుపైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారని, మహిళా ఐపిఎస్ ఆధ్వర్యంలో విచారణ కొన సాగుతోందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉందనీ ప్రభుత్వం పైన నెపం నెట్టడానికి బిఆర్ఎస్ దొంగ ధర్నాలు చేస్తోందన్నారు. తమకు, తమ పార్టీకి సంబంధం లేదని బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడం అన్యాయమన్నారు. బిజెపి మంత్రి కుమారుడిపైన పోక్సో కేసు నమోదయితే తమకు సంబంధం లేదని రామచందర్‌రావు ఎలా అంటారు?బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# హైబ్రిడ్ పద్ధతిన ఖనిజాల కేటాయింపులు

## రాష్ట్ర గనుల శాఖ నిర్ణయం

**హైదరాబాద్, మే12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చిన్నతరహా ఖనిజాలకు సంబంధించి కేటాయింపులకు కొత్త విధానం అవలంబించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ నిర్ణయించింది. ఇందుకు గాను చినతరహా ఖనిజాల కేటాయింపులు ఇక నుండి హైబ్రీడ్ పద్ధతిలో జరపనుంది. ప్రధానంగా గ్రానైట్, మార్బుల్ వంటి చిన్న తరహా ఖనిజ బ్లాకుల కేటాయింపునకు హైబ్రిడ్ విధానాన్ని అనుసరించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటి వరకూ రెవెన్యూ, అటవీ తదితర శాఖల నుంచి అనుమతులు పొందిన తర్వాతే ప్రభుత్వ భూముల్లోని ఖనిజ బ్లాకులకు వేలం పాటలు నిర్వహించే వారు. ఇకపై అనుమతులు ఉన్నా, లేకున్నా డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ సర్వే ద్వారా గుర్తించిన అన్ని బ్లాకులకు టెండర్లను ఆహ్వానించేలా హైబ్రిడ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. పట్టా భూముల్లో ఆయా గనులు ఉన్నట్లయితే సంబంధిత యజమానికి సీనరేజీ ఫీజులో 10శాతం (గ్రానైట్, మార్బుల్‌కు సంబంధించి 5 శాతం) మొత్తాన్ని చెల్లించనున్నట్లు వివరించింది.



నిందితుడు భగీరథ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు

# బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

## ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధిత బాలికపై పోలీసులు కేసు పెట్టడం సిగ్గుచేటు: ఐక్యవేదిక

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 12, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయిభగీరథ్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడటాన్ని మహిళా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించాయి. బాలిక తనపై భగీరథ్ అత్యాచారం చేశాడని, నాలుగు నెలలుగా లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వస్తే గంటలు తరబడి ఆమెను నిలబెట్టి దోషులకు సమాచారం ఇవ్వడం సిగ్గుచేటని మహిళా సంఘాల నాయకురాళ్లు ధ్వజమెత్తారు. మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక ప్రతినిధులు, పివోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, అఖిల భారత మహిళా సమాఖ్య నాయకురాలు ఎన్.జ్యోతి, చైతన్య మహిళా పంఘం అధ్యక్షురాలు బి.జ్యోతి, వివిధ మహి ళా సంఘాల ప్రతినిధులు అనసూయ, హేమలత, స్వరూప, జి.భారతి, బి.లక్ష్మి, ఎస్.వరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ పోక్స్ చట్టం ప్రకారం అతని పైన వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాల్సిందిపోయి దోషులకు సమాచారం ఇచ్చి బాధితురాలిపైన తిరిగి పోలీసులు కేసు పెట్టడం దారుణమన్నారు. బాధితురాలికి ఆమె కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారు స్పష్టం చేశారు.

# ఎస్ఎస్ఎ సిబ్బందికి వేతనాలు పెంపు

## 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు

**హైదరాబాద్, మే12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ) ఉద్యోగుల వేతనాలు పెరగనున్నాయి.రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచే వేతనాలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఉన్న వేతనాలకు 5 శాతం పెంచి రానున్న విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వేతనం పెరగనుంది. రాష్ట్రంలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతనాల్లో 5 శాతం పెంచాలని పాఠశాల విద్య శాఖ భావించిన నేపథ్యంలో అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది. ప్రభుత్వం కూడా ఎస్ఎస్ఎ ఉద్యోగుల వేతనాల పెంపుకు సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచే ఈ పెంపును అమలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని కేజీబీవీలతోపాటు ఇతర పాఠశాల విద్య శాఖలో సుమారు 18 వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వారందరినీ వేతనాలు ప్రస్తుతం ఉన్న వాటి కంటే 5 శాతం పెంచి ఇవ్వనున్నారు.

# ‘ట్రిపుల్ విన్’తో ప్రపంచవ్యాప్తంగా ఉపాధి



ట్రిపుల్ విన్ ప్రోగ్రామ్‌లో భాగంగా శిక్షణ పొందుతున్న నర్సులతో మంగళవారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి తదితరులు

## నర్సులు జర్మన్ భాషపై పట్టు సాధిస్తే ఉజ్వల కెరీర్: మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** టామ్‌కామ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న నర్సులు జర్మన్ భాషతోపాటు ఆంగ్లం కమ్యూనికేషన్ నైపుణ్యాలపై పట్టు సాధించి ప్రపంచ స్థాయి అవకాశాలకు సిద్ధం కావాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ట్రిపుల్ విన్ ప్రోగ్రామ్‌లో భాగంగా శిక్షణ పొందుతున్న నర్సులతో మంత్రి వెంకటస్వామి మంగళవారం టూరిజం ప్లాజాలో ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. జర్మనీలో పనిచేయడం ఓ పెద్ద అవకాశమే కాదు ఛాలెంజ్ కూడా అని అన్నా రు. కొత్త భాష, కొత్త వాతావరణం, కొత్త విధానాలకు అలవాటు పడాల్సి ఉంటుందని, అయితే కష్టపడి నేర్చుకుంటే విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. అంత ర్జాతీయ నర్సింగ్ డే శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి ‘నర్సులు రోగులకు ఇచ్చే ధైర్యం, నమ్మకంతోనే సగం వ్యాధి తగ్గిపోతుందని, వైద్య చికిత్సలో మీ పాత్ర ఎంతో గొప్పది’ అన్నారు. టామ్‌కామ్ ద్వారా యువతకు అంతర్జాతీయ స్థాయి లో అవకాశాలు కల్పిస్తు న్నామన్నారు. ఈ బ్యాచ్ జర్మనీలో మంచి ప్రతిభ కనబరిస్తే, భవిష్యత్తులో మరింత మంది తెలంగాణ యువతకు అవకాశాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా కూడా భాషలను సులభంగా నేర్చుకునే అవకాశాలు ఉన్నాయని వివరించారు. తమిళనాడులో విజయ్ ఉదాహరణను ప్రస్తావిస్తూ, ఆధునిక టెక్నాలజీ, సోషల్ మీడియా, కమ్యూనికేషన్ నైపుణ్యాలను సమర్థంగా ఉపయోగించుకుంటే గొప్ప విజయాలు సాధించవచ్చని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రాష్ట్రంలో మరిన్ని నర్సింగ్ కళాశాలలు, సీట్ల పెంపుపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. లేబర్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కమిషనర్ హరిచందన మాట్లాడుతూ, తాను మొదటిసారి హిందీ భాష నేర్చుకునే సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. జర్మన్ సంస్కృతిని కూడా అర్థం చేసుకుని అలవాటు చేసుకోవాలని సూచించారు. టామ్‌కామ్ డైరెక్టర్ కాంతి వెస్లీ మాట్లాడుతూ, టామ్ కామ్‌లో శిక్షణ పొందిన 46 మంది నర్సులు జర్మన్ భాష శిక్షణ పూర్తి చేసుకోగా, వారిలో 15 మందికి ఆఫర్ లెటర్లు వచ్చాయని, ఇప్పటికే 7 మంది జర్మనీలో ఉద్యోగాలు చేస్తున్నారని వివరించారు.

# వెట్‌ల్యాండ్స్ రక్షణ నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 12:** తెలంగాణ రాష్ట్రంలోని వెట్ ల్యాండ్స్ (చెరువులు, నీటి వనరులు) పరిరక్షణ, వాటి అధికారిక నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. అంబేడ్కర్ సచివాలయంలో మంగళవారం ఆమె అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్ అథారిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వెట్‌ల్యాండ్స్ పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వెట్‌ల్యాండ్స్ (కన్జర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్) రూల్స్- 2017 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, వెట్‌ల్యాండ్స్ సరిహద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఏసి అట్లాస్‌లో గుర్తించిన 12,249 వెట్‌ల్యాండ్స్‌పై గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తయిందని అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 4,023 వెట్‌ల్యాండ్స్‌కు సరిహద్దుల నిర్ధారణ పూర్తైందని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్త సర్వేలను వేగంగా పూర్తి చేసి ‘బ్రీఫ్ డాక్యుమెంట్స్’ సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. జిల్లా వెట్‌ల్యాండ్ అథారిటీల నుంచి ఖచ్చితమైన నివేదికలు వచ్చేలా శాఖల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఖమ్మం, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ప్రధాన వెట్‌ల్యాండ్స్ సహా 28 ప్రాంతాలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు సిద్ధమైనట్లు సమావేశంలో వెల్లడించారు. ఇవి త్వరలో గెజిట్ నోటిఫికేషన్, ప్రజాభిప్రాయ సేకరణ దశలకు వెళ్లనున్నట్లు తెలిపారు. మంజీరా వన్యప్రాణి అభయారణ్యాన్ని అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన రామ్‌సార్ సైట్‌గా గుర్తింపు పొందేందుకు పంపిన ప్రతిపాదనపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఇరిగేషన్ శాఖ వద్ద తుది అభిప్రాయాల కోసం ఉందని, అనంతరం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. వెట్‌ల్యాండ్స్ పరిరక్షణలో నిపుణుల అభిప్రాయాలు, శాస్త్రీయ అధ్యయనాలు కీలకమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విజయవంతమైన నమూనాలను పంచుకోవడంతో పాటు స్థానిక స్థాయిలో కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, అటవీ దళాల అధిపతి డాక్టర్ సువర్ణ, వైల్డ్ లైఫ్ చీఫ్ వినయ్ కుమార్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 1,919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు

## నర్సింగ్ వృత్తి కాదు.. మానవత్వానికి మహదవకాశం

## రెండున్నరేళ్లలో ఆరోగ్య శాఖలో 13 వేల పోస్టులను భర్తీ చేశాం

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈరోజు మీకు జీవితాంతం గుర్తిండిపోతుందన్నారు. నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశమని, రోగులకు చికిత్స అందించడమే కాకుండా వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులేనని అన్నారు. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా అందరం స్మరించుకోవాలన్నారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలని కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని పని చేయాలని మంత్రి నర్సులకు సూచించారు. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకరమైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారని గుర్తు చేశారు. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశామన్నారు. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశామని, ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు, 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించామన్నారు. ఇపుడు 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నామన్నారు. ఈ రెండేళ్లలో కొత్తగా 16 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశామని, అందులో 960 బీఎస్సీ నర్సింగ్ సీట్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3 మిడ్‌వైఫరీ ట్రైనింగ్ కళాశాలలు మాత్రమే ఉన్నాయని వాటిల్లో 90 సీట్లు మాత్రమే ఉన్నాయని, దశలవారీగా అన్ని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలకు మిడ్‌వైఫరీ ట్రైనింగ్ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 13 వేల పోస్టులను ఆరోగ్యశాఖలో నియామకాలు పూర్తి చేశారన్నారు.



మంగళవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో నియామక పత్రాలను అందజేస్తున్న వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో మంత్రి పొన్నం తదితరులు

# నైనీ బొగ్గు వెలికితీతకు మార్గం సుగమం

## రాష్ట్ర విద్యుత్ రంగానికి భారీ ఊరట

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** ఒడిశాలోని అంగుల్ జిల్లాలో ఉన్న నైని బొగ్గు గని నుండి బొగ్గు వెలికితీతకు మార్గం సుగమమవ్వడంతో తెలంగాణ విద్యుత్ రంగానికి పెద్ద ఊతం లభించినట్లయింది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్రం సంయుక్తంగా ఏర్పాటు చేసిన సింగరేణి కాలరీస్ ఈ బొగ్గు వెలికితీతకు సంబంధించి ఈ ఏడాది కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని సంస్థ అధికారవర్గాలు వెల్లడించాయి. జూలై 4న, 643 హెక్టార్ల అటవీ భూమిని సింగరేణికి బదిలీ చేయడానికి ఒడిశా ప్రభుత్వం ఆమోదం తెలపడంతో చివరి పెద్ద అడ్డంకి కూడా తొలగిపోయింది. ఈ కార్యక్రమాలలో రెవెన్యూ శాఖ ద్వారా పునరావాసం, పరిసర ప్రాంతాల అభివృద్ధి సలహా కమిటీ సమావేశం నిర్వహించడం, రోడ్డు కారిడార్ నిర్మించడం, రాష్ట్ర అటవీ శాఖ ద్వారా చెట్లను నరికివేయడం వంటివి ఉన్నాయి. కాగా ఈ ఏడాది నుంచే బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలన్నది తమ లక్ష్యమని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. 2015 ఆగస్టులో ఛెండిపడలోని నైని బొగ్గు గనిని పొందిన సింగరేణి తెలంగాణలోని తన విద్యుత్ ప్లాంట్లకు ఇంధనం అందించడానికి బొగ్గును రవాణా చేస్తుంది. ఇదే సమయంలో ఒడిశాలో ఒక థర్మల్ విద్యుత్ ప్లాంటును స్థాపించి, ఆ రాష్ట్రానికి రాయితీ ధరకే విద్యుత్ అందించడానికి కూడా కట్టుబడి ఉంది. ఈ విద్యుత్ ప్లాంటు రాబోయే నాలుగేళ్లలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నైనీ బొగ్గు బ్లాక్‌లకు సంబంధించి ఇప్పటికే కేంద్ర పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నుండి అటవీ అనుమతిని పొందింది. సంవత్సరానికి కోటి టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో, నైని గని సింగరేణి బొగ్గు అవసరాలను గణనీయంగా తీరుస్తుంది. ఇది ప్రారంభంలో పెగడపల్లిలోని సింగరేణి 2/600 మెగావాట్ల విద్యుత్ ప్లాంటుకు బొగ్గును సరఫరా చేస్తుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

# బిసి గృహ గుర్తింపునకు కాలమ్-13లో ఏర్పాటు చేయండి

## బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జన గణన లో గృహాల ఐడెంటిఫికేషన్ కాలమ్- 13లో బిసిల గృహాల ఐడెంటిఫికేషన్ కోసం సమాచార నిక్షిప్త ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ ల మాదిరి బిసి గృహ దత్తాంశ సేకరణకు అనువుగా ఏర్పాటు చేర్చాలని సోమవారం ప్రధాన మంత్రి మోడీకి విజ్ఞప్తి చేశామనీ దానికి సానుకూలంగా ప్రధాని స్పందించారని మంత్రి పొన్నం ప్రభాకర్‌తెలిపారు.మరోసారి ప్రధాని మోడీని తెలంగాణ బిజెపి నాయకులను కోరుతున్నా, దేశవ్యాప్తంగా జన గణనలో బిసి గణన బిజెపి ప్రభుత్వం ఒప్పుకుంది ఐతే ప్రస్తుతం జరుగుతున్న హౌజ్ హోల్డర్స్ సర్వేలో కాలం 13లో ఎస్సీ ఎస్టీల మాదిరి బిసిల అంశాన్ని చేర్చేలా తెలంగాణ బిజెపి నాయకులు చొరవ తీసుకోవాలనీ ఆయన కోరారు.

# బెంబేలెత్తిస్తున్న చికెన్ ధరలు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** తెలంగాణలో చికెన్ ధరలు మాంసాహారులను బెంబేలిత్తిస్తున్నాయి. పది రోజుల్లో ఏకంగా కిలో చికెన్ ధర రూ. 100 వరకు పెరగడం వినియోగదారులను ఆందోళన కలిగిస్తోంది. వారం క్రితం వరకు హైదరాబాద్‌లో కిలో స్కిల్ లెస్ చికెన్ ధర రూ.240 ఉండగా ఇప్పుడు పలు ప్రాంతాల్లో రూ. 350 నుంచి రూ.370 వరకు పలుకుతోంది. ఫామ్‌లలో లైవ్ చికెన్ కెజి రూ. 170 నుంచి రూ. 180 వరకు ఉండగా గుడ్ల ధరలు డజన్ కు రూ. 72 నుంచి రూ. 75కు చేరుకుంది. రాష్ట్రంలో పెరిగిపోతున్న ఎండల తీవ్రత ఫౌల్ట్రీ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వడగాల్పుల కారణంగా ఫారాల్లోని కోళ్లు ఆహారం సరిగా తీసుకోవడం లేదని, వేడిని తట్టుకోలేక పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని ఫౌల్ట్రీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా డిమాండ్‌కు సరిపడ ఉత్పత్తి లేక చికెన్ ధరలు పెరుగుతన్నట్లు చెబుతున్నారు. వీటికి తోడు రవాణా ఖర్చులు సైతం భారంగా మారాయని దాంతో చికెన్ ధరలు పెంచక తప్పడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో పరిస్థితి ఇలాగే కొనసాగితే కేజీ చికెన్ ధర రూ. 400 మార్క్‌ను దాటినా ఆశ్చర్య పోనక్కర్లేదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# పరీక్ష రద్దు దురదృష్టకరం

## వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** నీట్ పరీక్ష రద్దుపై మంత్రులు స్పందించారు. నీట్ పరీక్ష రద్దు కావడం అత్యంత దురదృష్టకరమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. తెలంగాణలో సుమారు 70 వేల మంది, దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మందికిపైగా విద్యార్థులు నీట్ రాసి.. ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వారి భవిష్యత్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ఇబ్బందుల్లోకి నెట్టిందని, నీట్ నిర్వాహణలో ఎన్‌టీఏ పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో జరిగిన ఘటనల నుంచి నేర్చుకుని, పకడ్బందీగా పరీక్ష నిర్వహించకుండా నిరక్ష ్యం వహించిందన్నారు. పరీక్ష రద్దు కావడంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా సరియైన రీతిలో స్పందించి.. ఇంత పెద్ద తప్పిదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, దేశవ్యాప్తంగా పరీక్ష రద్దు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహంవ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీ అత్యంత ఆందోళనకరమన్నారు. రాష్ట్రంలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని నీట్ పరీక్ష రాశారని, అలాంటి కీలక పరీక్షలో అవకతవకలు చోటుచేసుకోవడం విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందని మంత్రి పేర్కొన్నారు. కేంద్రంలో, రాజస్థాన్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని దద్దమ్మ ప్రభుత్వం కేంద్రంలో ఉండటం దురదృష్టకర మన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు దేశ విద్యా వ్యవస్థ పరువును దిగజార్చాయని, ఈ పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### నీట్ పరీక్ష రద్దుపై విద్యార్థి, యువజన సంఘాల ఆగ్రహం

నీట్ పరీక్ష రద్దుపై విద్యార్థి, యువజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పరీక్ష లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

# ఢిల్లీ హైకోర్టుకు అక్కినేని నాగార్జున

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 12:** తన వ్యక్తిగత హక్కులకు (పర్సనాలిటీ రైట్స్) భంగం కలిగిస్తున్నారంటూ ఢిల్లీ హైకోర్టును సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా పేరు, ఫొటోలను వాడుకుంటున్నారని హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఓ బట్టల వ్యాపారి దుస్తులపై తన చిత్రాలు, పేరు వాడుతున్నాడని కోర్టు దృష్టికి నాగార్జున తీసుకెళ్లారు. ఈ కేసుపై నేడు విచారణ చేపట్టిన న్యాయస్థానం సదరు వ్యాపారిపై సీరియస్ అయ్యింది. నాగార్జున టీ షర్టులు మీరెలా అమ్ముతారంటూ వ్యాపారిని హైకోర్టు ప్రశ్నించింది. ఫొటోలను వాణిజ్యపరంగా వాడుకునే అధికారం మీకు ఎవరిచ్చారంటూ కోర్టు ప్రశ్నించింది. తొలుత వ్యాపారి తరఫు న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ ‘ది ఘోస్ట్’ సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి తమకు కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. ఓ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా ప్రొడక్షన్ హౌస్‌తో తమకు ఒప్పందం ఉందని.. నాగార్జున స్వయంగా ఆ వస్తువులను ప్రమోట్ చేశారని స్పష్టం చేశారు. దీనిపై నాగార్జున తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలు అడిగినప్పటికీ సమర్పించలేదని, కోర్టుకు ఇచ్చిన ఈమెయిల్ కాపీలు సైతం అసంపూర్ణంగా ఉన్నాయని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు.
చివరికి, ఈ వ్యవహారంలో తమకు నాగార్జునతో కానీ, సంబంధిత నిర్మాణ సంస్థతో కానీ ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని న్యాయస్థానం ముందు వ్యాపారి అంగీకరించారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నాగార్జున, ప్రొడక్షన్ హౌస్‌తో ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే అంగీకరిస్తున్నప్పుడు.. టీ షర్టులను విక్రయించే చట్టబద్ధత ఎక్కడి నుంచి వచ్చిందని సీరియస్ అయ్యింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది.

# భగీరథ్ వివాదంపై మంత్రి పొన్నం అభిప్రాయం వ్యక్తిగతం

## బాధితులకు న్యాయమే ఎఐసిసి, ప్రభుత్వ ధ్యేయం: పిసిసి చీఫ్ మహేష్

**హైదరాబాద్, మే12, ప్రభాతవార్త:** బండి సంజయ్ కుమారుడు, బాధితులు ఇద్దరూ ఒకే కమ్యూనిటీకి చెందినవారని, సంఘ పెద్దలు తమ బాధ్యతను స్వీకరించి, సమస్యను పరిష్కరించడానికి ఇద్దరి మధ్య వివాహం చేసుకునే అవకాశంతో సహా పరిష్కారాలను రూపొందించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన సూచనలు ఆయన వ్యక్తిగతమైనవి ఎఐసిసి, తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధంలేదని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మైనర్‌లకు రక్షణ కల్పించేందుకు 2012లో లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టాన్ని కాంగ్రెస్ రూపొందించిందని ఆయన గుర్తుచేశారు. మహిళలు, మైనర్లపై జరిగే నేరాలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదుపై ఆశ్రితపక్షపాతం, బెదిరింపులు, రాజకీయ జోక్యం, కులపరమైన ఆలోచనలు లేదా బాహ్య ఒత్తిళ్లకు తావులేకుండా కఠినంగా చట్టం ప్రకారం పరిష్కరించాలనేది మాత్రమే అఖిలభారత కాంగ్రెస్ విధానమని, దానికి అనుగణంగా కాంగ్రెస్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, అతని కుటుంబాన్ని లక్ష ్యంగా చేసుకోవడానికి రాజకీయాలు చేయాల్సిన అవసరం, లబ్ది చేయాల్సిన అవసరం రెండూ కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి లేదన్నారు. ఇటీవల నారీ శక్తి, మహిళల భద్రత వంటి నినాదాలతో ప్రచారం చేసిన బిజెపి ఇప్పుడు తెలంగాణలో బాలికపై వచ్చిన ఆరోపణల తీవ్రతను పలచన చేసేందుకు ప్రయత్నించడం తీవ్ర విడ్డూరంగా ఉందన్నారు.

### బాధితురాలుకు న్యాయం చేయాలనే నా వ్యాఖ్యలు వక్రీకరించారు: పొన్నం ప్రభాకర్

కేంద్రమంతి బండి సంజయ్ కుమారుడి కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని సోమవారం నా మాటలు వక్రీకరించారనీ కేంద్రమంత్రి బండి సంజయ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించు కోవాలని చెప్పామని మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. ఇందులో మున్నూరు కాపు సంఘాలు కాంగ్రెస్ పార్టీ కక్ష పూరితంగా చేస్తున్నారన్నారు.

## జూన్‌లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తాం

### వెయ్యి పడకల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు : మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** సనత్‌నగర్ టిమ్స్‌ను జూన్‌లో ప్రారంభిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోందని, కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయని తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను మంత్రి మంగళవారం పరిశీలించారు. హాస్పిటల్‌లోని ఏ, బీ, సీ బ్లాకులను మంత్రి పరిశీలించారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెడికల్ స్టోర్, కిచెన్‌తోపాటు అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి సూచించారు. పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్ అని, అందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉండబోతున్నారు. ఇక్కడ అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు.



మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ విద్యార్థి జెఏసి నేత వేముల రామకృష్ణను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## సంతలో సరుకులా ప్రశ్నపత్రాల విక్రయం

### నీట్ రద్దుపై భగ్గుమన్న విద్యార్థి లోకం

### రోడ్డుపై బైఠాయించిన మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థి జెఏసి నేతలు

**హైదరాబాద్, మే 12,ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షా పత్రాలు సంతలో సరుకులా అమ్ముడుపోవడం సిగ్గుచేటని, ఈ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ నేత వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షను రద్దు చేయడంతో.. దిక్కుతోచని స్థితిలో ఉన్న 22 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు.ఎన్.టి.ఏ వైఖరికి నిరసనగా విద్యార్థి నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులకు, నిరసనకారులకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని చెల్లాచెదురు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన ఎన్.టి.ఏను వెంటనే రద్దు చేయాలి. 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోంది. రాజస్థాన్‌లో ఖిగెస్ పేపర్‌ఖి పేరుతో మొదలైన ఈ కుంభకోణం దేశవ్యాప్తంగా విస్తరించింది. దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి. ప్రధాని మోదీ ఈ విషయంలో మౌనం వీడాలి. వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి" అని డిమాండ్ చేశారు.

## విద్యా శాఖలో టి-శాట్ విలీనం

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** టి-సాట్‌ను విద్యాశాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు సమాచార, సాంకేతిక శాఖ పరిధిలో కొనసాగిన టి-సాట్‌ను విద్యాశాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు జీవో ఎంఎస్ నంబర్ 79ని మంగళవారం జారీ చేశారు. ఇప్పటి వరకు సమాచార సాంకేతిక, ప్రసార శాఖ నియంత్రణలో ఉన్న టి-సాట్‌ను తక్షణమే విద్యా శాఖకు బదిలీ చేయడమవుతుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

### ఇద్దరు న్యాల్‌కల్ వాసుల మృతి

**న్యాల్‌కల్, మే 12, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం బీదర్ పట్టణ శివారులో జహీరాబాద్- బీదర్ రోడ్డుపై ద్విచక్ర వాహనాన్ని కర్ణాటక ఆర్టీసి బస్సు ఢీకొన్న సంఘటనలో మండలానికి చెందిన ఇరువురు వ్యక్తులు అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షల కథనం ప్రకారం... కర్ణాటకలోని బీదర్ పట్టణం నుంచి ఎస్ఆర్టీసి బస్సు (కెఎ 38 ఎఫ్ 1203) హైద్రాబాద్‌కు ప్రయాణీకులతో వెళుతున్న క్రమంలో అటుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొని బోల్తా కొటింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న న్యాల్‌కల్ మండల పరిధిలోని మిర్జాపూర్(బి0 గ్రామానికి చెందిన నర్సింలు (48), అరుణ్ (20)లు అక్కడికి అక్కడే మృతి చెందారు. బోల్తా పడ్డ కర్ణాటక బస్సులో ప్రయాణిస్తున్న 10 మంది గాయాలకు గురికాగా కర్నాటకలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## ప్రభుత్వం జిఒ ఇచ్చినా..

## ఇకపై సినిమాల టికెట్ల రేట్లు పెంచం

### తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ సంచలన నిర్ణయం

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** సినిమా టికెట్ల రేట్లు పెంచుకోమని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా తాము పెంచేది లేదని తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ సంచనల నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో మంగళవారం తెలంగాణ, ఖంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎగ్జిబిటర్ల అసోసియేషన్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో ఐదు కీలక అంశాలపై చర్చించిన తర్వాత పర్సంటేజీల విధానంపై విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. జూన్ లో పెద్ది, మా ఇంటి బంగారం వంటి సినిమాలు రిలీజ్ కు రెడీ అవుతున్న సమయంలో ఎగ్జిబిటర్లు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సింగిల్ స్క్రీన్లలో వేసే సినిమాల టికెట్ల ధరలను పెంచకూడదని నిర్ణయిస్తున్నట్లు నిర్మాత శిరీష్ సంచలన ప్రకటన చేశారు. సినిమా టికెట్ల రేట్లు పెంచుకునేందుకు ప్రభుత్వం జీఓ ఇచ్చినా ధరలను పెంచబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రేక్షకులకు హామీ ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్లకు ఇది వర్తిస్తుందన్నారు. సింగిల్ స్క్రీన్లను కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ నిర్ణయానికి నిర్మాతలంతా సహకరించాలని కోరారు. పాన్ ఇండియా సినిమాల విడుదల సమయంలో ఇతర రాష్ట్రాల్లో పర్సంటేజీలు ఇస్తున్నారని, తెలంగాణ, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలోన్లి థియేటర్లలో మాత్రం ఎందుకు పర్సంటేజీలు ఇవ్వరని ప్రశ్నించారు. దీన్ని వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# జూన్ 2న ఆదిలాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత

### పేదలకు ప్రస్తుత నివాసాలకు దగ్గరలోనే ఇళ్ల నిర్మాణం

### అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించం : మంత్రి పొంగులేటి




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 12:** రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారిగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్‌ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హైదరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృతం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బీహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్ 2 బిహెచ్‌కె ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్ధిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్ధిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు.

## నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### 3,98,358 మంది హాజరు..

### 889 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

### 21 వరకు కొనసాగనున్న ఎగ్జామ్స్

### ఉదయం ఫస్టియర్..

### మధ్యాహ్నం సెకండియర్ పరీక్షలు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** నేటి(బుధవారం) నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21 వరకు పరీక్షలు కొనసాగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3,98,358 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వారి కోసం 889 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 2,67,285 మంది హాజరు కానున్నారని, సెకండియర్ విద్యార్థులు 1,31,073 మంది హాజరవుతారని ఇంటర్ బోర్డు సెక్రటరీ మంగళవారం ఒక ప్రకటనలో తెలలిపారు.

ఫస్టియర్ విద్యార్థుల్లో 1,43,322 మంది బాలురు ఉండగా, 1,23,949 మంది బాలికలు ఉన్నారు. సెకండియర్ విద్యార్థుల్లో 83,692 మంది బాలురు కాగా, 47,371 మంది బాలికలున్నారు. మొదటి సంవత్సరం పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 889 పరీక్షా కేంద్రాల్లో 327 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో, 102 ప్రభుత్వరంగ జూనియర్ కాలేజీల్లో ఉండగా, 460 ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 10,685 మంది ఇన్విజిలేటర్లను నియమించగా 75 టీమ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్‌ను మరో 75 టీమ్స్ ఫ్లయింగ్ స్క్వాడ్స్ ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

**పరీక్షల షెడ్యూల్..**

మే 13న ఉదయం ఫస్టియర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1ను, మధ్యాహ్నా సెకండియర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 నిర్వహిస్తారు. మే 14న ఉదయం ఇంగ్లీష్ పేపర్-1, మధ్యాహ్నం ఇంగ్లీష్ పేపర్-2ను నిర్వహిస్తారు. మే 15న ఉదయం గణితం పేపర్-1ఏ, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1 పరీక్షలను మధ్యాహ్నా గణితం పేపర్-2ఏ, బోటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్-2 పరీక్షలను నిర్వహిస్తారు. మే 16న ఉదయం గణితం పేపర్-1బి, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1 పరీక్షలను మధ్యాహ్నా గణితం పేపర్-2బి, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2 పరీక్షలను నిర్వహిస్తారు. మే 18న ఉదయం ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1, మధ్యాహ్నం ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2 పరీక్షలను నిర్వహిస్తారు. మే 19న ఉదయం కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1ను మధ్యాహ్నం కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్-2ను నిర్వహిస్తారు. మే 20న ఉదయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, బ్రిడ్జికోర్సు మ్యాథ్స్ పేపర్-1(బైపీసీ విద్యా ర్థులకు), మధ్యాహ్నా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, బ్రిడ్జికోర్సు మ్యాథ్స్ పేపర్-2(బైపీసీ విద్యార్థులకు), మే 21న ఉదయం మోడర్న్ లాంగ్వేజ్ పేపర్-1, జియోగ్రఫీ పేపర్-1, మధ్యాహ్నం మోడర్న్ లాంగ్వేజ్ పేపర్-2, జియోగ్రఫీ పేపర్-2 పరీక్షలను నిర్వహించనున్నారు.

## 25 నుంచి 31 వరకు మహిళా వారోత్సవాలు

### మహిళా సాధికారతను ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలు

### గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి 31 వరకు మహిళా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జీవనోపాధి కార్యక్రమాలు, ఆర్థిక స్వావలంబన చర్యలు ప్రజలకు స్పష్టంగా తెలియజేసేలా కార్యక్రమాలు ఉండాలని సూచించారు. ప్రతీ రోజు భిన్న రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలను చాటి చెప్పే విధంగా షెడ్యూల్ రూపొందించాలన్నారు. కనీసం 4 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణానికి శంకు స్థాపన జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

ఈ అంశంపై సచివాలయంలో మంగళవారం ఆమె ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సంఘ సభ్యుల విజయగాథలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి అవకాశాలు, మహిళల నాయకత్వ వికాసం, సామాజిక మార్పు వంటి అంశాలను ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం చేతుల మీదుగా మహిళా సాధికారత, మహిళా విజయాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా.. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, వ్యవసాయ, అనుబంధ, వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాల కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. మహిళలను ఉద్యోగార్థులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

## ఏజెన్సీలో 1970 ముందు భూలావాదేవీలకు 1/70 యాక్ట్ వర్తించదు

### స్పష్టం చేసిన హైకోర్టు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు భూములు కొనుగోలు చేయకుండా నిషేధించే షెడ్యూల్డ్ ఏరియా ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ అమెండ్‌మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ 1970 (1/70 చట్టం) 1970కి ముందు జరిగిన భూ లావాదేవీలకు వర్తించదని హైకోర్టు ప్రకటించింది.

ఈ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి జరిగిన భూ లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేసింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలోని 148 సర్వే నెంబరులో ఉన్న 14.09 ఎకరాల భూమిని నాగుబండి మల్లయ్య నుంచి కర్రి కోటేశ్వరరావు 1959లో కొనుగోలు చేశారు. సదరు భూమి తమదని, దానిని తన తండ్రి 1973లో నాగుబండి మల్లయ్య భార్య నాగుబండి వెంకట రత్నమ్మ నుంచి కొనుగోలు చేశారని చుంచుపల్లి గ్రామ పరిధిలోని రాందాస్ తండాకు చెందిన మాలోత్ శ్రీను క్లెయిమ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు భూములు కొనడం చెల్లదు కాబట్టి ఆ భూములు తనవేనని వాదించటంతో రెవెన్యూ అధికారులు ఆయనకు అనుకూలంగా ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ కర్రి కోటేశ్వరరావు, ఆయన వారసులు 2013లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం తాజాగా సమగ్ర విచారణ నిర్వహించి తీర్పు చెప్పింది. పిటిషనర్ ఆ భూమిని 1/70 చట్టం రాకముందు 1959లోనే కొనుగోలు చేసినందున అది చట్టబద్ధమేనని స్పష్టంచేసింది.

## ఇప్పుడు తుమ్మిడిహెట్టి అవసరం కాదు.. కాళేశ్వరం మరమ్మతులు చేపట్టాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 12:** ప్రస్తుత పరిస్థితుల్లో భారీ సాగునీటి ప్రాజెక్టులకు కనీసం రెండు సంవత్సరాలపాటు విరామం ప్రకటించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. ప్రపంచవ్యాప్తంగా భారీ సాగునీటి ప్రాజెక్టుల అనుభవాలు ఆశాజనకంగా లేవని ఆయన పేర్కొన్నారు. భారీ పెట్టుబడులు, దీర్ఘకాల నిర్మాణ వ్యవధి, పర్యావరణ నష్టం, భూసేకరణ వల్ల సాధారణ ప్రజలకు కలిగే నష్టం, చివరకు అవినీతి వంటి అంశాలు ప్రతి భారీ సాగునీటి ప్రాజెక్టుతో ముడిపడి ఉంటున్నాయని తెలిపారు. పంట సాగులో ఉన్న ప్రతి ఎకరాకు నీరు అందించడం సమంజసం కాదు. మన వద్ద వివిధ రకాల పంటలు ఉన్నాయి. వరి, చెరకు వంటి పంటలకు నిరంతర నీటి అవసరం ఉండగా, పప్పుధాన్యాలు, నూనె గింజలు, పత్తి వంటి పంటలు ఆరుతడి పంటలుగా సాగు చేయబడుతున్నాయి. మరికొన్ని పంటలు పూర్తిగా వర్షాధారంగా ఉంటాయి. కాలువల ద్వారా లేదా ఉచిత విద్యుత్ ఆధారిత భూగర్భ జలాల ద్వారా నీటి లభ్యత పెరగడంతో పంటల సాగు విధానంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంద న్నారు. ఇతర పంటల స్థానంలో వరి సాగు విస్తరిస్తోంది. వరి అధికోత్పత్తి కారణంగా కొనుగోలు సమస్యలు ఏర్పడుతున్నాయి. అందువల్ల ప్రభుత్వం వ్యవసాయ శాఖ జోక్యం చేసుకొని రైతులు వరి సాగును తగ్గించి, నూనె గింజలు, పప్పుధాన్యాలు, ఉద్యానవన పంటల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, అందుకు మద్దతు ధరల రూపంలో ప్రోత్సాహకాలు కల్పించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, ఎస్.ఎల్.బి.సి వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులపై లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేయబడింది. అయితే 12 సంవత్సరాలు గడిచినా ఈ ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలు ఇవ్వలేక పోతున్నాయని పేర్కొన్నారు. 90 శాతం పూర్తయిన ప్రాజెక్టులను మాత్రమే కొనసాగించి, మిగతా వాటిని తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును ప్రారంభించాలని యోచిస్తున్నట్లు తెలిసిందని.. 2006లో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారం భించగా, 2014 నాటికి దాదాపు 8 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మధ్యలోనే నిలిపివేశారని పేర్కొన్నారు. 2014లో కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించారు. 2023 నాటికి దాదాపు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, నిర్మాణ లోపాలు కారణంగా అది ప్రస్తుతం పనిచేయడం లేదన్నారు. ఇప్పుడు కొత్తగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును చేపట్టడం అవసరం కానేకాదని, దాని బదులుగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులను చేపట్టి తిరిగి పనిచేసేలా చేయాలని కోరారు.

## నీట్ పరీక్ష రద్దు కేంద్రం వైఫల్యం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 12:** వైద్య విద్య జాతీయ అర్హత పరీక్ష (నీట్‌యూజీ) 2026 పరీక్ష రద్దుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా పరీక్ష రద్దు పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఇది కేంద్రానికి సిగ్గుచేటు అన్నారు.ఎన్డీయే వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందని అన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ అయ్యాయని ఆరోపించారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందని గుర్తు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం వైఫల్యం వల్లే మరోసారి అలాంటి పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్ష రద్దుపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీతో ప్రతి దశలో మోసాలు కనబడుతున్నాయని విమర్శించారు. నీట్ పరీక్ష వ్యవస్థే పెద్ద కుంభకోణమని, ప్రతి సంవత్సరం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ప్లస్ టూ పరీక్షల్లో స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానం తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## టివికెకు మద్దతిచ్చాడని పార్టీ ఎమ్మెల్యేపై వేటు

### ఎఎంఎంకె పార్టీ అధినేత దినకరన్ గుస్సా


**చెన్నై, మే 12:** అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం పార్టీ అధ్యక్షుడు టీటీవీ దినకరన్ తన పార్టీ నుంచి గెలిచిన ఒక్క ఎమ్మెల్యేపై బహిష్కరణ వేటు వేశారు. సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి మద్దతు పలికినందుకు దినకరన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏఎంఎంకే పార్టీ తరఫున కామరాజ్ ఒక్కడే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మన్నార్ గుడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన గెలిచారు. అయితే కామరాజ్ అధికార పార్టీకి ఏకపక్షంగా మద్దతు తెలిపి పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రవర్తించారన్న కారణంతో దినకరన్ ఆయనపై బహిష్కరణ వేటు వేశారు. పార్టీలోని అన్ని పదవుల నుంచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి కామరాజ్‌ను తొలగిస్తున్నట్లు వెల్లడించారు. మన్నార్‌గుడిలో కామరాజ్ గెలుపు కోసం పనిచేసిన పార్టీ కార్యకర్తలకు, నమ్మకంతో ఓటేసిన ప్రజలకు ఎమ్మెల్యే కామరాజ్ ద్రోహం చేశాడని విమర్శించారు. తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి కామరాజ్ మద్దతు ప్రకటించిన కొన్ని గంటలకే టీటీవీ దినకరన్ ఈ బహిష్కరణ ప్రకటన చేశారు. అంతకుముందు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్ ఎన్నికను కామరాజ్ స్వాగతించారు. అంతేగాక టీవీకే ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు.

### 35వేల కిలోమీటర్ల లక్ష్యం ఛేదించే

## శక్తివంతమైన 'సర్మాట్' అణుక్షిపణి పరీక్షలు విజయవంతం

### ప్రపంచ దేశాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ షాక్

**మాస్కో, మే 12:** ప్రపంచదేశాలకు రష్యా అనూహ్యంగా షాక్ ఇచ్చింది. తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అంతర్జాతీయ క్షిపణి శక్తి



సమతుల్యత ఉలిక్కిపడే సమాచారం ప్రకటించారు. మాస్కో ఇటీవల అణు సామర్థ్యం గల కొత్త సర్మాట్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించిందని చెప్పారు. ఈ యేడాది చివరి నాటికి దీనిని యుద్ధ విధుల్లో మోహరించాలని రష్యా యోచిస్తోందని వెల్లడించారు. ఈ క్షిపణి పరిధి 35 వేల కిలోమీటర్లకు పైగా ఉండవచ్చని పుతిన్ ప్రకటించారు. అదే జరిగితే, ఈ క్షిపణి ప్రపంచంలోనే అత్యధిక పరిధి గల క్షిపణిగా నిలుస్తుంది. దీని ప్రస్తుత పరిధి 18 వేల కిలోమీటర్లుగా ఉందని, ఇప్పటి వరకు ఇదే అత్యధిక పరిధి అని పలు నివేదికలు చెబుతున్నాయి. సర్మాట్ క్షిపణి వ్యవస్థ పరీక్ష విజయవంతం అయిన తర్వాత, పొసైడాన్ - బురెస్టినిక్ వ్యవస్థలపై పనులు తుది దశలో ఉన్నాయని వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు. ఒరెశ్నిక్‌కు అణ్వాయుధాలను అమర్చే అవకాశం ఉందని అధ్యక్షుడు చెప్పారు. ఏబీఎం ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడంతో, రష్యా తన వ్యూహాత్మక భద్రతను నిర్ధారించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. సర్మాట్ విజయవంతంగా ప్రయోగించిన తర్వాత, ఈ సంవత్సరం చివరి నాటికి దాని మొదటి రెజిమెంట్‌ను మోహరిస్తారని వ్యూహాత్మక క్షిపణి దళాల కమాండర్ కారకాయెవ్ పేర్కొన్నారు. సార్మాట్ వ్యవస్థ దాని గతంలోని వోయెవోడా క్షిపణి వ్యవస్థ కంటే విధ్వంసక శక్తి, ప్రయోగించే బరువు, క్షిపణి రక్షణ వ్యవస్థలను ఛేదించే సామర్థ్యం వంటి అనేక కీలక అంశాలలో శ్రేష్ఠమైనదని రక్షణ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ సర్మాట్ క్షిపణిపై రష్యా అధ్యక్షుడు పుతిన్ అతిశయోక్తి వాదనలు చేశారని పాశ్చాత్య దేశాల భద్రతా విశ్లేషకులు అంటున్నారు. గతంలో సర్మాట్ వైఫల్యాలను చవిచూసిందని గుర్తుచేసారు.

# నర్సులందించే సేవలతోనే రోగులకు సాంత్వన

### వృత్తి పట్ల నిబద్ధతపై ఆత్మ పరిశీలన చేసుకోవాలి

### వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**గుంటూరు మే 12 ప్రభాత వార్త ప్రతినిధి:** సిస్టర్ అనే పదంలో ఆప్యాయత, ప్రేమ, కరుణ, దయ వంటి లక్షణాలు దాగి ఉన్నాయని మంత్రి సత్యకుమార్ అన్నారు. గుంటూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జరిగిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకల్లో ఐదుగురికి మంత్రి సత్యకుమార్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులకు రోగులు వచ్చినప్పటి నుండి ఆరోగ్యం కుదుటపడి ఇక్కడి నుండి వెళ్ళేంత వరకూ అడుగడుగునా నర్సులు సేవలు అందిస్తుంటారని అన్నారు. అమెరికాలో జరిగిన ఓ అధ్యయనం ప్రకారం నర్సింగ్ అత్యంత పవిత్రమైన వృత్తిగా తేలిందని అన్నారు. నర్సులు తమ విధుల నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు బేరీజువేసుకుంటూ నైపుణ్యాలు పెంచుకుంటూ ఉండాలి. ఇంటికి వెళ్ళినప్పుడు సోదర ఏ విధంగా తమ ఆప్యాయతను చిరునవ్వుతో కనబరచే ప్రేమనే రోగులకు కనబరచాలని అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి ఇప్పటికీ జరుపుకుంటున్నామంటే గాయపడిన సైనికులకు ఆమె అందించిన సేవలు ఎవరూ ఎప్పటికీ మరచిపోలేనివి కావడమే అని అన్నారు.

# రైల్వే పోలీసు కాల్పుల కలకలం

### - రైల్వే సిగ్నల్ వ్యవస్థను ట్యాంపర్ చేసి దోపిడీకి దుండగుల యత్నం

### - అడ్డుకునేందుకు వెళ్లిన జీఆర్పీ పోలీసులపై రాళ్ల దాడి



**గుంటూరు మే 12 ప్రభాత వార్త ప్రతినిధి :** గుంటూరు జిల్లా నిడుబ్రోలు రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున కాల్పులు కలకలం సృష్టించాయి. రైల్వే సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసి రైల్లో దోపిడీ చేసేందుకు యత్నించిన దుండగులను అడ్డుకునేందుకు వెళ్లిన రైల్వే పోలీసులపై రాళ్ల దాడి జరిగింది. ఈ క్రమంలో పోలీసులు 10 రౌండ్ల గాల్లో కాల్పులు జరిపిన ఘటన సంచలనంగా మారింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం గుంటూరు జిల్లా నిడుబ్రోలు సమీపంలోని ఆటూరు రైల్వే సిగ్నల్ వద్ద రైలును ఆపి దోపిడీకి పాల్పడాలని దుండగులు చేసిన ప్రయత్నం విఫలమైంది. అప్రమత్తమైన రైల్వే పోలీసులు సంఘటనను ముందుగానే గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకునే సరికి దుండగులు వారిపై రాళ్లు రువ్వారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు గాల్లో సుమారు 10 రౌండ్లు కాల్పులు జరిపారు. కాల్పుల అనంతరం దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే గుంటూరు రైల్వే డీఎస్పీ అశోక్వర్ధన్రావు, సీఐలు మరియు ఇతర పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. రైల్వే సిగ్నల్ వ్యవస్థను ధ్వంసం చేసి రైలును నిలిపివేయాలన్న ఉద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు తేల్చారు. ఉత్తర భారతదేశానికి చెందిన అత్యంత ప్రమాదకరమైన భవారియా గ్యాంగ్ సభ్యులే ఇటువంటి దోపిడీలకు పాల్పడతారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ముఠా రైల్వే సిగ్నల్ వ్యవస్థను ధ్వంసం చేసి రైలును నిలిపివేసి దోపిడీ చేస్తుంది. సిగ్నల్ వ్యవస్థలోని గ్రీన్ లైట్ వైర్లు కత్తిరించి రెడ్ లైట్ వేసి రైలు నిలిపుతారు. రైలు ఆగిన వెంటనే అప్పటికే రైల్వే వద్దే ఉండే ముఠా సభ్యులు రైల్లో దోపిడీ చేస్తారు. తిరిగి రైలు బయలు దేరాక అదే రైల్లో దుండగులు పారిపోతారు. ఈ ముఠా ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ ప్రాంతాల నుండి వచ్చి దక్షిణాది రాష్ట్రాల్లో ఈ విధమైన దోపిడీలకు పాల్పడుతారని పోలీసులు చెబుతున్నారు.

# రాష్ట్రంలో విద్యుత్ వాహనాల్లో వృద్ధి వేగవంతం

### 2025-26లో 2.8 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు

### విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్మిట్టల్

**హైదరాబాద్, మే 12,ప్రభాతవార్త** తెలంగాణలో విద్యుత్ వాహనాల వినియోగంలో వేగవంతమైన వృద్ధి నమోదవుతోందని విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్మిట్టల్ అన్నారు. ఈ నేపథ్యంలోనే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 91,572 కొత్త రిజిస్ట్రేషన్లతో రాష్ట్ర వ్యాప్తంగా 2.8 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు నమోదు చేయబడ్డాయని చెప్పారు. పీఎం ఈడ్రైవ్ పథకం కింద దేశవ్యాప్త ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పన అనే అంశంపై బెంగుళూరులో జాతీయ సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన తెలంగాణ ప్రభుత్వం ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అనుసరిస్తున్న వ్యూహాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో కొత్త వాహన రిజిస్ట్రేషన్లలో సుమారు 5 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉంటున్నాయని, ఇది పెరుగుతున్న వినియోగాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ విలువ రూ.6,297 కోట్లకు చేరుకుందని వివరించారు. తెలంగాణలో ప్రజా రవాణా సైతం 6 నగర డిపోల నుండి 325 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు. 2027 నాటికి హైదరాబాద్లో 2,800 ఎలక్ట్రిక్ బస్సులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మరోవైపు ఇంటిగ్రేటెడ్ ఛార్జర్లతో కూడిన 10 కొత్త డిపోలు నిర్మాణంలో ఉన్నాయని, 10 ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ స్టేషన్లు ప్రారంభించబడుతున్నాయని చెప్పారు. ఇక ఛార్జింగ్ మౌలిక సదుపాయాల విస్తరణ కింద రాష్ట్రంలో 1,063 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు పనిచేస్తుండగా, వీటిలో సుమారు 600 ఒక్క హైదరాబాద్లోనే ఉన్నాయన్నారు. ఈవీ వినియోగదారులకు అనుకూల చర్యగా యూనిట్ సర్వీస్ ఛార్జీలను అందిస్తుండడంతో పాటు, ఛార్జింగ్ వినియోగం ఏటా దాదాపు 4 రెట్లు పెరిగిందని వివరించారు. ఇది వినియోగంలో గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది. రెడ్కో, పీఎంఈ డ్రైవ్‌పథకం కింద 116 ప్రదేశాలలో కొత్త ఈవీపీసీఎస్లను ఏర్పాటుచేయడానికి యోచిస్తున్నట్లు తెలియజేశారు. ఇందు కోసం మొదటి దశ కింద రూ.10.24 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

# నా తర్వాతే కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలోకి

### - బిఆర్ఎస్ హయాంలో ఉద్యమకారులకు గుర్తింపు లేదు

### - తెలంగాణ జనసమితి 4వ ప్లీనరీలో పార్టీ అధ్యక్షుడు కోదండరాం



**బేగంపేట మే 12,ప్రభాతవార్త** అప్పుడు ఉన్న ప్రభుత్వాలకు నేను అమ్ముడు పోతా అనే అనుమానం ఉండె.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదు.తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు.మంగళవారం నెక్లెస్ రోడ్డు జలవిహార్ లో తెలంగాణ జనసమితి 4వ ప్లీనరీ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ప్లీనరీలో 23తీర్మానాలను ఆమోదించారు.ముందుగా గన్ పార్క్ నుంచి కార్యకర్తలు జలవిహార్ వరకు ర్యాలీగా తరలి వచ్చారు.ఈ సందర్భంగా తెలంగాణ జనసమితి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ కోదండరాం ప్లీనరీలో మాట్లాడుతూ ఉద్యమంలో అప్పుడు ఉన్న ప్రభుత్వాలకు నేను అమ్ముడు పోతా అనే అనుమానం ఉండె.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదు.నా తర్వాతనే కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చారు.నక్సలైట్లు కూడా తెలంగాణను కోరుకున్నారు.టిఆర్ఎస్ వచ్చిన తర్వాత నక్సలైట్లతో నడవాల్సిన అవసరం ఉండె.తెలంగాణా వచ్చిన తర్వాత కేవలం కమీషన్ కోసమే కేసీఆర్ ప్రభుత్వం నడిచింది.తెలంగాణాను నేనే తెచ్చినా అన్న భావనలో కేసీఆర్ ఉన్నడు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమ కారులకు గుర్తింపులేదు.కేసీఆర్ ను గద్దె దించడానికి టీజేఎస్ శక్తి చాలు.అందుకే కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చాం.ఇప్పుడు స్వేచ్ఛ ఉంది.ఏదైనా ప్రభుత్వానికి నేరుగా చెప్పే వెసులు బాటు ఉంది.తెలంగాణా ఉద్యమ కారులకు గుర్తింపు కావాలి.వాళ్లకు బతుకు తెరువు చూపాలి.మాకు [illegible]

# బెట్టింగ్ల మోజులో బ్యాంకుకు కన్నం వేసిన ఘనుడు

### రూ.1.80 కోట్లు లూటీ - పోలీసులకు చిక్కిన భార్య, పరారీలో భర్త

**మెదక్, మే 12, ప్రభాతవార్త :** బెట్టింగ్ మోజులో పడి మెదక్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ బ్యాంకులో భార్యభర్తలు మరో ఇద్దరితో కలిసి రూ.1.80కోట్లు లూటి చేసిన సంఘటన మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించింది. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాకు చెందిన యాదం అనిల్ మెదక్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో మేనేజర్గా పనిచేస్తున్నారు. అనిల్ బెట్టింగ్ మోజులో నిండి మునిగిపోయాడు. దీంతో బెట్టింగ్ల కోసం మేనేజర్ అతని భార్య స్రవంతితోపాటు అతని స్నేహితుడు సుబ్రహ్మణ్యంలకు సంబంధించిన ఆధార్, పాన్కార్డులపై బ్యాంక్లో నకిలీ బంగారం పెట్టి పెద్ద మొత్తంలో లోన్లు తీసుకున్నాడు. అలాగే రెండు ఏటీఎంల నుండి డిపాజిట్ చేసే సమయంలో కొంత కొంత డబ్బులు పక్కన బెడుతూ ఇలా రూ.31.35 లక్షల నగదును కూడా మోస పూరితంగా బ్యాంకును మోసం చేసి వాడుకున్నాడు. ఇతనికి బ్యాంకులో బంగారాన్ని పరిశీలించే వ్యక్తి శ్రీనివాసచారి సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో మేనేజర్ యాదం అనిల్తోపాటు అతని భార్య స్రవంతి, అతని స్నేహితుడు సుబ్రహ్మణ్యం, సహకరించిన శ్రీనివాసచారిలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అనిల్ గతంలో కూడా ఆంధ్ర ప్రదేశ్ వెలైపాడు పీఎస్ పరిధిలో ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ నందు పోలవరం నిర్వాసితులను, గిరిజనులసైతం మోసం చేసి రూ.11.82,487 డబ్బులు వాడుకొని జైలు పాలయ్యాడు. ప్రస్తుతం మేనేజర్ అనిల్ పరారీలో ఉండగా అతని భార్య స్రవంతి, శ్రీనివాసచారి, సుబ్రహ్మణ్యంలను అరెస్ట్ చేసి కోర్టునందు హాజరు పర్చినట్లు డీఎస్పీ తెలిపారు.

# కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి

### వేల సంఖ్యలో స్వామిని దర్శించుకుని మాల విరమణ చేసిన భక్తులు

### జయంతి ఉత్సవాలకు హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆలయానికి చేరుకుంటున్న మాలధారణ భక్తులు

**మల్యాల (జగిత్యాల జిల్లా) ప్రభాతవార్త** తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం పెద్ద జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి, జయంతి సందర్భంగా రాష్ట్ర నలుమూలలే కాకుండా చుట్టుపక్కల ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్గడ్ రాష్ట్రాల నుండి కూడా స్వామివారి దీక్షలు చేపట్టిన భక్తులు సోమవారం అర్ధరాత్రి నుండి తమ అధ్యక్షుల విరమణకు కొండగట్టుకు చేరుకున్నారు, దీంతో ఆలయంలో అర్ధరాత్రి నుండి తెల్లవారు 3 వరకు భక్తుల రద్దీ కొనసాగింది, జై శ్రీరామ్,,,, జై హనుమాన్,,,, రామలక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి,,,,, నినాదాలతో కొండగట్టు ఆలయ పరిసరాలు కాషాయ వర్ణమై మారుమోగాయి, హనుమాన్ దీక్షలకు కేంద్రంగా పేరుగాంచిన కొండగట్టు అంజన్న ఆలయం సంవత్సరంలో రెండుసార్లు చిన్న, పెద్ద జయంతి ఉత్సవాలు జరగడం విశేషం,కాగా, ఆదివారం ప్రారంభమైన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా జరిగాయి, స్వామివారి పుట్టినరోజు జరిగే పెద్ద హనుమాన్ జయంతికి 21 31 41 రోజుల దీక్షలు చేపట్టిన భక్తులు కొండగట్టు అంజన్న సన్నిధికి చేరుకొని మాల విరమణ మండపంలో తమ దీక్షలు నిర్వహించుకున్నారు, వందలాది కిలోమీటర్ల దూరం నుండి స్వామి వారి దీక్షలు స్వీకరించిన భక్తులు కాలినడకన పాదాలకు సాక్స్ ధరించి కొండపైకి నగర సంకీర్తనలతో తరలి రావడంతో కొండగట్టు అంజన్నాలయం ఆధ్యాత్మిక వాతావరణంతో పులకరించిపోయింది, జయంతి సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఎస్పీ అశోక్ కుమార్ లు సోమవారం అర్ధరాత్రి వరకు కొండగట్టులోనే మకాం వేసి ఏర్పాట్లను పరిశీలించారు. త స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారి జయంతికి హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు, అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ధర్మానికి ప్రతికగా అచంచలమైన సేవా భావానికి ఆదర్శంగా నిలిచిన ఆంజనేయ స్వామి వారి కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు, అంతేకాకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ముఖ్యంగా రైతాంగానికి సమృద్ధిగా వానలు కురిసి పంటలు అధికంగా పండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు, హనుమంతుని భక్తి బలం నిస్వార్థ సేవాస్ఫూర్తి ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు,



# సిఎం విజయ్ ఒఎస్డిగా జ్యోతిష్కుడు రాధన్ పండిత్

**చెన్నై, మే 12:** తమిళనాడు టీవీకే ప్రభుత్వం ఏర్పాటులో హైడ్రామా, ట్విస్టులు చోటుచేసుకున్నప్పటికీ చివరకు విజయ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. మే 10న మధ్యాహ్నం 3.45 గంటలకు ముందుగా విజయ్ ప్రమాణస్వీకారం ఉంటుందని నిర్ణయించారు. విజయ్ వ్యక్తిగత జ్యోతిష్యుడు రాధన్ పండిత్ వెట్రివేల్ ఇచ్చిన సలహా మేరకు ఈ సమయాన్ని ఉదయం 10 గంటలకు మార్చారు. విజయ్ రాజకీయ ప్రస్థానంలో రాధన్ పండిత్కు కీలక స్థానం ఉంది. ఇదిలా ఉంటే, ఇప్పుడు విజయ్ తన వ్యక్తిగత జ్యోతిష్యుడైన రాధన్ పండిత్కు ప్రభుత్వంలో కీలక పోస్టు కేటాయించారు. తమిళనాడు ప్రభుత్వం ఆయనను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించింది. రాధన్ పండిత్ ముఖ్యమంత్రికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(రాజకీయ వ్యవహారాలు)గా నియమితులయ్యారు. సీఎం విజయ్కు ఆయన అధికారికంగా సలహాదారుగా ఉండనున్నారు. తమిళనాడు ఎన్నికలకు ముందే విజయ్ సీఎం అవుతారని రాధన్ జ్యోస్యం చెప్పారు. గతంలో సీఎంగా పనిచేసిన జయలలితకు సలహాదారుగా ఉండేవారు. అనేక మంది రాజకీయ నాయకుడు ఆయన ఆఫీస్ ముందు బారులు తీరేవారని సమాచారం. ఎన్నికల ఫలితాల్లో టీవీకే సింగిల్ లార్జెస్ట్ పార్టీగా మారిన తర్వాత విజయ్ ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపిన వారిలో రాధన్ కూడా ఉన్నారు. నాలుగు దశాబ్దాలుగా రాధన్ పండిత్ జ్యోతిష్య రంగంలో ఉన్నారు. అనేక రాజకీయ దిగ్గజాలకు జ్యోతిష్యం చెప్పేవారు. నిజానికి జయలలిత రాధన్ పండిత్ను సంప్రదించిన తర్వాతే కీలక నిర్ణయాలు తీసుకునే వారని చెబుతారు.

# బోరబండలో ఏడుగురు హోంగార్డులు సస్పెన్షన్

**జూబ్లీహిల్స్, మే 12, ప్రభాతవార్త:** బెల్టుషాపుల వ్యవహారంలో బోరబండ ఠాణాలో పనిచేస్తున్న ఏడుగురు హోంగార్డులను సస్పెండ్ చేశారు. బోరబండలో చాలా కాలంగా బెల్టు దుకాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇక్కడ విధులు నిర్వర్తించే పలువురు పోలీసులు ఈ బెల్టు దుకాణాల వద్ద మాముళ్లు తీసుకుంటారనే ప్రచారం చాలా కాలంగా కొనసాగుతుంది. ఈ కారణంగానే బెల్టు దుకాణాలు యధేచ్ఛగా నడుస్తున్నాయని, కేసులు నమోదు చేసినా వెరవకుండా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే నిఘా వర్గాలు సైతం చాలా కాలంగా ఉన్నతాధికారులకు నివేదికలను సైతం అందించారు. ఇందులో భాగంగానే మంగళవారం ఏడుగురు హోంగార్డులను సస్పెండ్ చేస్తూ హోంగార్డు కమాండెంట్ నిర్ణయం తీసుకున్నారు. సస్పెండ్ అయిన వారిలో ఇన్స్పెక్టర్ డ్రైవర్ సైతం ఉన్నట్లు తెలుస్తుంది. మరో ఆరుగురు పోలీసులకు సైతం ఇప్పటికే తాఖీదులు సైతం అందించినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా బెల్టుదుకాణాలు కొనసాగుతున్న ప్రాంత పోలీసు అధికారులపైన సైతం ఉన్నతాధికారులు దృష్టి పెట్టనట్లు తెలుస్తుంది.

# నీట్ రద్దుకేంద్రప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

### - భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి,.

**హైదరాబాద్,మే12,ప్రభాతవార్త:** నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలనీభువనగిరి లోక్ సభ సభ్యులుచామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి వైఫల్యంకు విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్ ను కోల్పోయే అవకాశం ఉందనీ ఆవేదన చెందారు.

తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్ లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారనీ విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బిజెపికి వద్దా...? అని ఆయన ప్రశ్నించారు.

# ప్రధాని సూచనలు ఆంక్షలు కాదు

### న- దేశ ప్రయోజనం ముందు రాజకీయాలు ఉండకూడదు

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్రావు

**హైదరాబాద్, మే 12 ప్రభాతవార్త:**యూపిఏ కాలంలో అనేక అవినీతి కుంభకోణాలు జరిగాయని, ఎన్డిఏ పాలన పారదర్శకంగా కొనసాగుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్రావు అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రిటైల్ ఇన్ఫ్లేషన్ గణనీయంగా తగ్గిందన్నారు. స్టార్టప్ల సంఖ్య భారీగా పెరిగిందని, తయారీ రంగం బలోపేతమైందని, సెన్సెక్స్ భారీగా పెరిగిందని, ఎగుమతులు సైతం గణనీయంగా పెరిగాయన్నారు. ప్రధాని మోడీ చేసిన సూచనలు బలవంతపు ఆంక్షలు కావు, దేశ ప్రయోజనం కోసం ప్రజలు స్వచ్ఛందంగా పాటించాల్సిన సూచనలు మాత్రమే అన్నారు. అవసరం లేని బంగారం కొనుగోళ్లు తగ్గించాలి, విదేశీ పర్యటనల కంటే దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలి, స్వదేశీ వస్తువులను కొనాలి, ఇంధన పొదుపు పాటించాలి అనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ ఈ సూచనలు చేశారన్నారు. దేశం కోసం మంచి విషయాలు మాట్లాడినప్పుడు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు. భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ నేషన్ ఫస్ట్ సిద్ధాంతంతోనే పని చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం పవర్ ఫస్ట్ రాజకీయాలు చేస్తుందన్నారు. దేశ ప్రయోజనం ముందు రాజకీయాలు ఉండకూడదు. దేశ ఆర్థిక బలోపేతం కోసం, దేశ భవిష్యత్తు కోసం ప్రధాని మోడీ చేసిన సూచనలను ప్రజలందరూ పాటించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా దేశ ప్రజలకు చేసిన సూచనలను కాంగ్రెస్ పార్టీ కావాలనే వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశ ప్రయోజనం, ఆర్థిక క్రమశిక్షణ, స్వావలంబన, దేశ భవిష్యత్తు దృష్ట్యా ప్రధాని చేసిన సూచనలను రాజకీయ కోణంలో చూడడం సరైంది కాదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి నాయకులు ప్రధాని మోడీ చేసిన సూచనలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రధాని మోడీపై, మోడీ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 1947లో దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత ఎక్కువ కాలం కాంగ్రెస్ పార్టీనే దేశాన్ని పాలించింది. ఆ సమయంలో దేశం ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంది. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు దేశానికి సైనిక సామర్థ్యం పరిమితంగానే ఉండేది. ఆ సమయంలో అప్పటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సహకారాన్ని కోరారు. చైనా యుద్ధ సమయంలో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు భారత సైన్యానికి సహకారం అందించి దేశభక్తిని చాటారు. ఆ సేవలను గుర్తించి అనంతరం జరిగిన రిపబ్లిక్ డే పరేడ్లో పాల్గొనాలన్నారు.

# ముందు మీరు రూ.8వేల కోట్ల విమానం అమ్మేయండి!

### - ఇంధనభద్రతపై పిలుపునిచ్చిన మోడీకి అవిముక్తేశ్వరానంద స్వామీజీ కౌంటర్



**సోన్భద్ర,మే 12:** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు పొదుపు పాటించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుపై జ్యోతిష్ పీఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద తీవ్రంగా స్పందించారు. ప్రజలకు నీతులు చెప్పే ముందు పాలకులు వాటిని ఆచరించి చూపించాలని, పొదుపు చర్యలు అధికారంలో ఉన్న వారి నుంచే మొదలవ్వాలని ఆయన హితవు పలికారు. సోన్భద్రలో తన గోవిష్ఠ యాత్రలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా ప్రభుత్వం తమ వద్ద ఉన్న రూ.8 వేల కోట్ల విమానాన్ని అమ్మి, ఇంధన సామర్థ్యం ఉన్న విమానాన్ని ఉపయోగించాలి. ధర్మం మన ఇంటి నుంచే మొదలవ్వాలని ప్రధాని మోడీకి ఆయన చురకలంటించారు. పశ్చిమాసియా సంక్షోభం దృష్ట్యా బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలు, ఇంధన వినియోగం తగ్గించుకోవాలని మోడీ చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అనంతరం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్పై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. గోవధను అరికట్టడంలో రాజకీయ పార్టీలు, నాయకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరప్రదేశ్లోనే గోవుల జనాభా అత్యంత వేగంగా తగ్గిపోయిందని ఆయన పేర్కొన్నారు. కేరళలో 8 , పశ్చిమ బెంగాల్లో 15 , ఝార్ఖండ్లో 24 గోవుల జనాభా పెరిగితే, యూపీలో అత్యధిక క్షీణత నమోదైంది. గోవధకు పాల్పడే వారి నుంచి కొందరు నాయకులు డబ్బులు తీసుకుని తమ రాజకీయాలను చక్కదిద్దుకుంటున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. యూపీ ప్రభుత్వాన్ని పేపర్టైగర్గా అభివర్ణించిన శంకరాచార్య, ప్రభుత్వ ఆధ్వర్యంలోని గోశాలల్లో ఆవుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ను ఉద్దేశించి మాట్లాడుతూ పీఠాధిపతి స్థానం రాజు కన్నా ఉన్నతమైనది. యోగి ఆదిత్యనాథ్ పీఠాధిపతిగా ఉంటూ ముఖ్యమంత్రి పదవిని స్వీకరించి తన ఉన్నత స్థానం నుంచి దిగిపోయారు.

### నిబంధనలకు అనుగుణంగానే

# నియామకాలు

### స్త్రీ నిధి ఎండి విద్యాసాగర్రెడ్డి

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త** స్త్రీ నిధి బ్యాంక్లో నియామకాలు, పదోన్నతుల్లో ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా జరగడం లేదని ఆ సంస్థ ఎండీ విద్యాసాగర్రెడ్డి స్పష్టం చేశారు. నియామకాలు, పదోన్నతులు పూర్తిగా ప్రభుత్వ మార్గదర్శకాలు, సంస్థ పాలసీ ప్రకారమే జరుగుతాయని చెప్పారు. ఈ మేరకు ఒక ప్రకటనలో స్త్రీ నిధిలో ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాతే నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని పర్యవేక్షిం చేందుకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఒక హై లెవల్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కమిటీలో ఆర్థిక శాఖ కార్యదర్శి, ఐటీ కార్యదర్శి, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సభ్యులుగా ఉన్నారని, వారి ఆదేశాల మేరకే నియామకాలు జరిగాయని వివరించారు. ఈ నియామకాల్లో రోస్టర్ పాయింట్లు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి అక్రమాలు, పక్షపాత చర్యలు జరగలేదని స్పష్టం చేశారు. గతేడాది ఏప్రిల్ నెలలో కేవలం 13 మందిని మాత్రమే క్రమబద్ధీకరించామని, వీరంతా ఏడు నుంచి ఎనిమిదేండ్లుగా సంస్థలో పని చేస్తున్నారని చెప్పారు. స్త్రీ నిధి ఒక ఆర్థిక సంస్థ అయినందున ఐటీ, ఫండ్స్, బ్యాంకింగ్ రంగాల్లో నైపుణ్యం ఉన్న నిపుణుల అవసరం ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు.


# విద్యుత్ సమస్యలకు చెక్

### - పునరుత్పాదకత, స్వయం సమృద్ధే లక్ష్యం - పవర్ సామర్థ్యం పెంపునకు కృషి

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త** విద్యుత్ సమస్యలను ధీటుగా ఎదుర్కొనే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ సామర్థ్యం పెంపు, ఉత్పత్తి, సరఫరా తదితర నిర్వహణ ఖర్చుల తగ్గింపు, అవసరాలకు తగినట్లుగా చర్యలు తీసుకునేందుకు ప్రణాళికా బద్ధంగా అడుగులు వేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక ఉన్నత స్థాయి బృందం తాజాగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు పలు సిఫార్సులతో కూడిన నివేదికను సమర్పించింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం స్వీయ, షెడ్యూలింగ్పై తక్కువ ఆధారపడటం ద్వారా దుబారా, దుర్వినియోగాన్ని తగ్గించడం, మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో పునరుత్పాదకత వాటాను పెంచడం, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తుల కోసం మార్కెట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, అభివృద్ధి చెందిన అనుబంధ సేవల మార్కెట్ ద్వారా సేకరణలో ఎదురయ్యే సమస్యలను కూడా పరిష్కారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేసింది.

విద్యుత్ పరివర్తన, గ్రిడ్లో పునరుత్పాదక శక్తికి సంబంధించి ఏకీకరణను ప్రారంభించేందుకు సమర్థవంతమైన, అనుకూలమైన, నమ్మదగిన మార్కెట్ ఫ్రేమ్వర్క్ను రూపొందించడాన్ని లక్ష్యంగా కలిగి ఉండాలని తేల్చిచెప్పింది. దేశంలో విద్యుత్ మార్కెట్లు పునరుత్పాదక ఇంధనం వైపు మళ్లడంలో గణనీయమైన మార్పులకు లోనవుతాయని పేర్కొంది.

# 2008డిఎస్సీలో1175మంది ఉపాధ్యాయులుగా నియామకం



సిఎం రేవంత్రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన డిఎస్సీటీచర్లు

**బేగంపేట మే 12,ప్రభాతవార్త** అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2008డిఎస్సీ అభ్యర్థులు 1175మందికి ఉపాధ్యాయులుగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చిత్ర పటానికి ఆ ఉపాధ్యాయులు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలియజేసారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్లో 2008డిఎస్సీ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసారు.17సంవత్సరాలుగా టీచర్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న తమకు చివరికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి గా వచ్చి ఉద్యోగాలు ఇచ్చి ఆదుకున్నారని అన్నారు.ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పోస్టింగ్స్ ఇచ్చారని,కొత్త జిల్లాల ప్రాతిపదికల పోస్టింగ్స్ మార్చాలని వారు ప్రజావాణి ఇంచార్జ్ జి.చిన్నారెడ్డి కి వినతి పత్రాన్ని అందజేసారు.సర్వీస్ సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు.ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసికెలతానని చిన్నారెడ్డి వారికి హామీ ఇచ్చారు. సీఎం ప్రజావాణిలో 393దరఖాస్తులు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 221వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 393దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 190దరఖాస్తులు.



డిజిపిని పుష్పగుచ్చంతో అభినందిస్తున్న మంత్రి

# ఆర్అండ్బి మంత్రిని కలిసిన డిజిపి సివిఆనంద్

**హైదరాబాద్, మే12,ప్రభాతవార్త:**రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మంగళవారం నాడు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్ర నూతన డిజిపిగా ఇటీవల నియామకమైన సీవీ ఆనంద్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మంచి పోలీస్ అధికారిగా పేరుగాంచారని,డిజిపి గా ప్రస్తుతం చేపట్టిన నూతన బాధ్యతలను ఆదర్శవంతంగా నిర్వహించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

# నిద్రలో పట్టే చెమటకు..

వేడి వాతావరణం, గాలి ప్రసరణ సరిగ్గా లేకపోవడం, ఒంట్లో వేడి ఎక్కువగా ఉండడం.. ఇలాంటప్పుడు చెమటలు పట్టడం సర్వసాధారణం. అయితే కొంతమందికి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ రాత్రుళ్లు నిద్రలో విపరీతంగా చెమటలు పడుతుంటాయి. చిన్న సమస్యే కదా అని చాలామంది ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇది వివిధ రకాల అనారోగ్యా లకు సంకేతమని హెచ్చరిస్తున్నారు నిపుణులు. సమస్య తీవ్ర రూపం దాల్చకముందే మేల్కొని వైద్యుల్ని సంప్రదించడం ఉత్తమమని చెబుతున్నారు. మరి ఇంతకీ రాత్రుల్లు ఉన్నట్లుండి చెమటలు ఎందుకుపడతాయి?తెలుసుకుందాం..



**ఇవి కారణం కావచ్చు!...**
రాత్రుళ్లు నిద్రలో చెమటలు పడుతున్నాయంటే కొన్ని ఆరోగ్య సమస్యలు అందుకు కారణం కావచ్చంటున్నారు నిపుణులు.

**హైపర్ థైరాయిడిజం....** థైరాయిడ్ గ్రంథి జీవక్రియలతో పాటు ఇతర శారీరక విధులు నిర్వర్తించడంలో సమర్థంగా పనిచేస్తుంది. అయితే ఇది అత్యంత చురుగ్గా మారినప్పుడు హైపర్ థైరాయిడిజం బారిన పడతాం. ఫలితంగా శరీం వేడికి తట్టుకోలేక చెమటలు పడుతుంటాయి.

**ఒత్తిడి, ఆందోళన...** ఉన్నట్లుండి ఒక్కోసారి ఒత్తిడి, ఆందోళనలకు గురవుతాం. వాటి ప్రభావం మెదడు, శరీరంపై పడుతుంది. నిద్రలో చెమటలు పట్టడానికి ఇదీ ఓ కారణమే !

**మానసిక రుగ్మతలు :** కొన్ని రకాల మానసిక రుగ్మతలున్నప్పుడు మనసులో ఒక రకమైన యాంగ్జైటీ, ఆందోళన మొదలవుతుంది. ఇది నిద్రలో చెమటలు పట్టేలా చేస్తుంది.

**మెనోపాజ్...** 40 దాటిన మహిళల్లో రాత్రుళ్లు నిద్రలో చెమటలు పడుతున్నాయంటే. వారు మెనోపాజ్‌కు చేరువవుతున్నారనడానికి సూచనగా భావించ వచ్చంటున్నారు నిపుణులు. టివి/హెచ్ఐవి, లుకేమియా.. వంటి సమస్యలు న్నప్పుడు ఉన్నట్లుండి శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి పోతుంటుంది. ఇది రాత్రుళ్లు చెమటకు దారి తీస్తుంది. యాంటీ డిప్రెసెంట్స్, యాంటీ రెట్రోవైరల్స్ హైపర్‌టెన్షన్ మందులు వాడడం వల్ల చెమట గ్రంథుల్ని నియంత్రించే మెదడు భాగాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఫలితంగా నిద్రలో చెమటలు పడుతుంటాయి. కెఫీన్ ఎక్కువగా ఉండే పదార్థాలు మితిమీరి తీసుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు చెమటలు పట్టే అవకాశం ఎక్కువంటున్నారు నిపుణులు.

**ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే !..**
అయితే రాత్రి పూట నిద్రలో చెమటలు పట్టడమనేది తరచూ తలెత్తినా, దీంతో అసౌకర్యంగా అనిపించినా ఆలస్యం చేయకుండా నిపుణుల్ని సంప్రదించాలి. తద్వారా సమస్యేంటో తెలుసుకొని.. చికిత్స తీసుకోవాలి. దీంతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల కూడా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందచ్చు. మెనోపాజ్‌కు దగ్గరవుతున్న, మెనోపాజ్‌లో దశలో ఉన్న మహిళలు ఆహారంలో పలు మార్పులు చేర్పులు చేసుకోవాలి. ఈ క్రమంలో మసాలా, కారం.. వంటివి దూరం పెట్టాలి. బరువును అదుపులో ఉంచుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు చెమట సమస్యను తగ్గించుకోవచ్చు. ఇందుకోసం నిపుణుల సలహా మేరకు పోషకాహారం తీసు కుంటూనే.. వ్యాయామాలు చేయడం ముఖ్యం. కెఫీన్, మసాలాలు, కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, చాక్లెట్.. వంటి వాటిని ఎంత దూరం పెడితే అంత మంచిది. నిద్రించే ప్రదేశం చల్లగా ఉండేలా చూసుకోవాలి. అలాగే చల్లదనాన్ని పంచే పరుపులు, దిండ్లకు ప్రాధాన్యమివ్వడం ముఖ్యం. కొన్ని రకాల మందుల వల్ల ఈ సమస్య ఎదురవుతోందని గమనిస్తే వాటికి ప్రత్యామ్నాయంగా ఇతర మందులేవైనా వాడచ్చేమో నిపుణుల్ని అడిగి సలహా తీసుకోవడం మంచిది. మానసిక ఒత్తిళ్లు, ఆందోళనల్ని తగ్గించుకునేందుకు నచ్చిన పనులు చేయడం, ఆహారంలో అవసరమైన మారునపలు చేసుకోవడం మంచిది.

# తల్లికి బిడ్డలంతా సమానమే !



ఏ ఇంట్లో అయినా రెండు వరుస కాన్పుల్లో పుట్టిన ఎడ పిల్ల, కుడి పిల్ల ఉంటే వాళ్లిద్దరికీ అస్సలు పడిచావదు. మధ్యలో ఆ తల్లికి ఎన్నో సమస్యలు వస్తుం టాయి. ఇంట్లో ఒకరికి మించి పిల్లలు ఉంటే చాలు.. తరచూ తగాదాలే. 'అన్ననే నువ్వు బాగా చూస్తావ్'. చెల్లికే నువ్వు అన్నీ కొనిస్తావ్ అంటూ అలకబూను తుంటారు. ఇది కొంతవరకూ పరవాలేదు కానీ తోబుట్టువులపై ద్వేషం పెంచుకునే వరకూ వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రు లదే. ఇందుకోసం నిపుణులు ఏం సలహా ఇస్తున్నారంటే.. తల్లిదండ్రులుగా ఇద్దరు పిల్లల్ని వేర్వేరుగా చూడాలన్న పక్షపాతం మీకు లేకపోయి ఉండొచ్చు. కానీ తరచూ ఒకరితో ఒకరు గొడవ పడటం, చిన్నబుచ్చు కోవడం చేస్తుంటే.. వారికి కాస్త మీ ప్రేమ అవసరం అని తెలుసుకోండి. ఇద్దరూ సమానమే అని చెప్పే ప్రయత్నం చేయండి. తనతో మీరు చిన్నప్పుడు ఎంత చనువుగా ఉండేవారో చెబుతూ ఉండండి ఇది తనలోని అభద్రతా భావాన్ని దూరం చేస్తుంది. ఆ జ్ఞాపకాలన్నీ క్రమంగా తన అపోహల్ని దూరం చేయొచ్చు. అమ్మా నాన్నలు వయసులో చిన్నది కదా అని ఆఖరిదానికి అడిగినవన్నీ తెచ్చివ్వడంలో తప్పులేదు. కానీ, అదే సమయంలో పెద్దవాడి ఇష్టాలకూ ప్రాధాన్యం ఇవ్వండి. లేదంటే, మీకూ, తనకీ, మధ్య చెల్లి వచ్చిందనే అభద్రత బాధ తోబుట్టువుతో గొడవలకు దారితీ స్తాయి. పిల్లల్లో అల్లరి, గిల్లికజ్జాలు మామూలే తప్పొప్పులు ఇద్దరివైపూ ఉ ంటాయి. అలా కాకుండా పెద్దాడే చేసుంటాడు. లేదా చిన్నదే చేస్తుందిలా అనే నిర్ధరణకు వచ్చేయకండి. సమస్య ఏంటో తెలుసుకుని సరిదిద్దినప్పుడు గొడవలు రావు. ఇంకోసారి ఒకరి మీద మరొకరు ఫిర్యాదు చేసుకునే పరిస్థితి ఉండదు.

# 'వాము'తో ఆరోగ్యం



ఈ రోజుల్లో చాలామంది అజీర్తి, దగ్గు.. వంటి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా ట్యాబ్లెట్లతో తగ్గించుకుంటున్నారు. అయితే వీటిని తరచూ వాడడం ఆరోగ్యకరం కాదు. కాబట్టి వంటింట్లో లభించే వాముతో ఇలాంటి చిన్న అనారోగ్యాల్ని ఇట్టే దూరం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం..

**అసిడిటీకి దూరంగా...**
అసిడిటీతో బాధపడుతున్నారా? అయితే.. గిన్నెలో ఒక గ్లాసు నీళ్లు పోసి అందులో ఒక టీస్పూన్ వాము, ఒక టీస్పూన్ జీలకర్ర.. వేసి బాగా మరిగించాలి. అసిడిటీతో బాధపడు తున్నప్పుడు ఈ మిశ్రమాన్ని తాగితే సమస్య నుంచి తక్షణ ఉపశమనం కలుగుతుంది.

**గుండెకు రక్షణ ...** వాములో ఉండే నియాసిన్ గుండె సంబంధిత సమస్యలు దరి చేరకుండా కాపాడు తుంది.కొంచెం వామును నీళ్లలో వేసి మరిగించి రోజూ పరగడు పున తాగితే గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి.



**బాలింతలకు మేలు ! ...**
గర్భం దాల్చిన మహిళలకు, పాలిచ్చే తల్లులకు వాము చాలా ఉపయోగపడుతుంది. కడుపుతో ఉండే మహిళలకు సాధారణంగా ఎదురయ్యే మలబద్ధకం, అజీర్తిని ఇది దూరం చేస్తుంది. అలాగే బాలింతల్లో పాల ఉత్పత్తిని పెంచుతుంది.

**దగ్గు నుంచి ఉపశమనం ...**
వాములో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ యాంటీ ఫంగల్.. మొదలైన గుణాల వల్ల దగ్గు, ఆస్తమా.. వంటి ఆరోగ్య సమస్యల నుంచి విముక్తి కలుగుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఆర్థ్రైటిస్ వల్ల ఏర్పడే నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

**నోరు శుభ్రంగా...** వాము నూనెను టూత్‌పేస్ట్‌ల్లో, మౌత్ వాష్‌ల్లో వాడతారు. ఇది నోటిలోని బ్యాక్టీరియాతో పోరాడి నోటి నుంచి దుర్వాసన రాకుండా చేస్తుంది. అలాగేకొద్దిగా వామును నోట్లో వేసుకుని నమిలినా ఫలితం ఉంటుంది. నెలసరి సమయంలో చాలామంది మహిళలకు కడుపునొప్పి రావడం సహజం. అలాంటి సమయంలో వేయించిన వామును పాలలో కలిపి, వేడి చేసుకుని తాగినా ఫలితం ఉంటుంది. వామును కూరలు, పకోడీలు, పరాటాలు, చపాతీలు, మొదలైన ఆహార పదార్థాల తయారీలో వాడితే అటు రుచికి రుచి.. ఇటు ఆరోగ్యానికి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. వాము నూనెను కీళ్ల నొప్పులున్న చోట రాస్తే నొప్పి తగ్గిపోతుంది. వాము వేసి మరిగించిన నీటిని గోరువెచ్చగా అయ్యేదాకా పక్కన పెట్టాలి. ఆపై ఈ నీటితో పుక్కిలిస్తే పంటి నొప్పులు దూరమవుతాయి. గర్భవతులు వామును రోజూ తీసుకుంటే శరీరంలో రక్తం శుభ్రపడటంతో పాటు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. వామును రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల స్థూలకాయం, అధిక బరువు నుంచి విముక్తి పొందచ్చు.

# పప్పుల వడ



**కావలసినవి :**
పచ్చి శనగపప్పు, పెసరపప్పు, మినపప్పు, ఎర్ర కందిపప్పు, అల సందలు–అర కప్పు చొప్పున, నువ్వులు– పావు కప్పు, ఉప్పు– తగినంత, ఉల్లిపాయ ముక్కలు కప్పు, అల్లం, పచ్చిమిర్చి ముద్ద– రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు– అరకప్పు, నూనె– వేయించేందుకు సరిపడా.

**తయారీ :** అన్ని రకాల పప్పులనూ నాలుగు గంటలు నానబెట్టి, దోశపిండిలా మరీ మెత్తగా కాకుండా.. కాస్త బరకగా రుబ్బు కోవాలి. అందులో ఉప్పు, అల్లం, పచ్చిమిర్చి ముద్ద, ఉల్లిపాయ ముక్కలు, కొత్తి మీర తరుగు వేసి కలపాలి. పిండిని చిన్న ఉండలుగా తీసుకుని, చేతిలో తట్టి వడలు చేసి కాగిన నూనెలో వేయిస్తే సరి. ఘుమఘుమలాడే ఆరు పప్పులు వడలు తయారైపోతాయి.

# విశ్వమే ఒక మాయ

ఈ సువిశాల విశ్వమే ఒక మాయ. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతూ వుంటుంది. అందుకే ఒక్కోచోట ఒక రకంగా వాతావరణం మారుతూ ఉంటుంది. మనకు పగలు అయినప్పుడు, కొన్ని చోట్ల రాత్రి అవుతుంది. మనకు వర్షం పడితే కొన్నిచోట్ల చల్లని గాలులు విస్తూ ఉంటాయి. ప్రకృతి అంతా ఒకే తీరుగా ఉండదు. ఇలా ఒక వాతావరణం అంటూ ఉండదు. ఈ విశ్వ మాయకు మానవుడు అలవాటు పడుతున్నాడు. జీవన శైలి కూడ ఒక్కో చోట ఒక్కొక్క తీరుగా ఉంటుంది.మన ఆచారాలు, సంప్రదాయాలు ఒక రకంగా ఉంటాయి. పరాయి దేశస్తులవి వేరే విధంగా ఉంటాయి. అయితే చాలా దేశాలలో భారత్‌నే ఇష్టపడుతున్నారు. ఆస్తికులు కావొచ్చు నాస్తికులు కావొచ్చు మారుతున్న కాలానికి అబ్బుర పడవల సిందే. ఆస్తికులు అయితే ఇదంతా దైవలీల అంటారు. నాస్తికులు మాత్రం దీనితో ఏకీభవించరు . ఇది దైవలీల ఎలా అవుతుంది, అంటూ పలు రకాలుగా మాట్లాడుతూ, భూగోళంలో మార్పులు జరుగుతూ ఉంటాయి. సైన్స్ అభివృద్ధి చెందింది అంటూ ఘర్షణకు దిగుతారు. విశ్వం ఒక మాయ అంటే, కాదు అంటారు. ఆకాశంలో మార్పులు, నక్షత్రాలు, చంద్రుడు, సూర్యుడు వగైరా అంతా దైవ కృప అంటూ తమ వాదన సాగిస్తారు ఆస్తికులు. దీనికి ఎంత మాత్రం ఒప్పుకోరు నాస్తికులు.వాదనలు, తర్జన భర్జనలు ఎలా ఉన్నా వాస్తవానికి విశ్వంలో మార్పులు సహజం. ఆ మార్పులు వ్యక్తి జీవన విధానానికి తగ్గట్లుగా మానవుడు నడచు కుంటున్నాడు. నిజానికి ఒక్కో దేశంలో ఒక్కో వాతావరణం ఉన్నప్పుడు మనమే ఇదంతా భగవంతుని లీల అంటూ ఉంటాం. ఆ మాటలు విన్న నాస్తికులు మాత్రం ఇది ప్రకృతి మార్పు అంటారే కాని దైవ లీల అని మాత్రం అనరు. వాళ్ళు ఎంత మాత్రం దైవం అనే మాట ఎత్తరు. మానవుని మేధస్సుతోనే ఇలా జరుగుతోంది. దైవానికి ఇక్కడ స్థానమే లేదు అని ఖరా ఖండిగా చెబుతారు. మానవ శక్తి ముందు దైవ శక్తి ఎందుకు కొరగాదు అంటూ మానవునికే ప్రధమ స్థానం ఇస్తారు. ఆ ప్రధమ స్థానం దైవం ఇచ్చిందే అని ఆస్తికుల భావన. మార్క్స్ చెప్పినట్లు చారిత్రక గతి తార్కిక భౌతిక వాదం ఉంది అనేది వీరి ఆలోచన. ఏది ఏమైనా విశ్వం అనేది ఒక మాయ లోకం అది అందరూ భావించ వలసిందే.ఆ మాయ లోకంలో మానవులందరూ పావులు. మాయ లోకానికి అనుగుణంగానే మానవులు నడచుకుంటారు.

**- కనుమ ఎల్లారెడ్డి.**

# 'దూరదర్శని' అందరి మనసులను హత్తుకుంటుంది: కార్తికేయ కొమ్మి



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందు తోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని పనులను పూరి చేసుకున్న ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది.

**మీ నేపథ్యం ఏమిటి?**
ఇంతకు ముందు నేను సాధ్యం, వసూల్ రాజా, లక్ష్మీబాంబ్ సినిమాలకు దర్శకత్వం చేశాను. నేను కొత్తవాళ్లతో చేసిన తొలి ప్రాజెక్ట్ ఇది.

**దూరదర్శని కథ ఏమిటి?**
కథగా చెప్పుకుంటే పేరెంట్స్ చాయిస్, సొసైటీ చాయిస్, పిల్లల చాయిస్.. వీటి మధ్య ఉండే క్లాష్.. ఈ చిత్ర కథాంశం. చిత్రలహరి టైమ్ పిరియడ్ మిస్ అయిన వారికి. ఆ టైమ్‌లో చిత్రలహరి అనుభూతిని పొందిన వారికి ఈ సినిమా పూర్తి సంతృప్తి నిస్తుంది. చిత్రలహరి గురించి అందరూ ఎలా వెయిట్ చేసే వారు.. **ఇటీవల తిమ్మరాజు పల్లి టీవీకి అనే సినిమా వచ్చింది ఆ సినిమాతో ఏమైనా పోలీకలు ఉంటాయా?**
కథ విషయంలో ఆ సినిమాకు ఈ సినిమాకు సంబంధం లేదు. ఇది కంప్లీట్ ఎమోషన్ సినిమా. ఫాదర్, సన్‌కు మధ్య ఉన్న ఎమోషన్.. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం మీ హృదయాలకు హత్తుకుంటుంది.

**అరుణాచలంలో భిక్షాటన చేస్తున్న ఓ వ్యక్తి జీవిత కథ ఈ సినిమా అంటున్నారు?**
ఆంధ్రా లో జరిగిన ఒక రియాల్ ఇన్‌సిడెంట్ ఇది. ఇప్పుడు ఆ వ్యక్తి అతను అరుణాచలంలో ఉన్నాడు. అతని జీవితంలో జరిగిన కథను స్ఫూర్తిగా తీసుకుని ఈ కథను తయారుచేశాం. ఆయనతో మాట్లాడినప్పుడు ఆయన చెప్పిన లైఫ్ స్టోరియే సినిమా ఇది. ఆయన సొంత కొడుకు వల్ల ఆ పెద్దాయన భిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది అనేది ఈ కథ. యదార్థ సంఘటన చుట్టు అల్లుకున్న కథ ఇది.

**సాధారణంగా ఇలాంటి లవ్‌స్టోరీస్‌కు పతాక సన్నివేశాలు హైలైట్ అవుతుంటాయి? ఈసినిమాలో పతాక సన్నివేశాలు ఎలా ఉంటాయి?**
ఈ సినిమా పతాక సన్నివేశాలు అందర్ని ఆలోచింపజేస్తాయి. సినిమా చూసిన వచ్చిన తరువాత ఆ ఫీల్ మిమ్ములను వదిలివెళ్లదుఖి అన్నారు.అందరూ ఓ మంచి సినిమా చూశామన్న అనుభూతితో థియేటర్ నుంచి బయటికొస్తారు.

**హీరో, హీరోయిన్ చనిపోతారని చెప్పారు. ఎందుకని? ఇలా చెబితే సినిమాపై ఆసక్తి తగ్గుతుంది కదా?**
స్క్రీన్‌ప్లేలో ఉండే మ్యాజిక్ ఇది. ఫైనల్‌గా ఎలా హ్యాపీ ఎండింగ్ అనేది ఉంటుంది. ఓవరాల్‌గా తల్లిదండ్రుల ఎమోషన్ బాగా కనెక్ట్ అవుతుంది.

**హీరో, హీరోయిన్ పర్‌ఫార్మెన్స్ ఎలా ఉంటుంది?**
కొత్తవాళ్లతో చేసే అవకాశం రావడం థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఈ మూవీకి హీరో, హీరోయిన్ పర్‌పార్మెన్స్ హైలైట్‌గా ఉంటుంది. వాళ్ల నటనతో సినిమాను మరో మెట్టు ఎక్కించారు.

**మీ తదుపరి చిత్రం?**
ఆగస్టులో ఓ పెద్ద ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించబోతున్నాను

## తెర

# "SYSTEM" ట్రైలర్ విడుదల

ప్రైమ్ వీడియో తమ కొత్త ప్రైమ్ ఒరిజినల్ సినిమా"SYSTEM"ట్రైలర్‌ను విడుదల చేసింది. కోర్ట్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో పవర్, న్యాయం మధ్య జరిగే పోరాటాన్ని ఆసక్తికరంగా చూపించారు. ఈ చిత్రానికి అశ్విని అయ్యర్ తివారి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సోనాక్షి సిన్హా, జ్యోతిక, అశుతోష్ గోవరికేర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా మే 22 నుంచి ప్రైమ్ వీడియోలో మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్‌లో నేహా అనే యువ లాయర్ పాత్రలో సోనాక్షి సిన్హా కనిపించారు. తన తండ్రిలా ఫర్మ్‌లో పార్ట్నర్ కావాలని ఆశపడే ఆమె, తన ప్రతిభను నిరూపించు కోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో కోర్ట్ స్టెనోగ్రాఫర్ సారిక పాత్రలో నటించిన జ్యోతికతో కలిసి పని చేస్తుంది. అయితే సారికకు కొన్ని గోప్యమైన ఉద్దేశాలు కూడా ఉంటాయి. కోర్ట్ సన్నివేశాలు, భావోద్వేగాలు, ఆలోచింపజేసే డైలాగు లతో ట్రైలర్ ఆకట్టుకుంటోంది."పవర్ ముందు నిజం నిలబడగలదా? న్యాయం గెలుస్తుందా?" అనే ప్రశ్నను సినిమా ప్రధానంగా చూపించబోతోంది. దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారి మాట్లాడుతూ,



నిజ జీవితానికి దగ్గరగా ఉండే కథతో ఈ సినిమా రూపొందిందని తెలిపారు. అలాగే సోనాక్షి సిన్హా, జ్యోతిక ఈ చిత్రం తమ నటనకు కొత్త సవాల్‌గా నిలిచిందని చెప్పారు. ప్రేక్షకులను ఆలోచింపజేసే కథలను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లడంలో ప్రైమ్ వీడియో మంచి వేదిక అని ఆమె అభిప్రాయపడ్డారు.

# రిలీజ్‌కు సిద్ధమైన 'ఆర్ కే దీక్ష'



ఆర్ కె ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్ బ్యానర్‌లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం 'ఆర్ కే దీక్ష'. డి.ఎస్ రెడ్డి సమర్పణ లో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్ 12న గ్రాండ్ థియే ట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ మా 'ఆర్ కే దీక్ష' సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యాక్షన్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో సెన్సార్ వారు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేశారు. పెద్దగా కట్స్ లేకుండా సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులకు ధన్యవాదాలు. ఈ సినిమా చాలా బాగా వచ్చింది.అక్స ఖాన్ ఈ చిత్రంలో డ్యాన్సర్ పాత్రలో కనిపిస్తుంది. ఆమెపై తెరకెక్కించిన 'నంది నంది' పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రోహిత్ శర్మ నెగిటివ్ రోల్‌లో నటించారు. హీరో కిరణ్ మాట్లాడుతూ – నేను ఇప్పటికే పలు చిత్రాల్లో నటించాను. ప్రస్తుతం మూడు పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నాను.

# 'వీరభద్రుడు' మే 14న రిలీజ్

'వీరభద్రుడు' థియేటర్స్‌లో ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు: ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో సూర్య అన్నారు. 'వీరభద్రుడు' లాంటి క్యారెక్టర్‌ను అన్నయ్య మాత్రమే చేయగలరు. ఇలాంటి సినిమాలు థియేటర్‌లోనే చూడాలి హీరో కార్తి తెలిపారు.



సూర్య మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు' త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో హీరో కార్తి, డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో సూర్య మాట్లాడుతూ.. నేను ఇక్కడికి వచ్చిన ప్రతిసారి చాలా అదృష్టవంతుడిగా భావిస్తాను. నాకు తెలుగు అంత బాగా రాకపోవచ్చు.. కానీ తెలుగు వారి మనసు మాత్రం నాకు బాగా తెలుసు. సుప్రియతో మాకు ఎప్పటినుంచో చాలా మంచి స్నేహం ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను రిలీజ్ చేయడం చాలా గౌరవంగా భావిస్తున్నాం. హీరో కార్తీ మాట్లాడుతూ.. మీ ప్రేమకి హృదయపూర్వక కృతజ్ఞతలు. షూటింగ్ జరుగుతుండగా ఇక్కడ రోలెక్స్ ఉన్నారని చెప్పారు. డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. ఒక డివైన్ ఎలిమెంట్‌తో పాటు సోషల్ యాంగిల్‌ను అద్భుతంగా మిక్స్ చేసి ఆర్.జే. బాలాజీ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు

# 'రమణి కళ్యాణం' టీజర్ లాంచ్



సూర్య వశిష్ట, దీప్షిక హీరో హీరోయిన్స్‌గా విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఎమోషనల్ డ్రామా రమణి కళ్యాణం. కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్ పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి. శ్రీనాథ్ పసుపు లేటి, సంజయ్ వెంపరాల నిర్మిస్తు న్నారు. కోర్ట్ మూవీ ఫేం రామ్ జగదీష్ డైలాగ్స్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ని సహజనటి జయసుధ లాంచ్ చేశారు.టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సహజనటి జయసుధ మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. ఈ సినిమా నిర్మించిన నిర్మాతలకు అభినందనలు. ఈ సినిమాలో హీరో, హీరోయిన్‌లు అద్భుతంగా నటించారు. విజయ్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమాను తీశాడు. ఇది ఒక బ్యూటిఫుల్ ఫిల్మ్. ఈ మధ్యకాలంలో చిన్న సినిమాల్లో కూడా చాలా మంచి సినిమాలు వస్తున్నాయి.'రమణి కళ్యాణం' కూడా అలాంటి మంచి సినిమా. హీరో, హీరోయిన్‌లు చాలా నేచురల్‌గా పెర్ఫార్మ్ చేశారు. మ్యూజిక్ కూడా చాలా అద్భుతంగా వచ్చింది. నేను ఈ సినిమా చూశాను. ఇది ఒక మంచి ఫీల్‌గుడ్ మూవీ. మే 22న ఈ సినిమా విడుదల అవుతోంది. అందరూ థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను, హీరో సూర్య వశిష్ట మాట్లాడుతూ.. రమణి కళ్యాణం అనే టైటిల్‌లోనే మంచి పాజిటివ్ ఎనర్జీ ఉంది. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయి. మా డైరెక్టర్ ఈ సినిమాను ప్రాణం పెట్టి చేశారు.హీరోయిన్ దీప్షిక చంద్రన్ మాట్లాడుతూ..ఈ సినిమా మే 22న థియేటర్స్‌లోకి వస్తోంది. ఇది ఒక అద్భుతమైన కథ. ఇందులో చూపులేని అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. అది సవాల్ తో కూడుకున్న పాత్ర. ఈ సినిమాలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ విజయ్ ఆదిరెడ్డి మాట్లాడుతూ.. . ఇది మంచి టీమ్ సపోర్ట్‌తో చేసిన సినిమా. ఈ కథను నమ్మి పనిచేసిన అందరికీ థ్యాంక్స్.

# జూన్ 19న వస్తున్న 'బాలన్ ది బాయ్'

గ్రాండియర్ ఫిలిం మేకింగ్‌కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా "బాలన్ ది బాయ్". ఈ చిత్రానికి "ఆవేశం" ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్‌తో "మంజుమ్మెల్ బాయ్స్" చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. జూన్ 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో "బాలన్ ది బాయ్" చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు.'బాలన్ ది బాయ్' సినిమా ప్రఖ్యాత కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శితం కానుంది. ఈ నెల 14న కేన్స్ ఫిలిం ఫెస్టివల్ బిజినెస్ వింగ్ అయిన మార్ష్ డు ఫిలింలో "బాలన్ ది బాయ్ " స్క్రీనింగ్ జరగనుంది. గ్లోబల్ సినిమాకు వేదికైన కేన్స్ స్క్రీనింగ్ కు ముందే మేకర్స్ ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించడం విశేషం. మన నేటివిటీతో సాగే కథా కథనాలతో యూనివర్సల్ గా ప్రతి ఆడియెన్ మనసును హత్తుకునే భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని దర్శకుడు చిదంబరం తెరకెక్కిస్తున్నారు. థియేటర్స్‌లో తప్పక చూడాల్సిన చిత్రమిది అంటూ మేకర్స్ కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు.



# గుజరాత్ పేస్‌కు కుప్పకూలిన సన్‌రైజర్స్




## వరుసగా అయిదో విజయం

## టేబుల్ టాపర్‌గా గిల్ సేన

**అహ్మదాబాద్:** నరేంద్రమోదీ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ పేస్ అటాక్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ పేకమేడలా కుప్పకూలింది. 14.5 ఓవర్లలోనే 86 పరుగులకే ఆలౌటైంది. దీంతో గుజరాత్ 82 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. వరుసగా అయిదో విజయం అందుకుంది. ఓవరాల్‌గా 8వ విజయంతో 16 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. సన్‌రైజర్స్ ఈ పరాజయంతో మూడో స్థానానికి చేరుకుంది. దీంతో ప్లేఆఫ్ చేరాలంటే సన్‌రైజర్స్ ఆడాల్సిన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

169 పరుగుల స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌కు సిరాజ్ షాకిచ్చాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే ట్రావిస్ హెడ్(0)ను అవుట్ చేశాడు. ఆతర్వాతి వంతు రబడాది అయింది. మొదట అభిషేక్(6)ను క్లీన్ బౌల్డ్ చేసిన రబడ.. ఆ తర్వాత ఇషాన్ కిషన్(11), రవిచంద్రన్(9)ను పెవిలియన్ పంపాడు. మరో ఎండ్‌లో బౌలింగ్‌కు వచ్చిన హోల్డర్, ప్రసిద్ధ్ కృష్ణ... మిడిల్ ఆర్డర్‌ను దెబ్బతీశారు. దీంతో సన్‌రైజర్స్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. ఏ ఒక్కరూ క్రీజ్‌లో నిలదిక్కు కోలేకపోయారు. పాట్ కమిన్స్ చేసిన 19 పరుగులే టాప్ స్కోర్. ఆరుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. గుజరాత్ బౌలర్లలో రబడ, హోల్డర్ చెరో మూడేసి వికెట్లు, ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు పడగొట్టారు. మహ్మద్ సిరాజ్, రషీద్ ఖాన్ ఒక్కో వికెట్ తీశారు.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను ఆరంభంలో ప్రఫుల్ హింగే, మిడిల్‌లో సకిబ్ హుస్సేన్ దెబ్బతీశారు. స్టార్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్ (5)ను అద్భుత బంతితో ప్రఫుల్ హింగే అవుట్ చేసి ఆరంభంలోనే షాకిచ్చాడు. ఆ వెంటనే మరో కీలక ప్లేయర్ జోస్ బట్లర్ (7) కూడా ఇషాన్ కిషన్ క్యాచ్ ద్వారా హింగే అవుట్ చేశాడు. దీంతో 26 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో సాయి సుదర్శన్ (44 బంతుల్లో 61), నిశాంత్ సింధు (22) కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. మూడో వికెట్‌కు 38 పరుగుల జోడించారు. ఈ దశలో నిశాంత్‌ను కమిన్స్ అవుట్ చేసి బ్రేక్ ఇచ్చాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ సాయి సుదర్శన్ నిలకడగా ఆడి అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని ఇనింగ్స్‌లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు ఉన్నాయి. వాషింగ్టన్ సుందర్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు. ఈ దశలో సాకిబ్ హుస్సేన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి సుదర్శన్ అవుట్ అయ్యాడు. ఇన్నింగ్స్ చివర్లో సుందర్ ధాటిగా ఆడి జట్టు స్కోరును 160 దాటించాడు. 7 ఫోర్లు, ఒక సిక్సర్‌తో హాఫ్ సెంచరీ సాధించాడు. 19వ ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో 19 రన్స్ చేశాడు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 రన్స్ చేసింది. సన్‌రైజర్స్ బౌలర్లలో ప్రఫుల్ హింగే, సాకిబ్ చెరో రెండు వికెట్లు తీసుకోగా.. కమిన్స్ ఒక వికెట్ పడగొట్టాడు.

# కుస్తీమే సవాల్

**వినేష్ ఫోగట్‌కు మద్దతుగా సాక్షి మాలిక్**



**న్యూఢిల్లీ:** భారత్ రెజ్లింగ్ సమాఖ్య వర్సెస్ వినేష్ ఫోగట్ వ్యవహారం రోజు రోజుకు రాజుకుంటోంది. రెజ్లింగ్ సమాఖ్య వేటు వేయడాన్ని వినేష్ ఫోగట్ సవాల్ చేస్తుంటే, మరోవైపు ఆమెకు మద్దతుగా మాజీ రెజ్లర్ల స్వరం పెరుగుతోంది. తాజాగా ఒలింపిక్ బ్రాంజ్ మెడలిస్ట్ సాక్షి మాలిక్ మద్దతు పలికింది. వినేష్‌ను రెజ్లింగ్ సమాఖ్య అడ్డుకుంటోందని విరుచుకుపడింది. రెజర్లు తిరిగి కెరీర్ ప్రారంభించడానికి ప్రపంచ వ్యాప్తంగా నిబంధనలు సడలిస్తుంటే, భారత్‌లో భిన్న పరిస్థితి ఉందని పేర్కొంది. తల్లులు అయిన తర్వాత కూడా మహిళలు దేశం కోసం ఆడటం, పతకాలు గెలవడం చూస్తున్నామని తన సోషల్ మీడియా పేజీలో వీడియా పోస్ట్ చేశారు. వినేష్‌ను అడ్డుకోవడానికి రెజ్లింగ్ సమాఖ్య నిబంధనలు తీసుకురావడం దుర్మార్గమని.. ఇప్పటికైనా ఆమెకు ట్రయల్స్ నిర్వహించాలని ప్రధాన మంత్రిని, కేంద్ర క్రీడాశాఖ మంత్రిని అభ్యర్థించారు.

**గోండా చేరుకున్న వినేష్ ఫోగట్**

డబ్ల్యూఎఫ్ఐ అనర్హురాలిగా ప్రకటించినప్పటికీ.. వినేష్ ధిక్కార వైఖరితో గోండాలో జరుగుతున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు హాజరయ్యారు. తన 10 నెలల కుమారుడితో కలిసి మరీ ఈ టోర్నీకి వచ్చింది. ఈ సందర్భంగా డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్‌సింగ్‌తో భేటీ అయ్యారు. గోండా టోర్నీలో పోటీ చేసేందుకు అనుమతించాలని కోరారు. దీనికి డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు నిరాకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెజ్లింగ్ సమాఖ్యపై వినేష్ ఫక్షగట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆసియా క్రీడల్లో తాను పాల్గొనకుండా ఉండాలనేదే డబ్ల్యూఎఫ్ఐ లక్ష్యమని ఆరోపించారు. తాను మళ్లీ పతకాలు గెలుస్తానని వారు భయపడుతున్నారన్నారు. తాను రిటైర్ అవ్వాలని వారు కోరుకుంటున్నారని వినేష్ వాపోయింది. కాగా పలు అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు పలు మెడల్స్ అందించింది. నిర్ణీత బరువు పరిమితి కంటే 100 గ్రాములు ఎక్కువగా ఉన్నందుకు 2024 పారిస్ ఒలింపిక్స్ ఫైనల్స్ నుండి అనూహ్యంగా అనర్హత వేటుకు గురైన తర్వాత వినేష్ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికారు. తీవ్ర నిరాశకు గురైన ఈ హర్యానా రెజ్లర్ చివరికి రాజకీయాల్లోకి ప్రవేశించి, అదే సంవత్సరం జులనా నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు.

# థాయ్ ఓపెన్ డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

## భారత్ షట్లర్లకు సింగిల్స్‌లో పరీక్ష



**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్- చిరాగ్ శెట్టి శుభారంభం చేశారు. తొలి రౌండ్‌లో ఇండోనేషియాకు చెందిన ముహ్ పుత్ర- బగాస్ మోలానాలను మూడు సెట్ల హోరా హోరీ పోరులో ఓడించారు.ప్రపంచ నంబర్ 4 భారత జోడీ... తొలి రౌండ్‌ను 64 నిమిషాల్లో ముగించి తరువాతి రౌండ్‌కు చేరుకున్నారు. తొలి సెట్‌ను 19-21తో చేజార్చుకున్న భారత జోడీ... రెండో సెట్‌లో పుంజుకుంది ఓ దశలో గేమ్ పాయింట్ ను కాచుకుని గట్టెక్కింది. వరుసగా ఏడు పాయింట్లు సాధించి 23-21తో రెండో సెట్ నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో భారత జోడీ మరింతగా విజృంభించింది. ప్రత్యర్థి జోడీకి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా 21-10తో అలవోకగా చేజిక్కించుకుది. కాగా థామస్ కప్ కాంస్య పతకంతో సత్తా చాటిన భారత షట్లర్లు మరో పరీక్షకు సిద్ధమయ్యారు.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో జేసన్ హెంగ్ (సింగపూర్)తో లక్ష్యసేన్, లో కీన్ యూ (సింగపూర్)తో కిదాంబి శ్రీకాంత్, కొడయ్ నరవొక (జపాన్)తో ఆయుష్ శెట్టి, కొకి వతనబె (జపాన్)తో తరుణ్ మన్నెపల్లి తలపడనున్నారు. మహిళల సింగిల్స్‌లో సియో టాంగ్ (చైనీస్ తైపీ)తో పి.వి.సింధు, పోర్న్‌పావీ (థాయ్‌లాండ్)తో ఉన్నతి హుడా, వెన్ జాంగ్ (కెనడా)తో మాళ వికి బాన్సోద్ తమ పోరాటాన్ని ప్రారంభిస్తారు.



# తొలి టెస్ట్‌లో పాక్‌పై బంగ్లా విజయం

**ఢాకా:** పాకిస్థాన్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా ఢాకాలో జరిగిన తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ సంచలనం సృష్టించింది. ఏకంగా 104 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది. అయిదు రోజు ఆటలో 268 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 163 రన్స్‌కే కుప్ప కూలింది. పాక్ ఇన్నింగ్స్‌లో అబ్దుల్లా ఫజల్(66) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతావారంతా బంగ్లా పేసర్ల ధాటికి ఒకరు వెనక ఒకరుగా పెవిలియన్ చేరారు. యువ ఫాస్ట్ బౌలర్ నహిద్ రాణా అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 9.5 ఓవర్లలోనే 40 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి పాక్ పతనాన్ని శాసించాడు. అతడితో పాటు టాస్కిన్ అహ్మద్, తైజుల్ ఇస్లాం తలా రెండు వికెట్లు సాధించారు. కెప్టెన్ నజ్ముల్ సెంచరీతో బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 413 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆ తర్వాత పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌ను 386 పరుగులకు తెరదించి 27 పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది. రెండో ఇనింగ్స్‌లో బంగ్లా 9 వికెట్లకు 240 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈలక్ష్యాన్ని చేధించలేక పాకిస్తాన్ చతికిలబడింది. కాగా బంగ్లాదేశ్ 24 ఏళ్ల తర్వాత సొంతగడ్డపై పాకిస్థాన్‌పై తొలి టెస్టు విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో టెస్ట్ మ్యాచ్ మే 16 నుంచి సిల్హెట్ వేదికగా జరగనుంది.

# రోమ్ డైమండ్ లీగ్‌కు నీరజ్ చోప్రా దూరం

**రోమ్:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్, రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా... జూన్ 4నుంచి జరగనున్న రోమ్ డైమండ్ లీగ్‌కు దూరమయ్యాడు.అతని పేరు డైమండ్ లీగ్‌లో పాల్గొనే వారి ఎంట్రీ జాబితాలో లేదు. ప్రస్తుతం టర్కీలో ఉన్న చోప్రా.. తిరిగి బరిలోకి దిగేలోపు పూర్తి ఫిట్‌నెస్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. చోప్రా గైర్హాజరీలో సచిన్ యాదవ్.. డైమండ్ లీగ్‌లో బరిలోకి దిగనున్నాడు. మార్చి లో జరిగిన ఒక దేశీయ ఈవెంట్‌లో 89.37 మీటర్ల త్రో నమోదుచేశాడు. గత ఏడాది టోక్యో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 86.27 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ త్రోతో యాదవ్ నాలుగో స్థానంలో నిలిచాడు.రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన తన స్వదేశీయుడు నీరజ్ చోప్రాను





# ప్రభుత్వరంగ బ్యాంకుల లాభాలు రూ.1.98 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, మే 12:** ప్రభుత్వరంగ బ్యాంకులకు ఈ ఆర్థిక సంవత్సరంలో గత చరిత్రలో ఎన్నడూలేని విధంగా రూ.1.98 లక్షల కోట్ల నికరలాభం ఆర్జించాయి. వరుసగా నాలుగో ఏడాది కూడా ప్రభుత్వరంగ బ్యాంకులు లాభదాయకతను పెంచుకున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. రుణాల్లో వృదిధ, స్థిరాస్తుల నాణ్యతలో మెరుగుదల, రికవరీలు భారీగా పెరగడం, మూలధన స్థితి పటిష్టం చేసుకోవడం ద్వారా బ్యాంకులు లాభాల్లో నిలిచాయని కేంద్రం వెల్లడించింది. ప్రభుత్వ బ్యాంకుల్లో కొనసాగుతున్న సంస్కరణలు కూడా ఇందుకు కీలకమయ్యాయి. 2026 మార్చి 31నాటికి ప్రభుత్వరంగ బ్యాంకుల మొత్తం టర్నోవర్ 12.8శాతం పెరిగి రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. డిపాజిట్లు 10.6శాతం వృద్ధితో రూ.156.3 లక్షలకోట్లకు పెరిగితే స్థూల రుణాలు 15.7శాతంపెరిగి 127 లక్షలకోట్లకు చేరాయి. రిటైల్, వ్యవసాయం, ఎంఎస్ఎంఇ రంగాల్లో రుణవృద్ధి భారీగా నమోదయింది.రిటైల్‌రుణాలు 18.1శాతం, వ్యవసాయ రుణాలు 15.5 శాతం, ఎంఎస్ఎంఇ రుణాలు 18.2శాతం నమోదయ్యాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి స్థూల నిరర్థక ఆస్తులు నిష్పతి 193శాతానికి చేరింది. నికర నిరర్థక ఆస్తులు కూడా 0.39శాతానికి తగ్గి చరిత్రాత్మక కనిష్టానికి చేరాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు 90శాతంకంటే ఎక్కువ కేటాయింపుల కవరేజి రేషియోను కొనసాగించాయని, అప్రమత్తతతో కూడిన కేటాయింపుల విధానాలు రిస్క్‌ను తగ్గించిందని మంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రభుత్వరంగ బ్యాంకుల నిర్వహణ లాభం రూ.3.21 లక్షలకోట్లకు చేరుకోగా నికరలాభం 11.1శాతంపెరిగి రికార్డు స్థాయిలో రూ.1.98 లక్షలకోట్లకు చేరింది. ఈ ఏడాది రూ.50,551 కోట్ల మూలధన మీకరణతో మూలధన పరిపుష్టిచేకూరిందని కేంద్రం వెల్లడించింది. టెక్నాలజీ డిజిటల్ కార్యక్రమాలతో నిర్వహణ సామర్థ్యం కూడా పెరిగి ఖర్చు ఆదాయం నిష్పత్తి 49.67శాతానికి తగ్గినట్లు తేలింది. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యసాధనలో దేశ ఆర్థికవృద్ధికి ప్రభుత్వ రంగ బ్యాంకులు మరింత మద్దతు అందించే స్థాయికి చేరుకున్నాయని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది.

# గూగుల్ సెర్చింజన్ సేవల్లో షార్ట్‌బ్రేక్



**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 12:** టెక్ దిగ్గజం ఆల్ఫాబెట్ ఇంక్‌కు చెందిన గూగుల్ సెర్చ్ సేవలు మంగళవారం ప్రపంచ వ్యాప్తంగా కొంత సేపు నిలిచిపోయాయి. భారత్, అమెరికా సహా పలు దేశాల్లోని వినియోగదారులు గూగుల్ సెర్చ్‌ను యాక్సెస్ చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలామందికి సెర్చ్ పేజీ ఓపెన్ కాలేదు. సెర్చ్ చేయడానికి ప్రయత్నించిన అనేక మంది యూజర్లకు 500 ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్ అనే సందేశం కనిపించింది. మీఅభ్యర్థనను ప్రాసెస్ చేస్తున్నప్పుడు అంతర్గత సర్వర్ లోపం తలెత్తింది. మా ఇంజినీర్లకు సమాచారం అందింది, వారు సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు. దయచేసి మళ్లీ ప్రయత్నించండి అని సందేశంవచ్చింది. సాధారణంగా ఈ ఎర్రర్, యూజర్ల డివైజ్‌లు లేదా ఇంటర్నెట్ కనెక్షన్‌లో కాకుండా, కంపెనీ సర్వర్ల వైపు సమస్య ఉన్నప్పుడు కనిపిస్తుంది. ఈ అంతరాయంతో సోషల్ మీడియాలో, ఆన్‌లైన్ ఔటేజ్‌ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

# రూ.10 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

## భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, మే 12:** దేశీయ స్టాక్ సూచీలు మళ్లీ భారీ నష్టాల్లో ముగిసాయి. వరుసగా నాలుగోసారి కూడా ట్రేడింగ్‌లో నష్టాలు ఎదుర్కొన్నాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ క్షీణించింది. ముడిచమురుదరలు, రూపాయి క్షీణత విదేశీ పెట్టుబడులు విత్‌డ్రా, అమెరికాఇరాన్ శాంతి ఒప్పందంపై సందిగ్ధం వంటివి ముఖ్య కారణాలుగా కనిపిస్తున్నాయి. ఐటి స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఓపెన్ ఎఐ నాలుగు బిలియన్ డాలర్ల ఎఐ వెంచర్‌ను ప్రకటించడంతో ఐటి రంగానికి షాక్ తగిలింది. నిఫ్టీ 23,400 మార్కు వద్దనే నిలిచింది. ఐటి, కన్సూమర్ డ్యూరబుల్‌స్టాక్స్‌లో భారీ క్షీణత నమోదుకాగా ఎన్ఎస్ఇలో అన్ని సూచీలు కూడా నష్టాల్లోనే మిగిలాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 1456.04 పాయింట్లు నష్టపోయి 74,559.24 పాయింట్ల వద్ద ముగిస్తే నిఫ్టీ సూచీ కూడా 436.30 పాయింట్లు క్షీణించి 23,379.55 పాయింట్లవద్ద నిలిచింది. నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 2.5, నిఫ్టీ 2.1శాతం చొప్పున నష్టపోయాయి.

మంగళవారం నాటి ట్రేడింగ్‌తో బిఎస్ఇ టర్నోవర్ పదిలక్షలకోట్లు ఆవిరయింది. ఇన్వెస్టర్ల షేర్లు ధమాల్ కావడంతోనే సంపద కరిగిపోయింది. రిలయన్స్ 1.77శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.77శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.68శాతం చొప్పున భారీ క్షీణతను చవిచూసాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 2.56శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 2.95శాతం క్షీణించాయి. మొత్తం ట్రేడ్ అయిన బిఎస్ఇ షేర్లలో కేవలం 869 షేర్లు మాత్రమే పెరిగాయి. 3412 షేర్లు పతనం చెందాయి. మొత్తం 141 షేర్లు స్థిరంగా కొనసాగడం గమనార్హం. ఇక విదేశీ కరెన్సీ చెలామణి మార్కెట్‌లో రూపాయి విలువలు 95.63గా నమోదయ్యాయి. అంతకుముందురోజు 94.28 కంటే మరింతగా క్షీణించింది. భారత్‌లో పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.27 శాతం పెరిగి 7.05కి చేరింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.1,53,336కి చేరింది. అమెరికా పదేళ్ల బాండ్ల రేట్ కూడా 0.41శాతం పెరిగి 4.431శాతంగా కొనసాగింది.కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు జులై సెటిల్‌మెంట్లు 3.24 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 107.45 డాలర్లుగా కొనసాగాయి. శాంతి ఒప్పందం సందిగ్ధత కారణంగా యూరోపియన్ మార్కెట్లు క్షీణించాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమధోరణి చూపించాయి. వాల్‌స్ట్రీట్‌లో అమెరికా ఈక్విటీలు రాత్రికిరాత్రే పెరిగాయి.ఎస్అండ్‌పి 500 0.19శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.10శాతం, డౌజోన్స్ పారిశ్రామిక సగటు 0.19శాతం చొప్పున పెరిగాయి. ఇక దేశీయంగా నిఫ్టీ ఐటిసూచీ 3.73శాతం క్షీణించింది. ఐటి విభాగంలోని కంపెనీలన్నీ కూడా నష్టాల్లోనే ముగిసాయి.లాభాలు సాధించిన కంపెనీల్లో పరదీప్ ఫాస్పేట్స్, శాటిన్ క్రెడిట్‌కేర్ నెట్‌వర్క్‌లు పెరిగాయి. ఇక జిఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు, ఫ్రాక్టాల్ అనలిటిక్స్, అబ్బుట్ ఇండియా, అరియన్‌ప్రో సొల్యూషన్స్, మనోరమ ఇండస్ట్రీస్; ఇండియన్ హోటల్స్ కంపెనీ వంటిషేర్లు భారీగా క్షీణించాయి.

# 3.5 కోట్ల బులియన్ కార్మికులకు ఎఫెక్ట్

## కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు ఎఐజెజిఎస్‌ఎఫ్‌లేఖ



**న్యూఢిల్లీ,మే 12:** బంగారం కొనుగోలును తగ్గించాలన్న ప్రధానిమోడీ పిలుపు ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెను చర్చకు దారితీసింది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల చమురు ధరలు పెరగడం, తద్వారా విదేశీ మారక ద్రవ్యంపై పడుతున్న ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ సూచన చేశారు. అయితే ఆల్ ఇండియా జ్యువెలర్స్ అండ్ గోల్డ్ స్మిత్స్ ఫెడరేషన్ తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఒక లేఖ రాసింది.

భారతదేశంలో ఆభరణాల రంగం కేవలం ఒక వ్యాపారం మాత్రమే కాదు, ఇది కోట్లాది మంది సామాన్యుల జీవనాధారం. ఎఐజెజిఎస్ఎఫ్ గణాంకాల ప్రకారం, ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 3.5 కోట్ల మంది ఆధారపడి జీవిస్తున్నారని పెద్ద నగల వ్యాపారులే కాకుండా,గల్లీల్లో ఉండే చిన్న స్వర్ణకారులు, డిజైనర్లు, పాలిషర్లు, కళాకారులు ఉన్నారు. ప్రభుత్వం కోరినట్లుగా ప్రజలు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉంటే, ఈ రంగంలోని కార్మికుల రోజువారీ కూలీపై దెబ్బ పడుతుందని, ఇది గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థల మధ్య సమతుల్యతను దెబ్బతీస్తుందని జ్యువెలర్స్ ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దిగుమతులను తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని జ్యువెలర్స్ ఫెడరేషన్ సమర్థిస్తున్నప్పటికీ, దానికి పరిష్కారం కేవలం డిమాండ్‌ను తగ్గించడం మాత్రమే కాదని వారు వాదిస్తున్నారు. దేశంలోని ఇళ్లలో, మతపరమైన సంస్థల వద్ద టన్నుల కొద్దీ వాడని బంగారం నిల్వ ఉంది. దీనిని చలామణి లోకి తీసుకురావడానికి ఒక పటిష్టమైన బులియన్ బ్యాంక్ ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని వారు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు సూచించారు.

ఈ విధానం ద్వారా ప్రజలు తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేసి వడ్డీ పొందవచ్చు, అదే బంగారాన్ని ప్రభుత్వం లేదా పరిశ్రమ అవసరాలకు వాడుకోవచ్చు. దీనివల్ల కొత్తగా విదేశాల నుంచి బంగారం దిగుమతి చేసుకోవాల్సిన అవసరం తగ్గుతుంది, తద్వారా విదేశీ మారక ద్రవ్యం కూడా ఆదా అవుతుంది. మహిళల వద్ద ఉన్న 25 వేల టన్నుల బంగారాన్ని ముందు బయటకు రప్పించాలని కేంద్ర మంత్రికి బులియన్ వ్యాపారులు సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ధరల వల్ల మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి.

సాధారణంగా భారతదేశంలో పెళ్లిళ్లు, పండుగల సమయంలో బంగారం కొనుగోళ్లు గరిష్ట స్థాయిలో ఉంటాయి. ప్రస్తుత సీజన్‌లో ఇలాంటి ప్రకటనలు రావడం వల్ల అటు వినియోగదారుల్లో, ఇటు వ్యాపారుల్లో అయోమయం నెలకొంది. పెట్టుబడి దారులు కూడా బంగారంపై తమ వ్యూహాలను పునరాలోచించుకుంటున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే దేశ ఆర్థిక భద్రత కోసం దిగుమతి బిల్లును తగ్గించడం ఎంత ముఖ్యమో, లక్షలాది మంది కళాకారుల ఉపాధిని కాపాడటం కూడా అంతే ముఖ్యమనికేంద్ర మంత్రికి విజ్ఞప్తిచేసారు.

# డాక్టర్ రెడ్డీస్ నికరలాభాల్లో క్షీణత

**ముంబయి, మే 12:** డాక్టర్ రెడ్డిస్ లేబరేటరీస్ నాలుగోత్రైమాసికంలో నికరలాభాల్లో 86శాతం తగ్గినట్లుప్రకటించింది. పన్నుల చెల్లింపుల తర్వాత లాభాలు రూ.221.3కోట్లు మాత్రమే ఆర్జించింది. ఉత్తర అమెరికాలో జనరిక్‌మందుల అమ్మకాలు తగ్గడమే ఇందుకు కారణమని చెపుతోంది. గత ఏడాది ఇదే కాలంలోరూ.1586.7 కోట్లు లాభాలు చవిచూసిన సంస్థ ఈసారి విదేశాల్లో అమ్మకాలు తగ్గడమే కారణమని చెపుతోంది. నాలుగోత్రైమాసికంలో రాబడులు రూ.8528.4 కోట్లనుంచి 7546.4 కోట్లకు తగ్గాయి. ఇక ఉతనతర అమెరికాలో జనరిక్ డ్రగ్స్ అమ్మకాల ద్వారా రాబడులు 51శాతం తగ్గి రూ.3558.6 కోట్లనుంచి రూ.1756.2 కోట్లకు చేరాయి. అదే భారత్‌లో జనరిక్ ఔషధాలు 20శాతం సేల్స్ పెరిగి రూ.1304.7 కోట్లనుంచి రూ.1566.3 కోట్లకు పెరిగాయి. అదేవిధంగా జనరిక్స్ రాబడులు యూరోప్‌లో 14శాతంపెరిగి రూ.1275 కోట్లనుంచి రూ.1452కోట్లకు చేరాయి. మొత్తం నాలుగో త్రైమాసికంలో వ్యయాలు రూ.7826.7 కోట్లుగా ఉన్నాయి. ఇక 2026 ఆర్థికసంవత్సరంలో నికర లాభం రూ.4157.6 కోట్లుగా ఉంది. అదే గత ఏడాది రూ.5725.2 కోట్లుగా ఉంది. మొత్తం లావాదేవీలతో రాబడులు రూ.33,700.2 కోట్లుగా ఉన్నాయి. కంపెనీ ఛైర్మన్ ఎండి జివిప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది తక్కువస్థాయిలో లెనాలిడోమైడ్ విక్రయాలతోపాటుమరికొన్ని మందుల సేల్స్ తగ్గడం ప్రభావంచూపించిందని, అలాగే కరెన్సీ హెచ్చుతగ్గులప్రభావం కూడా లేకపోలేదన్నారు.




# ఐదేళ్లలో గ్లోబల్‌స్థాయిలో 92 వేలమందిపై వేటు

**న్యూఢిల్లీ,మే 12:** ప్రపంచవ్యాప్తంగా ఎఐ సేవలు అందుబాటులోకి రావడంతో ఈ ఐదునెలల కాలంలోనే92వేల మందికి పైగా ఉద్యోగులు ఉపాధి కోల్పోయారు. ఒక్క ఏప్రిల్‌లోనే 45వేల మంది ఉద్యోగులపై వేటు పడింది. కరోనా మహమ్మారి సమయంలో భారీగా నియామకాలు చేపట్టిన కంపెనీలు, ఇప్పుడు ఖర్చుల నియంత్రణ, కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సామర్థం పెరగడం వంటి కారణాలతో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. మెటా, స్నాప్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, బ్లాక్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు ఈ ఏడాది ఉద్యోగాల కోతను ప్రకటించాయి. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, ఈ లేఆఫ్స్‌లో అతిపెద్ద అడుగు వేసింది. దాదాపు 8వేల మంది ఉద్యోగులను, అంటే మొత్తం సిబ్బందిలో 10 శాతం మందిని మే 20 నాటికి వైదొలగాలని ఆదేశించింది.మరో ఆరువేల ఖాళీలు భర్తీ చేయకుండా నిలిపివేసింది. మరోవైపు ఏఐ అభివృద్ధి కోసం భారీగా మూలధన వ్యయం చేస్తోంది. స్నాప్‌చాట్ మాతృసంస్థ స్నాప్ కూడా 1,000 మంది ఉద్యోగులను తొలగించింది. తమ కోడింగ్‌లో 65 శాతానికి పైగా ఏఐ సాంకేతికతే పూర్తిచేస్తోందని, దీంతో చిన్న బృందాలతోనే పని చేయగలమని సీఈఓ ఇవాన్ స్పీగెల్ తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.